


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 128

శనివారం 29-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నేడు మొహర్రం (యౌమె ఆషూరా)

● ఇమామ్ త్యాగం

స్మరణీయం స్ఫూర్తిదాయకం

ఇస్లామీ క్యాలండరు ప్రకారం 'ముహర్రం' ఒక ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన మాసం. ఇది ముస్లిమ్ జగత్తుకు నూతన సంవత్సరం. ముహర్రం మాసంతోనే ఇస్లామీయ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇస్లామ్‌కు పూర్వం అప్పటి సమాజంలో కూడా కొత్తసంవత్సరం 'ముహర్రం' నుండే ప్రారంభమయ్యేది. ముహమ్మద్ ప్రవక్త(స) ముహర్రం మాసాన్ని అల్లాహ్ నెల అని అభివర్ణించారు. రమజాన్ రోజాల (ఉపవాసాలు) తరువాత అత్యంత శుభప్రదమైన రోజా ఆషూరా రోజానే. అంటే ముహర్రం పదవ తేదీన పాటించే రోజా అన్నమాట. రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించక ముందు ఆషూరా రోజాయే ఫర్జ్ రోజాగా ఉండేది. కాని రమజాన్ రోజాలు విధిగా నిర్ణయించబడిన తరువాత ఆషూరా రోజా నఫిల్‌గా మారిపోయింది.

కాకతాళీయంగా 'కర్బలా' సంఘటన కూడా ఇదే రోజున జరగడం వల్ల దీని ప్రాముఖ్యత మరింతగా పెరిగిపోయింది. అంత మాత్రాన ముహర్రం మాసమంతా విషాద దినాలుగా పరిగణించడం, ఎలాంటి శుభకార్యాలూ నిర్వహించక పోవడం సరికాదు. ఎందుకంటే సత్యం కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం, హక్కులకోసం, ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరగతి పొందారు. ధర్మయుద్ధంలో అమరుడు కావడం మానవ సహజ భావోద్రేకాలపరంగా బాధాకరం కావచ్చునేమోగాని, లౌకికంగా సత్కర్మల ఆచరణ అనివార్యంగా జరగాల్సిన నేపథ్యం లో పూర్తిగా విషాదానికి పరిమితం కావడమూ అంత సరికాకపోవచ్చు. ముహమ్మద్ ప్రవక్త(స) నిర్యాణం తరువాత తొలి నలుగురు ఖలీఫాల సారథ్యంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ జనరంజకమైన ప్రజాస్వామ్య పాలన పరిఢవిల్లింది. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో మొట్టమొదటి సూత్రం,'దేశం దైవానిది, దేశవాసులు ఆయన పాలితులు'. అంతేకాని పాలకులు ప్రజలకు ప్రభువులు ఎంతమాత్రం కాదు. ఇస్లామీయ రాజ్యానికి దైవభీతి, సచ్ఛీలత, జవాబుదారీతనం ప్రాణం లాంటివి. పాలకులు ఈ సుగుణాలకు ప్రతిరూపంగా, ఆదర్శంగా ఉండేవారు. అధికారులు, న్యాయమూర్తులు, సేనాపతులు, అన్నిశాఖల అధికారులు ఎంతో నిజాయితీపరులుగా, న్యాయ ప్రేమికులుగా ఉండేవారు. అనుక్షణం దైవానికి భయపడుతూ, ప్రజాసేవలో ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తపడేవారు. ప్రజలకు సమాధానం చెప్పుకునే విషయంలో కూడా వారు, 'ఎప్పుడైనా, ఎక్కడైనా తాము ప్రజలకు జవాబుదారులమని భావించేవారు. ప్రతిరోజూ నమాజుల సమయంలో ప్రజల్ని కలుసుకొని, వారి అవసరాలు తీర్చేవారు. అవసరమైన సూచనలు, హితవులు చేసేవారు. కాని ఖలీఫాల తదనంతర కాలంలో పరిస్థితులు మారిపోయాయి. దైవభీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య భావనలకు భంగం ఏర్పడింది. యజీద్ రాచరికం రూపంలో పురుడు పోసుకున్న దుష్పరిణామాలు ఇస్లామీయ ప్రజాస్వామ్య భావనను, ఆ సూత్రాలను తుంగలో తొక్కాయి. ఈ విధంగా కుటుంబ పాలన, చక్రవర్తుల పరంపర ప్రారంభమైంది. ఈ దురదృష్టకర పరిణామాల కారణంగా ముస్లిం సమాజం నేటి వరకూ ఇస్లామీయ ప్రజాస్వామ్య స్ఫూర్తికి దూరంగానే ఉండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ప్రజాస్వామ్య పరిరక్షణకు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) కంకణబద్ధులయ్యారు. లక్ష్యసాధన కోసం ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోడానికి సిద్ధపడ్డారు. విలువల పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడలేదు.

ప్రజాకంటకమైన రాచరిక వ్యవస్థను ఎదుర్కొన్న క్రమంలో సంభవించిన పరిణామ ఫలితాలు ఈనాడు మన ముందున్నాయి. ఇమామె హుసైన్ ఇంతటి ప్రమాదాన్ని కూడా లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి, ఇస్లామీయ ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యాన్ని, దాని ప్రత్యేకతల్ని కాపాడుకోడానికి 'కర్బలా' సాక్షిగా ఒక విశ్వాసి పోషించవలసిన పాత్రను ఆచరణాత్మకంగా నిరూపించారు. అందుకే ఆ మహనీయుడు అమరుడై దాదాపు వేయిన్నర సంవత్సరాలు కావస్తున్నా, నేటికీ కోట్లాదిమంది ప్రజలకు, ప్రజాస్వామ్య ప్రియులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అందుకే ప్రతి యేటా 'మొహర్రం' పదవ తేదీన (యౌమె ఆషూరా) ఆయన త్యాగాన్ని స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు హజ్రత్ ఇమామె హుసైన్ (ర) అమరత్వం ఆషామాషీ మరణం కాదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ధర్మసంస్థాపన, దైవప్రసన్నతే ధ్యేయంగా సాగిన సమరంలో పొందిన వీరమరణం. అందుకని ఆయన ఏ లక్ష్యం కోసం, ఏ ధ్యేయం కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరుడయ్యారో మనం దాన్నుండి స్ఫూర్తిని పొందాలి.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



సమాజంలో దుర్మార్గం ప్రబలినప్పుడు, ఉన్మాదం జడలు విప్పినప్పుడు, విలువల హననం జరుగుతున్నప్పుడు, ప్రజాస్వామ్య వ్యవస్థ బీటలు వారుతున్నప్పుడు సమాజ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామ్య ప్రియులు, న్యాయ ప్రేమికులు, పౌరసమాజం తక్షణం స్పందించాలి. న్యాయంకోసం, ధర్మం కోసం, మానవీయ విలువల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పరిధిలో శక్తివంచన లేకుండా పోరాడాలి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడల్లా దాన్ని కాపాడుకోడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. విలువల ప్రేమికులందరూ ఒక్కటిగా ముందుకు కదలాలి. దానికి ఇమామ్ త్యాగం స్ఫూర్తిగా నిలవాలి.

హెయిర్ కేర్

గోరువెచ్చని నూనెతో మర్దన

వర్షాకాలం శిరోజాల సౌందర్యం కాపాడుకోవాలంటే కొన్ని కనీస జాగ్రత్తలు...

- తలస్నానం చేయడానికి రెండు గంటల ముందు గోరువెచ్చని నూనె వెంట్రుకు కుదుళ్లకు పట్టించి, మృదువుగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల కురులు మృదుత్వాన్ని కోల్పోవు.
- తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్ రాసుకొని, పది నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా జెల్‌లో ఉండే ఔషధ గుణాలు చుండ్రును, వెంట్రుకలు చిట్లడాన్ని నివారిస్తాయి. దీంతో పాటు శిరోజాలలో ఉండే బాక్టీరియా, మాడుపై దురద.. వంటి సమస్యలను నివారిస్తాయి. వెంట్రుకలు పెరగడానికి కూడా దోహదం చేస్తాయి.



- తలస్నానానికి రసాయన గాఢత తక్కువగా ఉన్న షాంపూలనే వాడాలి.
- తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల శాతం ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. సోయాబీన్, గుడ్లు, కొవ్వు తక్కువగా ఉండే ఛీజ్, బీన్స్.. వంటివి ఉండేలా జాగ్రత్తపడాలి.
- తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో చేసిన సలాడ్స్ ఈ కాలం తీసుకోవడం చాలా అవసరం. అలాగే మొలకెత్తిన గింజలను సలాడ్ రూపంలో తీసుకోవాలి. ఆహారంలో ఈ తరహా పదార్థాలు చేర్చడం వల్ల శరీరానికి తగినన్ని పోషకాలు అంది జుట్టు రాలడం తగ్గుతుంది.
- కాఫీ, టీ లలో ఉండే కెఫిన్ వెంట్రుకలు రాలడానికి దోహదం చేస్తుంది. కాఫీ, టీలకు బదులుగా పండ్లరసాలు, పాలు, హెర్బల్ టీ... వంటి కెఫిన్ లేని ద్రవపదార్థాలను తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు వర్షాకాలంలో ఎదురయ్యే శిరోజాల సమస్యలను దూరం చేస్తాయి.

కిచెన్ టిప్స్



- కిచెన్ ర్యాక్స్‌లో బొద్దింకలు తిరుగుతూ ఇబ్బంది పెడుతుంటాయి.. ర్యాక్స్‌లో అక్కడక్కడా బిర్యానీ ఆకులను ఉంచితే, బొద్దింకలు చేరవు.



- వేడిగా ఉన్న ఆయిల్‌లో టొమాటో, ఉల్లిపాయ పేస్టు వేసినప్పుడు నూనె ఒక్కసారిగా చిందుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే.. కాగిన నూనెలో ముందుగా నీళ్ల కలిపిన పసుపు మిశ్రమం కొద్దిగా వేసి కలపాలి. తరువాత ఉల్లిపాయ, టొమాటో పేస్టు వేస్తే ఆయిల్ పైకి చిందదు.



- బాగా మురికిపట్టిన గ్యాస్ లైటర్‌ను ముందుగా కొద్దిగా ఫ్లోర్ క్లీనర్ వేసి తుడవాలి. తరువాత నిమ్మచెక్కకు కొద్దిగా బేకింగ్ సోడా అద్ది లైటర్‌పై ఉన్న మొండి మరకలపై రుద్దితే కొత్తదానిలా మెరుస్తుంది.

* మనం మాట్లాడుకోవాల్సిందే!

పిల్స్ వాడుతున్నారా!?

నిద్రపట్టడం లేదు.. ఆందోళనగా ఉంది.
మూడ్ బాగోలేదు.. స్ట్రెస్‌గా ఉంది.
వీటన్నింటికీ మనవాళ్లు ఎంచుకుంటున్న మార్గం 'పిల్'.
ఒక మోతాదులో టాబ్లెట్ వాడితే
సమస్య తగ్గిపోతుంది కదా! అనుకుంటారు.
ఇది చెడు అలవాటు కాదనుకుంటారు.
కానీ, ప్రతి చిన్న అనారోగ్య సమస్యకు
టాబ్లెట్ వేసుకోవడం కూడా వ్యసనమే.



నేటి రోజుల్లో చాలామంది వర్క్ టెన్షన్ అనో, స్ట్రెస్ అవుతున్నామనో స్లీపింగ్ పిల్స్‌కు అలవాటు పడిపోయేవారు పెరుగుతున్నారు. వీటిని ముందుగా డాక్టర్ని కలిసి వారి సలహాతో తీసుకోవడం మొదలుపెడతారు. ఆ టాబ్లెట్ వేసుకున్న కొన్ని రోజులు బాగా అనిపించి, ఆ పాత ప్రిస్క్రిప్షన్ పైన ఆ టాబ్లెట్లను అలాగే కంటిన్యూ చేస్తుంటారు. యాంగ్జైటీ పిల్స్, స్ట్రెస్ పిల్స్, మూడ్ ఎలివేటర్స్.. ఇలా విభిన్న రకాలుగా ఉండే ఈ పిల్స్‌ను ఆందోళనగా అనిపించినప్పుడల్లా వాడతారు, క్రమేణా వాటికి అలవాటు పడిపోయి మరిన్ని సమస్యల్లోకి కూరుకుపోతున్నారు.

•••

వసుధ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రాజెక్ట్ టీమ్ లీడర్‌గా బిజీ షెడ్యూల్ తనది. ఓ వైపు కుటుంబం, మరోవైపు ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం. కొన్నాళ్లు బాగానే మేనేజ్ చేసినా ఎదురయ్యే సమస్యలు టెన్షన్ పెట్టేవి. దీంతో ఆందోళన పెరిగిపోయేది. ఒత్తిడిని తగ్గించుకోవాలంటే బాగా నిద్రపోవాలని చెబుతుండేవారు స్నేహితులు. కానీ, ఆ ఒత్తిడి వల్లే నిద్ర పట్టడం లేదనేది వసుధ కంప్లైంట్. ఫ్రెండ్ సలహా మేరకు డాక్టర్ని కలిసింది. కొన్ని రోజులు ఆందోళన తగ్గడానికి ఒక మెడికల్ కోర్సును వాడమని చెప్పాడు డాక్టర్. ఆ కోర్స్ వాడాక తనకు చాలా రిలీఫ్‌గా అనిపించింది. ఆందోళనగా అనిపించినా, పనిభారంతో తల బరువుగా అనిపించినా అవే టాబ్లెట్స్ తెచ్చుకొని వాడటం మొదలుపెట్టింది. ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు టాబ్లెట్ లేనిదే పరిష్కారం కాదు అనేంత స్థాయికి వచ్చేసింది. నిద్ర పట్టడం లేదని రాత్రిళ్లు స్లీపింగ్ పిల్స్ వేసుకునేది. కానీ, ఆఫీసుకు వెళ్లినా ఆ మత్తు ఆమెను వదిలేది కాదు. దీంతో తీసుకున్న ప్రాజెక్ట్ వర్క్స్ చేయడంలో ఆలస్యం అవుతూ ఉండేది. రోజులో ఎక్కువ సమయం మత్తుగా ఉండటంతో జాబ్ పోయే పరిస్థితి ఎదురైంది.

లాయర్, డాక్టర్, ఇంజినీర్.. ప్రతీ వృత్తి, ఉద్యోగం చేస్తున్నవారిలో ఎన్నో ఆందోళనలు ఎదుర్కోవడం చూస్తున్నాం. ఈ ఆందోళన స్థాయి వారి శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో సమస్యను సాల్వ్ చేసుకోవడానికి టాబ్లెట్స్‌ను ఆశ్రయించేవారు పెరుగుతున్నారు. శరీరానికి ఏ కొద్దిగా కెమికల్‌ను బయట నుంచి అలవాటు చేసినా మైండ్ మరికొంత మోతాదు పెంచేలా ప్రేరేపిస్తుంది. ఫలితంగా కెమికల్ మోతాదు శరీరంపై చెడు ప్రభావం చూపడానికి దోహదం చేస్తాయి.

సహజమే కానీ..

ఈ సమస్యను ఎదుర్కొనేవారిలో అధిక శాతం చదువుకున్నవారే. 'ఇదేమీ చెడు అలవాటు కాదు కదా! నేను సరైన విధంగా మానేజ్ చేసుకోగలుగుతున్నాను కదా' అనుకుంటారు. బయటి వాళ్లకు కూడా వీళ్ల 'పిల్స్'వాడుతున్నారనే విషయం తెలియదు. కొంత కాలం బాగానే గడిచిపోతుంది. కానీ, సమస్య మాత్రం పెరుగుతూనే ఉంటుంది.

- ఏ వ్యక్తిలో అయినా భావోద్వేగాలు మారిపోతుండటం సహజంగా జరుగుతుంది.
- కొందరు మాత్రం ప్రతి చిన్నదానికి ఆందోళన పడేవారుంటారు. మన వ్యక్తిత్వం ఇలాంటిది అని అర్థం చేసుకొని, ఈ సమస్యనుంచి బయటకు రావడానికి నిపుణులు సాయం తీసుకోవాలి.
- కొందరికి రకరకాల ఫోబియాలు ఉంటాయి. వీటిని అధిగమించడానికి కూడా టాబ్లెట్స్‌ని ఆశ్రయిస్తుంటారు. ఇవీ మానసిక సమస్యలే అని గుర్తించాలి.

బయటపడాలంటే టెక్నిక్స్

మనకు తెలియదు కానీ, చాలా మంది మహిళల పర్సులలో కొన్ని టాబ్లెట్లు ఉంటాయి. అవి, పెయిన్ కిల్లర్స్, మూడ్ స్టెబిలైజర్స్, స్ట్రెస్ పిల్స్, స్లీపింగ్ పిల్స్... వంటి వాటిలో ఏవైనా ఉండచ్చు. ముందుగా వాటిని బయట పడేయాలి.

- ఏ సమస్య బాధిస్తోందో దానిని కుటుంబ సభ్యుల మధ్య లేదా నిపుణుల ముందు వ్యక్తం చేయాలి. ఆ సమస్యకు సంబంధించిన బ్లాక్స్‌ను క్లియర్ చేసుకుంటే సులువుగా బయటపడచ్చు.
- ప్రతి ఒక్కరిలోనూ సాధారణ ఆందోళనలు ఉంటాయి. కానీ, కొంతమంది మాత్రం ప్రతి చిన్న విషయానికీ ఆందోళన పడిపోతుంటారు. ఇది కొన్నిరోజులకు పెద్ద ఆందోళనగా మారుతుంటుంది. ఆందోళన తగ్గించుకోవడానికి పిల్స్ వాడకం బదులు, దానిని అధిగమించేలా మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాలి.
- శరీరం కెమికల్ మీద ఎంతవరకు డిపెండ్ అయిందో గుర్తించి దానిని బ్రేక్ చేస్తాం. మైండ్‌ను రిలాక్స్‌గా ఉంచే యోగా, ధ్యానంతోపాటు సరైన పోషకాహారం మీదా దృష్టి పెట్టాలి.
- శరీరం బయట నుంచి తీసుకునే కెమికల్ కాకుండా సహజసిద్ధంగా మార్పులకు లోనయ్యేలా అలవాటు చేసుకున్నప్పుడు ఇంటర్నల్ సిస్టమ్ రీ యాక్టివేట్ అవుతుంది.



– డాక్టర్ గిడియన్, డి–అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

బుద్ధి గడ్డి తినడం కాదిది.
బుద్ధిగా గడ్డి ప్లేట్‌లో తినడం.
పర్యావరణ పరిరక్షణ పట్ల బుద్ధి వచ్చిన తర్వాత చేసే పని.
దీనికి పెట్టిన అందమైన పేరే బయో డిగ్రేడబుల్ టేబుల్ వేర్.

బుద్ధిగా తిందాం!




రిషభ్, రోహన్

కేరళకు చెందిన రిషభ్, రోషన్ సోదరుల ప్రయోగం ఇది. సముద్రాన్ని కూడా వదలని కాలుష్యం నుంచి తీసుకున్న నిర్ణయం. వీళ్ల ప్లేట్‌ల తయారీకి వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారు. వేడుకల సందర్భంగా ఇప్పుడు ఉపయోగిస్తున్న ఫైబర్, పాలిథిన్ పొర ఉన్న పేపర్ ప్లేట్‌లలో భోజనం చేసి బయట పారేసినప్పుడు చెత్త కుండీల దగ్గర చేరిన కుక్కలు, ఆవులు, ఇతర జంతువులు ఆ ప్లేట్లలో మిగిలిపోయిన ఆహారంతోపాటు ప్లేట్లను కూడా నమిలి మింగేస్తుంటాయి. దాంతో అవి అనారోగ్యాల బారిన పడుతుంటాయి. ఫైబర్ బదులు బయో డీగ్రేడబుల్ ప్లేట్ వాడినట్లయితే... మూగజీవులు మనం పారేసిన మిగులు ఆహారంతోపాటు ప్లేట్‌ని తిన్నప్పటికీ వాటి ఆరోగ్యానికి ఎటువంటి హానీ కలగదు. ఈ ప్లేట్‌లను నానబెట్టి ఎరువుగా మార్చుకుని పంటకు వాడుకోవచ్చు. ఏమీ చేయకుండా వదిలేసినా కూడా ఈ మెటీరియల్ మట్టిలో కలిసిపోయి ఆ మట్టి జవజీవాలను పెంచుతుంది.



బయో డీగ్రేడబుల్ ప్లేట్



బయో డీగ్రేడబుల్ ప్లేట్‌లో ఆహార పదార్థాలు

■ గడ్డి కంచం ఇలా పుట్టింది!

అసలీ గడ్డి ప్లేట్ ఆలోచన ఎలా వచ్చిందంటే... రిషభ్‌కి సర్ఫింగ్ ఇష్టం. కేరళ, కోవళమ్, అరేబియా సముద్రంలో సర్ఫింగ్ చేసేవాడు. సముద్రపు అలలను తప్పించుకుంటూ బోర్డు మీద పెడలింగ్ చేయడం అత్యంత సాహసంతో కూడిన ఆట. ప్రాక్టీస్‌లో ఉన్నప్పుడు రిషభ్ తలకు, దేహానికి పాలిథిన్ పేపర్, ప్లాస్టిక్ వస్తువులు తగులుతుండేవి. ఒక్కోసారి పాలిథిన్ షీట్ వచ్చి కాళ్లకు చుట్టుకునేది. ఇలాంటిదే మరో సంఘటన ఈ సోదరులిద్దరికీ ఆఫ్రికాలోని ఉగాండా దేశంలో ఎదురైంది. అక్కడి పర్వత శిఖరాల మీదకు ట్రెకింగ్ చేస్తున్నప్పుడు ఎటు చూసినా ప్లాస్టిక్ కాలుష్యమే. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడం కంటే పాలిథిన్ వ్యర్థాలను తప్పించుకుంటూ అడుగులు వేయడంతోనే ట్రెకింగ్ పూర్తయింది. ఈ సమస్య ఒక్క కేరళనే కాదు, ప్రపంచం అంతటినీ వేధిస్తోందనిపించింది. పర్యావరణం ఎదురుగా భూతంలా నిలిచిన ఈ సవాల్‌కు జవాబు వెతికే ప్రయత్నంలో వీరికి వచ్చిన ఆలోచన ఈ బయో డీగ్రేడబుల్ టేబుల్ వేర్. క్వాడ్రాట్ పేరుతో మొదలు పెట్టిన ఈ ప్రయోగంలో ప్లేట్ తయారీకి తవుడు, పొట్టు, గడ్డి ఉపయోగించారు. ఇరవై నెలల నిరంతర పరిశోధన, ప్రయోగాలతో ఒక రూపం వచ్చింది. వేడుకల్లో ఉపయోగించే పేపర్ ప్లేట్, అల్యూమినియం ఫాయిల్ అద్దుకున్న ప్లేట్, ఫైబర్ ప్లేట్‌ల స్థానాన్ని భర్తీ చేయగలుగుతుందా అనే పరీక్షలన్నింటినీ ఈ బయోడీగ్రేడబుల్ ప్లేట్ పాసయింది.

■ ఇలా చేస్తున్నారు!

పంట పొలాల నుంచి గడ్డిని, రైస్ మిల్లుల నుంచి తవుడు, పొట్టు సేకరించి శుభ్రం చేసిన తర్వాత హీటర్‌లో వేడి చేసి, మెత్తగా పొడి చేసి ప్లేట్, కప్పు, స్పూన్ ఆకారంలో ఉన్న మౌల్డ్ ఆధారంగా రూపం తెస్తారు. ఈ ప్లేట్‌లు భోజనం చేసేలోపు నానిపోతాయేమో అనే సందేహం కలుగుతుంది. పులుపు, రసం, మజ్జిగతో హాయిగా భోజనం చేయవచ్చని, నీటిలో నానబెట్టిన తర్వాత అరగంట సేపటి వరకు వాటి షేప్ మారదని చెప్పారు. అలాగే కప్పులు మరింత దృఢంగా 70 నిమిషాల సేపు ద్రవాలను నిలిపి ఉంచుతాయి. ఒకసారి తయారైన ఈ టేబుల్ వేర్‌ని ఏడాది పాటు నిల్వ ఉంచుకోవచ్చు.

■ విదేశాలకెళ్తున్నాయి!

ఢిల్లీ, ముంబయి, బెంగళూరు నగరాలతోపాటు అండమాన్ నికోబార్ దీవులు, మిజోరాం, నాగాలాండ్ రాష్ట్రాలు ఈ ప్రత్యామ్నాయాన్ని ఆదరిస్తున్నాయి. అంతేకాదు, యూఎస్, యూకే, కెనడా, మెక్సికోలు కూడా ఈ బయోడీగ్రేడబుల్ టేబుల్ వేర్‌కు స్వాగతం పలికాయి. నెలకు ప్లేట్‌లు, కప్పులు, స్ట్రాలు, స్పూన్‌లు అన్నీ కలిపి పాతిక వేలు అమ్ముడవుతున్నాయని చెప్పారు రిషభ్, రోహన్‌లు.

పొట్ట ఉబ్బిపోతుంది!

జంతువులు మనం తినే ఆహారం వైపు చూస్తున్నాయంటే వాటికి వాటి ఆహారం దొరకడం లేదని అర్థం. వీధికుక్కలతోపాటు ఆవులు మరికొన్ని జంతువులు ఓ దశాబ్దకాలంగా జీర్ణవ్యవస్థ సమస్యలతో మరణిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ వ్యర్థాలను వరుసగా నెలరోజుల పాటు తిన్నాయంటే వాటి పెద్దపొట్టలో పదహారు నుంచి పద్దెనిమిది కిలోల ప్లాస్టిక్ పేరుకుంటుంది. ఐదారు కిలోలు చేరినప్పటి నుంచి వాటికి ఇబ్బందులు మొదలవుతాయి. గ్యాస్‌తో కడుపు ఉబ్బిపోతుంది. అక్యూట్ బ్లోటింగ్‌తో కొద్ది రోజుల్లోనే మరణిస్తాయి. ఎవరి పెంపకంలో లేని జంతువులకు ఈ ప్రమాదం ఎక్కువ. పరిస్థితి ఎంత దయనీయమంటే... ఆవులు నెమరు వేసుకునే ప్రక్రియలో ఆహారాన్ని తిరిగి నోట్లోకి తెచ్చుకున్నప్పుడు ఫైబర్, ప్లాస్టిక్ వ్యర్థాలు ముక్కలు ముక్కలుగా బయటపడుతుంటాయి. బయటపడడం కొంతలో కొంత నయం. పాలిథిన్ కవర్లు లోపల చుట్టచుట్టుకుని పోతే వాటంతట అవి బయటకు రాలేవు. ఆపరేషన్ చేయడమే మార్గం. ఈ జంతువులకు వైద్యం చేసి ప్రాణాలు కాపాడాలన్నా కూడా ప్లాస్టిక్ పెద్ద పొట్టలో ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం. అవి విసర్జక వ్యవస్థలోకి వెళ్లాయంటే ఇక ఏమీ చేయలేం. మరణాన్ని ఆపలేం.



– డాక్టర్ మల్లేశ్ పాటిల్,
అసిస్టెంట్ డైరెక్టర్, యానిమల్ హజ్బెండరీ,
ఆంధ్రప్రదేశ్

శనివారం 29-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 128



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం

ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. -11లో



సెమీకండక్టర్ సంస్థలకు సాయం

దేశంలో సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పే సంస్థలకు 50% ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



భారత్ కీలకం

స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ సాధనలో భారత్ అనివార్య భాగస్వామి అని జపాన్ విదేశాంగ మంత్రి హయాషి పేర్కొన్నారు.


వివరాలు 6లో ▸



పట్టువీడని విపక్షాలు

మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ ఎందుకు నోరువిప్పడం లేదంటూ విపక్ష ఎంపీలు పార్లమెంటులో ఆందోళనకు దిగారు.

వివరాలు 6లో ▸



'మార్పు'లతో అల్లకల్లోలం

2022లో 81 విపత్తులు ఆసియా దేశాలను వణికించాయని ప్రపంచ వాతావరణ సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

- వివరాలు 5లో▶

ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణకు లైన్ క్లియర్?



వేతన సవరణకు ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. 31న జరిగే కేబినేట్ భేటీ ఎజెండాలో ఆర్టీసీ ఆర్థిక అంశాలను చేర్చటంతో ఈ చర్చ జరుగుతోంది.

- వివరాలు 5లో▶


మహారాష్ట్ర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా కల్వకుంట్ల వంశీధర్‌రావు



బీఆర్‌ఎస్ మహారాష్ట్ర యూనిట్‌కు 15 మందితో తాత్కాలిక స్టీరింగ్ కమిటీని పార్టీ అధినేత కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీ తక్షణమే మనుగడలోకి రానుంది.

- వివరాలు 5లో▶

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు



వైఎస్ వివేకా హత్యకేసులో భాగంగా హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసిన చార్జిషీట్‌లో సీబీఐ తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేసిందని అజేయ కల్లం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

- వివరాలు 11లో▶

ఇవాంటివోటర్



ఆయన టేబుల్ మీద ఎరుపు రంగులో ఉన్న ఏ వస్తువూ పెట్టొద్దని చెప్పానా...!!



పల్లె నీట మునిగిన మోరంచపల్లి

19 ప్రాణాలు 10 లక్షల ఎకరాలు కుండపోతతో గుండె చెరువై

భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రం అతలాకుతలం.. నాలుగు జిల్లాల్లో తీవ్ర నష్టం

- నిండా నీటిలో మునిగి ఘొల్లుమంటున్న ఓరుగల్లు
- సర్వం కోల్పోయి బోరుమంటున్న మోరంచపల్లి
- బంధువులను కోల్పోయిన ఆవేదనలో కొండాయి
- 10 లక్షల ఎకరాల్లో పంట నష్టంతో ఆవేదనలో రైతన్న
- మహోగ్రంగా గోదావరి.. కృష్ణానదికి జలకళ

భద్రాచలం వద్ద మహోగ్రంగా గోదావరి.. 53 అడుగులకు నీటిమట్టం



బియ్యం, పప్పుల నుంచి టీవీ, ఫ్రిడ్జ్, వాహనాల దాకా అన్నీ తడిసి పాడైపోయి.. గొడ్డు గోదా కొట్టుకుపోయి.. ఏ ఆధారమూ లేక, ఏం చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న మోరంచపల్లి గ్రామస్తులు.

భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన 19 మంది. ఇందులో ఒక్క కొండాయికి చెందినవారే 8 మంది. వీరిలోనూ ఏడుగురు దగ్గరి బంధువులు. ఇంకా ఆచూకీ లభ్యంకాని వారు పదుల సంఖ్యలోనే..

ముందు వానలు పడలేదని పత్తి వేస్తే ఎండిపోయి, తీరా మొలకెత్తాక నీటితో పొలాలు నిండిపోయి.. వరి నారు, వేసిన నాట్లు అన్నీ కొట్టుకుపోయి.. నిండా మునిగిపోయామంటున్న రైతులు.

వివరాలు 2, 3,10 పేజీల్లో

గోదావరిలో నీటి మట్టం 53 అడుగులు దాటడంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ. లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు.

రాష్ట్రంలో గత పదిరోజుల్లో కురవాల్సిన దానికన్నా పదింతలు ఎక్కువ వర్షం పడింది. మొత్తంగా నైరుతి సీజన్‌కు సంబంధించి 65శాతం అధిక వర్షపాతం నమోదైంది.

వరదలపై వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు?: హైకోర్టు

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని ప్రభుత్వానికి ఆదేశం

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి: సీఎం

కడెంపై సీడబ్ల్యూసీ అధ్యయనం

పట్టణం వరద ముంపులో వరంగల్



పొలం మంథనిలో పొలాలను ముంచిన గోదావరి



ప్రాణం కొండాయి వరద మృతులు



సాయం భూపాలపల్లి జిల్లాలో హెలికాప్టర్ ద్వారా ఆహారం జార విడుస్తున్న ఐఏఎఫ్





తెలంగాణలో అంతా 'గ్రీన్'!

మంత్రి కేటీఆర్ వెల్లడి

ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో ప్రారంభం 3లో

31న కేబినెట్ భేటీ

- వచ్చే ఎన్నికల దృష్ట్యా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- ఎజెండాలో 40 నుంచి 50 వరకు అంశాలు.. నిరుద్యోగ భృతి లాంటి అమలు కాని హామీలు, పెండింగ్ అంశాలపై చర్చించే చాన్స్
- కొత్త పథకాల ప్రకటనపైనా పరిశీలన!

5లో

హైకోర్టు జడ్జీల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం

- వివరాలు 3లో▶

ఆగస్టు 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- రెండో శాసనసభ చివరి భేటీ ఇదే...
- 31న జరిగే కేబినెట్ సమావేశంలో ఎజెండాపై స్పష్టత.. శని, ఆదివారాల్లో అసెంబ్లీ సిబ్బందికి సెలవు రద్దు

5లో

చీటింగ్ 'మార్గ'ం మూత!

ఉషాకిరణ్, ఉషోదయలో మార్గదర్శి వాటాలు అటాచ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ కీలక నిర్ణయం

- చందాదారుల సొమ్ముతో అనుబంధ సంస్థల్లో అక్రమ పెట్టుబడులు
- ఉషాకిరణ్‌లో 88.50 శాతం.. ఉషోదయలో 44.55 శాతం
- ఆ వాటాల అటాచ్‌కు సీఐడీకి హోంశాఖ అనుమతి.. చందాదారులకు తెలియకుండా వారి పేరిట పిటిషన్లు దాఖలు
- న్యాయస్థానాన్నే మోసగించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్.. చట్టపరమైన చర్యలకు సీఐడీ సమాయత్తం
- రెండు కేసుల్లో రామోజీరావు, శైలజా కిరణ్‌పై చార్జ్‌షీట్లు దాఖలు
- త్వరలోనే మిగిలిన ఐదు కేసుల్లో కూడా.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ది అతిపెద్ద కార్పొరేట్ మోసం: సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్
- శుక్రవారం సాయంత్రం నుంచి మూతబడ్డ మార్గదర్శి వెబ్‌సైట్

11లో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు

క్లుప్తంగా...

రోడ్లు కాదు.. ఇళ్లు చూడండి

మంత్రి ఎర్రబెల్లి ఎదుట మహిళల నిరసన



కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను ప్రశ్నిస్తున్న మహిళ

హసన్‌పర్తి: 'మంత్రి గారూ.. రోడ్లు కాదు.. మా ఇళ్లలోకి వచ్చి చూడండి. వరద తీవ్రత ఎలా ఉందో.. 'అంటూ మహిళలు నిరసన తెలిపారు. వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలోని ముంపు ప్రాంతాన్ని శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఓట్లప్పుడు వచ్చి ఆ తరువాత ముఖం చాటేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇప్పటివరకు ఇళ్లులేవు.. జాగ లేదని అన్నారు. దీంతో మంత్రి అసహనానికి గురయ్యారు. ఇదేమిటంటూ కార్పొరేటర్ సునీల్‌ను ప్రశ్నించారు. కాగా 'మునిగిన మా ప్రాంతాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి చూస్తున్నారు.. పోతున్నారు.. కానీ సమస్య మాత్రం పరిష్కరించడం లేదు. దీనికి మీరు ఇక్కడి దాకా రావడం ఎందుకు?' అంటూ ఓ మహిళ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నిలదీసింది.



ఆక్రమణలతోనే వరద ముంపు

చెరువు శిఖాలు, నాలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల వరంగల్ నగరం వరద ముంపునకు గురవుతోందని ఎర్రబెల్లి అన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి నాలాలు, చెరువు శిఖాల్లో నిర్మాణాలు చేపట్టారన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సహాయక చర్యల కోసం కాంగ్రెస్ సమన్వయ కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా సహాయక చర్యలు అందించేందుకుగాను కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ సీనియర్ నేత, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి చైర్మన్‌గా, పార్టీ నేతలు సంభాని చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్, ఈరవత్రి అనిల్, చామల కిరణ్, బి.కైలాశ్‌కుమార్, బొల్లు కిషన్, ఉజ్మా షకీర్, నగేశ్ ముదిరాజ్, మన్నె సతీశ్, పవన్ మల్లాది, కౌశల్ సమీర్‌లను కమిటీలో సభ్యులుగా నియమిస్తూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరద సహాయక చర్యలు చేపట్టడంలో భాగంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించేందుకు గాంధీభవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పార్టీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావుతో పాటు 14 మంది హైదరాబాద్‌కు చెందిన నేతలకు ఈ కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

హైదరాబాద్-విజయవాడ హైవేపై రాకపోకల పునరుద్ధరణ



కోదాడ రూరల్: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్‌లోని కీసర టోల్‌గేట్ సమీపంలో ఐతవరం వద్ద శుక్రవారంరాత్రి 8.30 గంటలకు మున్నేరు వాగు వరద ఉధృతి తగ్గడంతో వాహనాల రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. డ్రైవర్లకు పోలీసులు పలు సూచనలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఒక్కొక్కటిగా ముందుకు పంపించారు. కోదాడలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి నేరుగా విజయవాడ వైపు వాహనాలను మళ్లించారు.

వరద బాధితులకు భారత వాయుసేన చేయూత

హెలికాప్టర్ ద్వారా ఆహారపొట్లాలు

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా ముంచెత్తిన వరదలో చిక్కుకున్నవారికి ఆహారం అందించేందుకు భారత వాయుసేన సిబ్బంది ముందుకు వచ్చారు. హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి 600 కిలోల ఆహారపొట్లాలను హెలికాప్టర్‌తో తీసుకెళ్లి ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు శుక్రవారం అందజేశారు. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి తీసుకెళ్లిన ఈ ఆహారపదార్థాలను ఎయిర్‌ఫోర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్(సంగినీస్ అని పిలుస్తారు) సభ్యులు సమకూర్చారు. గురువారం వరదలో చిక్కుకుని జేసీబీపైకి చేరిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా నైన్‌పాక గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని వాయుసేన సిబ్బంది హెలికాప్టర్ ద్వారా కాపాడిన విషయం తెలిసిందే.



వరద నీటిలో ఉన్న మైసయ్యనగర్

ముంపులోనే మైసయ్యనగర్

వరంగల్ నగరంలోని 35వ డివిజన్ మైసయ్యనగర్ ఇంకా వరద నీటిలోనే ఉంది. మాల అగర్త నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో మైసయ్యనగర్, శివనగర్‌లోని కొన్ని ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కొన్ని ఇళ్లలో ఉంటున్న వారు నిత్యావసర వస్తువులు, పాలకోసం నానా అవస్థలు పడ్డారు. కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్నామని, వర్షంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని మైసయ్యనగర్ వాసులు కోరుతున్నారు.



మేడారంలో తడిసి కుప్పకూలిన దుకాణాలు

ఓరు'ఘొల్లు'!

ఇంకా వరద ముంపులోనే వరంగల్‌లోని పలు ప్రాంతాలు

కొన్నిచోట్ల నీళ్లు తగ్గినా పేరుకుపోయిన బురదతో అవస్థలు

పారిశుధ్యం దెబ్బతినడంతో విజృంభిస్తున్న దోమలు

నగరంలో పునరావాస కేంద్రాలు : 17

ఆశ్రయం పొందుతున్న వారు: 3,810

కూలిపోయిన ప్రహరీలు. ఇంటినిండా అడుగు నుంచి మూడు అడుగుల మేర బురద.. తడిసిన సామాన్లు, విరిగిన చెట్ల కొమ్మలు..పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు. బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలన్నీ నీటి పాలు. తెగిన రోడ్లు.. వీధులన్నీ బురదమయం.. డ్రైనేజీల నిండా చెత్త..

ఇది వరంగల్ నగరంలో వరద ముంపు నుంచి తేరుకున్న కాలనీల దుస్థితి..

చుట్టూ వరద.. ఇళ్లకు తాళాలు.. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందినవారు ఒక వైపు.. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌లో వరద నీటితో రెండు, మూడవ అంతస్తుల్లో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నవారు మరోవైపు.

ఇది ఇంకా వరద ముంపులోనే ఉన్న వారి పరిస్థితి.



సొంతంగా పడవ చేసుకుని..

గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధి హంటర్ రోడ్డు సమీపంలోని రహమత్‌నగర్‌కాలనీ చెరువును తలపించింది. కాలనీలో సుమారు 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వరద ముంచెత్తడంతో గృహ నిర్మాణానికి ఉపయోగించే ప్లాస్టిక్ గంపలు, వెదురు బొంగులతో పడవను చేసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు.

వరంగల్ అర్బన్/హనుమకొండ/కాశిబుగ్గ/కాజీపేట అర్బన్: వరంగల్ మహానగరంలో నాలుగు రోజులుగా కురుస్తున్న అతి భారీ వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. గురువారం వరకు చాలాచోట్ల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. శుక్రవారం రోజంతా తెరిపిని వ్వడంతో బల్దియా యంత్రాంగం సహాయక చర్యలకు ఉపక్రమించింది. అయితే నిలిచిన వరద నీరు బయటకు వెళ్లేలా చూడాలంటూ స్థానికులు గ్రేటర్ వరంగల్ టోల్ ఫ్రీ నంబర్‌కు, వాట్సాప్‌కు, డీఆర్‌ఎఫ్ బృందాలకు ఫిర్యాదులు చేసినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యం దెబ్బతినడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరోగ్య సిబ్బందిని ఆదేశించినట్లు మేయర్ సుధారాణి తెలిపారు.

ఇంకా ముంపులోనే ఉన్న కాలనీలు..

వరంగల్ ప్రాంతంలో హంటర్ రోడ్ ఎన్టీఆర్ నగర్, గాయత్రీ కాలనీ, సాయినగర్ కాలనీ, సంతోషిమాత కాలనీ, ఉర్సు విమ్స్ ఆసుపత్రి కాలనీ, డీకే నగర్, రఘునాథ్ నగర్, ఓఎస్ నగర్, కాశిబుగ్గ పద్మానగర్, గాంధీనగర్, ప్రతాప్ నగర్, ఎస్‌ఆర్ నగర్, సాయినగర్, మధురావతి కాలనీ, లక్ష్మీ గణపతి కాలనీ, ఎంహెచ్ నగర్, వీవర్స్ కాలనీ, వాంబే కాలనీ, కేఎల్‌ఎన్ నగర్, మహేంద్ర నగర్ కాలనీ. హనుమకొండ ప్రాంతంలో కాపువాడ, పెద్దమ్మగడ్డ, సమ్మయ్య నగర్, విద్యానగర్, వికాస్ నగర్, గోపాల్‌పూర్, న్యూశాయంపేట, సుర్జీత్ నగర్, దీన్‌దయాళ్ కాలనీ, ప్రగతినగర్, కాజీపేట ప్రశాంత్ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, దర్గా రోడ్డు.

తేరుకున్న కాలనీలు ఇవీ..

సంతోషిమాత కాలనీలోని కొంత ప్రాంతం, నయీంనగర్, జవహర్‌నగర్, టీవీ టవర్ కాలనీ, కాశికుంట, గరీబ్‌నగర్, సాయినగర్, డీఆర్ నగర్, ఏకశిలనగర్, ఎస్‌ఆర్‌ఆర్ తోట, ఆకారపు వీరలక్ష్మీ కాలనీ.

ఒక్క లీడర్ రాలేదు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరద ఇంట్లోకి వచ్చింది. రోజూ ఎత్తిపోసుకుంటున్నం. ఇప్పుడు వర్షం తగ్గినప్పటికీ బురద మాత్రం మిగిలింది. దోమలు, దుర్వాసనతో పిల్లలు నిద్రపోవడం లేదు. ఇంతవరకు ఏ ఒక్క నాయకుడూ వచ్చి మా కష్టాలను తెలుసుకోలేదు. ఎన్నికల ముందు మాత్రం అందరూ వచ్చి అన్నీ చేస్తామని చెబుతారు.

–స్వప్న, జ్యోతిబసునగర్ కాలనీ ఫేజ్–2

కట్టుబట్టలతో మిగిలాం

మా నాగేంద్ర నగర్ కాలనీ మొత్తం మునిగిపోయింది. కట్టుబట్టలతో బయటకొచ్చాం. అధికారులు ఏర్పాటు చేసిన షెల్టర్‌లో తలదాచుకుంటున్నాం. కష్టం చేసుకొని బతికేవాళ్లం. చేతిలో రూపాయి లేక బాధపడుతున్నాం.

– విజయలక్ష్మి, నాగేంద్రనగర్

1,518 మందిని కాపాడిన అగ్నిమాపకశాఖ

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో అగ్నిమాపకశాఖ బృందాల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరదముప్పు ఉన్న పట్టణాలు, లోతట్టు ప్రాంతాల్లో పోలీస్‌శాఖ సిబ్బందితో కలిసి స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బందికి తోడు మరో 18 ప్రత్యేక బృందాలు సహాయకచర్యల్లో పాల్గొంటున్నాయని ఆ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. గురు, శుక్రవారాల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,518 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వీరిలో వరదలో చిక్కుకున్నవారు 121 మంది, మిగిలిన వారు వరదముంపు ప్రాంతాల్లో భవనాలపై చిక్కుకున్నవారు.

విషాద కొండాయి!

వరదలో కొట్టుకుపోయిన 15 మందిలో ఎనిమిది మంది మృతి

ఇంకా దొరకని మిగతా వారి ఆచూకీ

వీరంతా సమీప బంధువులే.. గ్రామంలో తీవ్ర విషాదం

వరద ముంపు నుంచి తప్పించుకునేందుకు మరోచోటికి బయలుదేరారు. వారిలో భార్యాభర్తలు, తండ్రీ కొడుకులు, బంధువులు ఉన్నారు. మధ్యలో వాగు పొంగుతుండటంతో.. ఒకరి చేతులు పట్టుకుని మరొకరుగా 15 మంది నడుచుకుంటూ వెళ్తున్నారు. కానీ ప్రవాహం ధాటికి అంతా కొట్టుకుపోయారు. ఇందులో ఎనిమిది మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. మిగతావారి ఆచూకీ కూడా ఇంకా దొరకలేదు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో జరిగిన విషాదం ఇది.

- ఏటూరునాగారం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కల్వర్టు ఉందనుకుని వెళ్తే..

భారీ వర్షాలతో గురువారం జంపన్నవాగు ఉప్పొంగి కొండాయి గ్రామాన్ని వరద చుట్టుముట్టింది. దీనితో 15 మంది పక్కనే ఉన్న మల్యాలలో తలదాచుకునేందుకు బయలుదేరారు. ఆ రహదారిలో ఉన్న వాగుపై ఇటీవలే పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. వరద తాకిడికి పైపులు, కల్వర్టు కొట్టుకుపోయాయి. అక్కడ వరద నిండుగా ప్రవహిస్తోంది. కానీ కల్వర్టు ఉందన్న ఉద్దేశంతో ఈ 15 మంది ఒకరినొకరు చేతులు పట్టుకుని దాటడం మొదలుపెట్టారు. కొంతదూరం రాగానే వాగులో పడి కొట్టుకుపోయారు. వీరిలో శుక్రవారం కొండాయి గ్రామానికి చెందిన గిరిజన మహిళ దబ్బగట్ల సమ్మక్క(60), భార్యాభర్తలు ఎండీ రషీద్ (55), కరీమా(45), తండ్రీకొడుకులు ఎండీ షరీఫ్ (60), అజహర్ (25), భార్యాభర్తలు మజీద్‌ఖాన్ (65), లాల్‌బీ (60), మరో వ్యక్తి ఎస్‌కే మహబూబ్‌ఖాన్ (58) ఉన్నారు. వీరిలో సమ్మక్క మినహా మిగతా ఏడుగురు సమీప బంధువులే. గల్లంతైన మిగతా వారి కోసం బంధువులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు.



జంపన్నవాగు ఉధృతికి కొట్టుకుపోయిన కొండాయి బ్రిడ్జి

8 ఏళ్లకే కుప్పకూలిన బ్రిడ్జి

గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కోసం కేంద్రం 2015లో ఐఏపీ గ్రాంట్ కింద రూ.5 కోట్లు మంజూరుచేయగా.. ఏటూరునాగారం మండలం దొడ్ల- కొండాయి గ్రామాల మధ్య జంపన్నవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించారు. కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో త్వరలోనే దెబ్బతినడం మొదలైందన్న ఆరోపణలు ఉన్నాయి. కొండాయిలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల కోసం నడిచిన లారీల బరువుతో 2019లో బ్రిడ్జి కాస్త కుంగిపోయింది. తర్వాత ఏటా వానాకాలంలో మరింత కుంగుతూ వచ్చింది. గత ఏడాది ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.6 కోట్లు మరమ్మతుల కోసం మంజూరైనా.. కానీ కాంట్రాక్టర్ పనులు చేయకుండా జాప్యం చేశాడు. ఇప్పుడు భారీ వరదకు బ్రిడ్జి మొత్తంగా కొట్టుకుపోయింది. దీని అవతల ఉన్న మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ, కొత్తూరు, ఐలాపురంతోపాటు మేడారం గ్రామానికి వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయింది.

తాత నన్ను కాపాడి చనిపోయాడు

ఏటూరునాగారంలో ఉండే సఫియా అనే యువతి.. ఇటీవలే కొండాయిలోని తాత మహబూబ్‌ఖాన్ ఇంటికి వచ్చింది. గురువారం గ్రామాన్ని వరద చుట్టుముట్టినప్పుడు తాత ముందుగా సఫియాను వాగు దాటించి వెనక్కి వచ్చాడు. తర్వాత మిగతా కుటుంబ సభ్యులతో కలసి వాగు దాటేందుకు ప్రయత్నించాడు. అప్పటికే వరదలో వారంతా గల్లంతయ్యారని సఫియా కన్నీరుమున్నీరైంది.

బోరుమంటున్న మోరంచపల్లి

సర్వం కోల్పోయిన దీన స్థితిలో గ్రామస్తులు

నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాల దాకా నష్టం

కోళ్లు, పశువులూ కొట్టుకుపోయిన వైనం

ఏ ఇంట్లో చూసినా ఒండ్రు మట్టే..

ఏం చేయాలో అర్థం కావడం లేదంటూ గ్రామస్తుల ఆవేదన

చేతుల్లోంచి జారిపోయింది..



ఈ ఫొటోలోని వ్యక్తి గడ్డం శ్రీనివాస్. ఆయన భార్య మహాలక్ష్మి గురువారం వరదలో కొట్టుకుపోయింది. ఇంకా ఆచూకీ లభించలేదు. "గురువారం తెల్లవారుజామున 4 గంటలకు వరద ఉధృతి పెరగడంతో ఇంట్లోంచి బయటికి వచ్చాం. భుజాల లోతున నీరు వేగంగా దూసుకువచ్చింది. ఇద్దరం కలసి అక్కడున్న రేకుల షెడ్డు స్తంభాన్ని పట్టుకున్నాం. కానీ నీటి వేగానికి మహాలక్ష్మి నా చేతుల్లోంచి జారిపోయింది. ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నించినా వరద నన్ను మరోపక్క నెట్టేసింది. కళ్ల ముందే కొట్టుకుపోయిన భార్యను కాపాడుకోలేకపోయా'' అంటూ శ్రీనివాస్ కన్నీటిపర్యంతమయ్యాడు.



అన్నీ వదిలి.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి మోరంచపల్లికి అల్లె నాగరాజు. వరదకు ఇంట్లోని బీరువాలో ఉన్న ఇంటి, భూమి పత్రాలు, చదువుకున్న సర్టిఫికెట్లు అన్నీ తడిసి ముద్దయ్యాయి. వాటిని ఆరబెడుతూ ఇలా దీనంగా కూర్చున్నాడు. అర్ధరాత్రి వరదతో అన్నీ వదిలేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపామని ఆయన వాపోయారు.

భూపాలపల్లి అర్బన్: మొత్తం 285 ఇళ్లు.. అందులో నాలుగు పూర్తిగా ధ్వంసమయ్యాయి.. మిగతావి పాక్షికంగా దెబ్బతిన్నాయి.. ఏ ఇంట్లో చూసినా పేరుకుపోయిన ఒండ్రుమట్టి.. చెల్లాచెదురుగా ఉన్న సామగ్రి.. బైక్‌లు, ఇతర వాహనాలు ఎక్కడున్నాయో తెలియదు.. తినటానికి తిండి లేదు.. తాగేందుకు నీరు లేదు.. కోళ్లు, పశువులు కొట్టుకుపోయాయి.. సర్వం కోల్పోయిన స్థితిలో జయశంకర్ జిల్లా మోరంచపల్లి గ్రామం బోరుమంటోంది. మరోవైపు గల్లంతైన నలుగురి ఆచూకీ దొరకక.. వారి కుటుంబాలు ఆవేదనలో కొట్టుమిట్టాడుతున్నాయి. గల్లంతైన గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ దంపతులు, గడ్డ మహాలక్ష్మి, గంగిడి సరోజనల ఆచూకీ కోసం గ్రామస్తులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు.

ఏ ఆధారమూ లేని పరిస్థితిలో..

గురువారం తనను చుట్టేసిన మోరంచవాగు వరద ఉధృతికి మోరంచపల్లి గ్రామం సర్వం కోల్పోయింది. ఇళ్లలో సుమారు 3 నుంచి 4 మీటర్ల ఎత్తు వరకు వరద నీరు చేరింది. ప్రతి ఇంట్లో బియ్యం, పప్పుల వంటి నిత్యావసరాల నుంచి టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాల దాకా వస్తువులన్నీ నీట మునిగిపోయాయి. కొన్ని వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. గ్రామంలో మొత్తం 285 ఇళ్లు ఉండగా 4 ఇళ్లు పూర్తిగా, 281 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒండ్రు మట్టి, ఇసుక మేట, చెత్తాచెదారంతో నిండిపోయాయి. శుక్రవారం వరద తగ్గాక గ్రామస్తులు ఇళ్లలో ఒండ్రుమట్టిని ఎత్తిపోస్తూ, తడిసిన వస్తువులను ఆరబెట్టుకుంటూ కనిపించారు. వరద తాకిడికి కొన్ని ఇళ్ల పునాదులు కూడా కదలడం, ఇంటి గోడలు, ప్రహరీలు కూలిపోవడం ఆందోళనకరంగా మారింది.

అన్నీ కొట్టుకుపోయి..

మోరంచపల్లి గ్రామం పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. దాదాపు ప్రతి ఇంట్లో కుటుంబ పోషణ నిమిత్తం గేదెలు, కోళ్లు పెంచుకుంటున్నారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు ఉన్నాయి. ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయి పొలాలు, చెట్లపొదల్లో చిక్కుకున్నాయి. కొన్నింటి ఆనవాళ్లు కూడా దొరకలేదు. మొత్తం 159 పశువులు, గేదెలు, 3 ఎద్దులు, 855 కోళ్లు, 3 బాతులు చనిపోయాయి. గ్రామ పరిసరాల్లో అక్కడక్కడా చనిపోయి ఉన్న గేదెలను అధికారులు శుక్రవారం జేసీబీల సహాయంతో గ్రామానికి దూరంగా తరలించి ఖననం చేశారు.

గ్రామస్తులకు భరోసా..

తీవ్రంగా నష్టపోయిన మోరంచపల్లి గ్రామాన్ని మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అధికారులు పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇక జీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సోదరుడు గండ్ర భూపాల్‌రెడ్డి రూ.10 లక్షలను గ్రామ ప్రజలకు ఆర్థిక సాయంగా అందించారు.

వానలకు 19 మంది బలి

- వాగులు దాటుతూ కొట్టుకుపోయినవారు కొందరు..
- చేపల వేట కోసమని వెళ్లి మునిగిపోయినవారు మరికొందరు..

సాక్షి నెట్‌వర్క్: భారీ వర్షాలు, వరదలు పలుచోట్ల తీవ్ర విషాదాన్ని నింపాయి. గత మూడు రోజుల్లో వాగులు, వరద నీటిలో పదుల సంఖ్యలో జనం గల్లంతుకాగా.. వారిలో కొందరి మృతదేహాలు గురు, శుక్రవారాల్లో బయటపడ్డాయి. దీనితో వారి కుటుంబాలన్నీ తీవ్ర విషాదంలో చిక్కుకున్నాయి. జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి వరకు 19 మంది మృతదేహాలను గుర్తించారు. గల్లంతైన వారి సంఖ్య ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉందని స్థానికులు చెప్తున్నారు.

- ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో జంపన్నవాగు వరదలో గల్లంతైన 15మందిలో ఎనిమిది మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలో గురువారం రాత్రి వరదలో గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ దంపతులు, గడ్డ మహాలక్ష్మి, గంగిడి సరోజన గల్లంతయ్యారు. వారి కోసం గ్రామస్తులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు కూడా వారి ఆచూకీ దొరకలేదు.
- సంగారెడ్డి జిల్లా కంది మండలం చిద్రుప్ప గ్రామ పెద్ద చెరువులో కృష్ణ అనే యువకుడు, మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్‌లో పడమంచి నర్సింహులు, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో రాములు చెరువులో చేపల వేటకు వెళ్లి మృతి చెందారు.
- ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన పెంద్ర సతీశ్ (23) గురువారం రాత్రి మున్నేటి వరదలో గల్లంతుకాగా.. శుక్రవారం మృతదేహం లభ్యమైంది.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం అయ్యన్నపాలెంకు చెందిన ఎస్‌కే గాలీబ్ పాషా (33) ఈ నెల 26న భార్యతో గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. శుక్రవారం తిప్పనపల్లి వద్ద వాగులో ఆయన మృతదేహం లభించింది.
- బుధవారం భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం కుమ్మరిపాడులోని పాములేరు వాగులో కొట్టుకుపోయిన కుంజా సీత (60) మృతదేహం శుక్రవారం మామిళ్లగూడెం శివారులోని వాగులో బయటపడింది.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వివిధ చోట్ల వాగుల్లో గల్లంతైన నలుగురు మరణించారు.
- కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి మొరంవాగులో రేకల కౌశిక్ (9), మోహన్ (40) కొట్టుకుపోయారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం వైపేట్‌కు చెందిన సంగం గంగాధర్ (45) స్థానిక వాగులో గల్లంతయ్యాడు.

గల్లంతై.. కరెంటు తీగలపై వేలాడి..

మేడారం జంపన్నవాగులో గల్లంతైన యాచకుడి మృతదేహం శుక్రవారం వరద తగ్గిన తర్వాత ఇలా కరెంట్ తీగలకు చిక్కుకొని కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని కరెంట్ తీగలపై నుంచి తొలగించి పంచనామా నిర్వహించారు.




ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గోదావరి పరవళ్లు


జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరవళ్లు

హైకోర్టు జడ్జిల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం


లక్ష్మీనారాయణ | అనిల్‌కుమార్ | సుజనా కళాసికం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా అలిశెట్టి లక్ష్మీనారాయణ, జూకంటి అనిల్‌కుమార్, సుజనా కళాసికం నియామకంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. వీరిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 12న కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు వీరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ శుక్రవారం రాత్రి ట్వీట్ చేశారు.

మహోగ్ర గోదావరి!

భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ

- 53.1 అడుగులకు పెరిగిన నీటిమట్టం.. హైఅలర్ట్ జారీ
- నేడు 54.5 అడుగులకు చేరవచ్చని సీడబ్ల్యూసీ హెచ్చరికలు
- ఎగువ గోదావరిలో అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- దిగువన భారీగా పెరిగిన వరద ఉధృతి

సాక్షి, హైదరాబాద్/మంథని: గోదావరి నది మహోగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ బ్యారేజీ నుంచి తెలంగాణలోని సీతమ్మసాగర్ దాకా అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతి పెరుగుతోంది. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో శుక్రవారం రాత్రి 9 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి వరద 14,32,336 క్యూసెక్కులకు, నీటిమట్టం 53.1 అడుగులకు చేరింది. దీనితో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో నీటి మట్టం 54.5 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) హెచ్చరించింది. దీనితో అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ముంపు ప్రాంతాలు, కాలనీల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. సహాయక చర్యల్లో పాలుపంచుకునేందుకు ఆర్మీ హెలికాప్టర్ భద్రాచలం చేరుకుంది. శనివారం మధ్యాహ్నం నాటికి నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పట్టనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎగువ నుంచి ప్రవాహాలు..

శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువన నుంచి శ్రీరాంసాగర్‌కు 1.75 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. 58వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కడెం నుంచి 25,517 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 6,44,871 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 6,94,482 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఈ నీటికి దిగువన ప్రాణహిత, ఇంద్రావతి, ఇతర ఉపనదులు, వాగులు తోడై.. లక్ష్మి బ్యారేజీ వద్ద 13,79,910 క్యూసెక్కులు, సమ్మక్కసాగర్‌కు 14,47,560 క్యూసెక్కులు, సీతమ్మసాగర్ వద్ద 13,48,091 క్యూసెక్కులు వరద నమోదైంది. ఆ నీరంతా దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా.. మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతి బ్యారేజీలోకి భారీగా వరద చేరడంతో చందనాపూర్ వాగు బ్యాక్ వాటర్ సరస్వతి పంపుహౌస్ సమీపంలోకి చేరింది. పంపుహౌస్ నుంచి బ్యారేజీ డెలివరీ వ్యవస్థ వరకు వేసిన పైపులైన్ల మీదుగా వరద ప్రవహించింది.

బిరబిరా కృష్ణమ్మ పరుగులు

సాక్షి, హైదరాబాద్/ గద్వాల రూరల్/దోమలపెంట: ఎగువన విస్తారంగా వానలు పడుతుండటంతో కృష్ణా ప్రధాన నదిలో వరద పెరుగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు దాదాపు నిండటంతో లక్షన్నర క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు 1.90 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. గేట్ల ద్వారా, విద్యుదుత్పత్తి ద్వారా 1,58,277 క్యూసెక్కులను వదిలేస్తున్నారు. దీనికి దిగువన ప్రవాహాలు తోడై.. శ్రీశైలం ప్రాజెక్టులోకి 1.25లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయంలో నీటి మట్టం 826.5 అడుగులకు, నిల్వ 46.13 టీఎంసీలకు చేరాయి. ఇక నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం 20వేల క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. ఎనిమిది గేట్లు ఎత్తి 19,223 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఈ ప్రవాహం పులిచింతలకు చేరుతోంది. అక్కడ నీటి నిల్వ 25.67 టీఎంసీలకు పెరిగింది. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రపై ఉన్న డ్యామ్‌లోకి 1,07,118 క్యూసెక్కులు ప్రవాహం చేరుతోంది. నీటి నిల్వ 59 టీఎంసీలకు చేరింది.

కడెం పరిస్థితిపై సీడబ్ల్యూసీ అధ్యయనం

- దెబ్బతిన్న గేట్లు, రక్షణ గోడ, స్పిల్‌వేల పరిశీలన
- భారీ ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టుకు ప్రమాదమేనన్న బృందం
- దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక ఇస్తామని వెల్లడి
- కడెం ప్రాజెక్టుకు భారీగా తగ్గిన వరద


కడెం గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: భారీగా వరదలు రావడం, గేట్లు సరిగా పనిచేయక ఆందోళన నెలకొనడం నేపథ్యంలో నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టును కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), డ్యామ్ భద్రత బృందం శుక్రవారం పరిశీలించింది. మొత్తం 24 మంది అధికారులు, సిబ్బంది డ్యామ్ ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేశారు. వరద గేట్ల పనితీరు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సామర్థ్యం, ఎడమ కాల్వ వద్ద కోతకు గురైన రోడ్డు వంటి వాటిని పరిశీలించారు. ప్రాజెక్టు అధికారులు గతేడాది ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలతో దెబ్బతిన్న గేట్లు, ఆప్రాన్ (రక్షణ గోడ), స్పిల్‌వేలను సీడబ్ల్యూసీ బృందానికి చూపించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, డ్యాం భద్రత నిపుణుడు ఏబీ పాండ్య మాట్లాడారు. కడెం ప్రాజెక్టు భారీగా వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రమాదం నెలకొని ఉందని, డ్యాం భద్రతకు సంబంధించిన పూర్తి నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తామని తెలిపారు. ప్రాజెక్టును పరిశీలించిన బృందంలో హైడ్రాలజిస్ట్ చీఫ్ ఇంజనీర్ రామరాజు, డ్యాం భద్రత నిపుణుడు టి.దేశాయి, జియాలజిస్ట్ ఎం.రాజు, హైడ్రో మెకానికల్ నిపుణులు కె.సత్యనారయణ, యోగేందర్‌కుమార్‌శర్మ, సీఈ శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్ కుమార్, ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ప్రాజెక్ట్ సిబ్బంది ఉన్నారు.

శాంతించిన కడెం.. గేట్లకు మరమ్మతులు

భారీ వరదతో ప్రాజెక్టును కోతకు గురిచేస్తుందా అన్న ఆందోళన రేపిన కడెం వాగు శాంతించింది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు శుక్రవారం ఉదయం 1,46,675 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సాయంత్రానికి బాగా తగ్గిపోయింది. రాత్రికి 13,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఏడు గేట్ల ద్వారా 20,998 క్యూస్కెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులుకాగా.. ప్రస్తుతం 685.150 అడుగులుగా ఉంది. రెండు రోజుల కింద తెరుచుకోకుండా మొరాయించిన 3వ నంబర్ గేటుకు సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. కాగా భారీ వరదతో ఎడమ కాల్వపై మైసమ్మ గుడి వద్ద రోడ్డు కోతకు గురైంది. అక్కడ మరమ్మతులు పూర్తిచేసేదాకా సాగునీటిని విడుదల చేసే అవకాశం లేదు. దీనితో వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తెలంగాణలో అంతా 'గ్రీన్'!



- మంత్రి కేటీఆర్ వెల్లడి
- ఐజీబీసీ గ్రీన్ ప్రాపర్టీ షో ప్రారంభం

మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఐజిబిసి గ్రీన్ ప్రాపర్టీషో 2023ను ప్రారంభించిన ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు తదితరులు

మాదాపూర్ (హైదరాబాద్): పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గ్రీన్ బిల్డింగ్ మూవ్‌మెంట్ 2001 నుంచి ప్రారంభమైందని, దాని ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉండడం గర్వకారణమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఐజీబీసీ (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) గ్రీన్ ప్రాపర్టీ షో–2023ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే మొదటి గ్రీన్ బిల్డింగ్, గ్రీన్ హోమ్స్, గ్రీన్ ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, ఫ్యాక్టరీ బిల్డింగ్‌లు తెలంగాణలో ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో గ్రీన్ ఫుట్‌ప్రింట్స్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భవనాలు, ఆస్పత్రులు, ఇండస్ట్రియల్ పార్కులు, ఐటీ పార్కులు ఐజీబీసీ ప్రమాణాలతో ఉండేలా చూస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన సెక్రటేరియేట్, టీహబ్, టీవర్క్స్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 33 జిల్లాల్లోని నూతన కలెక్టరేట్ భవనాలు, ప్రతి జిల్లాలో ఆస్పత్రులు, హెల్త్ కేర్ క్యాంపస్‌లు గ్రీన్ సర్టిఫికేషన్‌కు లోబడి ఉన్నాయని చెప్పారు. భవనాలే కాకుండా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ వంటి పట్టణాలు ఐజీబీసీ ప్రమాణాలను పాటిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో హరితహారం 24 శాతం నుంచి 33 శాతానికి పెరిగిందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఏఐపీహెచ్ గ్రీన్‌సిటీ అవార్డు హైదరాబాద్‌కి దక్కిందని చెప్పారు.

ఎనిమిదేళ్లలో 2.60 కోట్ల మొక్కలు

పట్టణాలు, గ్రామాలకు కేటాయించిన బడ్జెట్‌లో 10 శాతం పచ్చదన పరిరక్షణకు కేటాయించామని కేటీఆర్ తెలిపారు. గత 8 సంవత్సరాలలో 2.60 కోట్ల మొక్కలు నాటామని, వాటిలో కనీసం 85 శాతం మొక్కలను రక్షించే విధంగా కార్యక్రమాలను చేపట్టినట్టు చెప్పారు. గ్రామాలలో కూడా ఎల్ఈడీ లైట్లను అమర్చినట్టు తెలిపారు. వరంగల్‌లోని గంగాదేవి పల్లి గ్రామానికి గ్రీన్ విలేజ్ రేటింగ్‌లో ప్లాటినం అవార్డు వచ్చిందని చెప్పారు.

అన్ని పట్టణాల్లో స్వచ్ఛబడి

తెలంగాణలోని అన్ని పట్టణాల్లో స్వచ్ఛబడి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆసియాలోనే అతిపెద్ద వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ జవహర్‌నగర్‌లో ఉంది. బిల్డర్లు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రీచార్జి వంటి నాలుగు సూత్రాలను పాటించి గృహ నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. సీఐఐ (కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్) తెలంగాణ చైర్మన్, ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

శనివారం, 29 జూలై 2023

అటవీ సంరక్షణ ఇలాగేనా!

'నేను అరణ్యంలో సంచరించివచ్చిన ప్రతిసారీ ఆ వృక్షాలకు మించి ఎంతో ఎత్తుకెదిగిన భావన నన్ను చుట్టుముడుతుంది' అంటాడు అమెరికన్ ప్రకృతి ప్రేమికుడు హెన్రీ డేవిడ్ థోరో. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటానికి, మన కళ్లముందే చిన్నబోతున్న పర్యావరణానికి జీవం పోయడానికి అడవులు ఎంతగానో తోడ్పడతాయి. అందుకే లోక్‌సభలో ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో అతి ముఖ్యమైన అటవీ సంరక్షణ (సవరణ) బిల్లు ఆమోదం పొందటం ఆందోళన కలిగిస్తుంది. నాలుగు దశాబ్దాల క్రితం...అంటే 1980లో ఆమోదం పొందిన అటవీ సంరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదించింది. బిల్లు ప్రారంభంలోని లక్ష్య ప్రకటన ఎంతో ఉదాత్తమైనది. భూమండలం వేడెక్కి, పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్న వర్తమానంలో అడవుల విస్తరణ అత్యవసరమని ఆ ప్రకటన తెలిపింది. 2030 నాటికల్లా అదనంగా దాదాపు మూడువందల కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గిస్తామని పారిస్ ఒడంబడికలో మన దేశం హామీ ఇచ్చిన సంగతిని కూడా ప్రస్తావించింది. ఇవి సాధించాలంటే అటవీ విస్తరణ, అడవులపై ఆధారపడిన వర్గాల జీవికను మెరుగుపరచటం అవసరమని బిల్లు సరిగానే గుర్తించింది. కానీ అటు తర్వాత ప్రతిపాదించిన సవరణలన్నీ అందుకనుగుణంగా లేవు. మణిపూర్‌లో దుండగులు సాగించిన అత్యంత అమానవీయ దురంతాలపై విపక్షాలు ఆగ్రహోదగ్రమై చర్చకు పట్టుబట్టిన పర్యవసానంగా పార్లమెంటు స్తంభించిపోవటంతో ఈ సవరణ బిల్లు బుధవారం మూజువాణి ఓటుతో గట్టెక్కింది. ఈమధ్యకాలంలో అత్యంత ప్రాధాన్యతగల ఫైనాన్స్ బిల్లులే ఆ దోవన ఆమోదం పొందిన సందర్భాలుంటున్నాయి. ప్రభుత్వ లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది గనుక అది తప్పనిసరి కూడా కావొచ్చు. కానీ అటవీ సంరక్షణ చట్టం సవరణ బిల్లుకు అంత తొందరేమొచ్చింది?

దేశంలో 1980లో అటవీ సంరక్షణ చట్టం ఎందుకు తీసుకురావాల్సివచ్చిందో గుర్తుచేసుకోవాలి. అంతకుముందు మూడు దశాబ్దాలపాటు ప్రభుత్వాలు ఎడాపెడా అడవుల నరికివేతకు అనుమతిచ్చిన పర్యవసానంగా 42 లక్షల హెక్టార్ల అడవులు కోల్పోయామని గ్రహించిన తర్వాత ఆ చట్టాన్ని తీసుకొచ్చారు. నిజానికి ఆ చట్టం తీసుకొచ్చేనాటికి పర్యావరణంపై ఇప్పుడున్నంత చైతన్యం లేదు. 1985 తర్వాతే అంతర్జాతీయంగా కూడా పర్యావరణ స్పృహ పెరిగింది. ఒకరకంగా అటవీ సంరక్షణ చట్టం అత్యంత కఠినమైనది. అందువల్లే ఆ చట్టం వచ్చాక ఈ నాలుగు దశాబ్దాల్లో కోల్పోయిన అటవీ భూములు 15 లక్షల హెక్టార్ల లోపే. మన భూభాగంలో కేవలం 21 శాతం మాత్రమే అడవులున్నాయి. అందులో దట్టమైన అరణ్యాలున్న ప్రాంతం కేవలం 12.37 శాతం. ఈ దట్టమైన అడవులు ప్రధానంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రల్లోనే ఉన్నాయి. వీటిని ప్రాణప్రదంగా కాపాడుకోవటం, వీలైనంతమేరకు విస్తరించటం ధ్యేయం కావలసిన సందర్భంలో తీసుకొచ్చిన సవరణ బిల్లు అందుకనుగుణంగా లేదు. ప్రభుత్వ రికార్డుల్లో అడవులుగా నమోదైన భూములన్నీ అటవీ భూములకిందికే వస్తాయని 1980 చట్టం చెబుతుండగా, 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దాన్ని మరింత విస్తరించింది. నిఘంటు అర్థాన్ని సంతుష్టి పరిచేలా ఉండే భూములు సైతం ఆ చట్టం పరిధిలోకొస్తాయని తెలిపింది. తాజా బిల్లు దాన్ని పూర్తిగా మారుస్తోంది. 1980 లేదా ఆ తర్వాత ప్రభుత్వ రికార్డుల్లో అటవీ ప్రాంతంగా నమోదైవున్న భూములకు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుందని చెబుతోంది. నాగాలాండ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో శతాబ్దాలుగా అడవులుగానే ఉంటున్నా ఇప్పటికీ ప్రభుత్వ రికార్డులకెక్కని భూములున్నాయి. ముఖ్యంగా గడ్డి భూములు, మడ అడవుల వంటి వాటికి అడవులుగా గుర్తింపులేదు. వాటికి అటవీ సంరక్షణ చట్టం వర్తించదని చెబితే ఏం జరుగుతుందో ఊహించటం కష్టం కాదు. దేశంలోని అటవీ భూముల్లో 15 శాతం ప్రాంతానికి ఈ సవరణ వల్ల కీడు జరుగుతుందన్నది పర్యావరణవేత్తల ఆందోళన. తాజా బిల్లు దేశభద్రతను ప్రస్తావించి అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతాలైన అధీన రేఖ, వాస్తవాధీన రేఖ వంటి చోట్ల వంద కిలోమీటర్ల పరిధిలో అటవీభూములుంటే వ్యూహాత్మక అవసరాల కోసం ఆ భూములను ముందస్తు అనుమతి లేకుండానే తీసుకోవచ్చన్న సవరణను ప్రతిపాదించింది. అధీన రేఖ, వాస్తవాధీన రేఖ ఉన్న ప్రాంతాలు పర్యావరణపరంగా ఎంతో సున్నితమైన హిమాలయ సానువుల్లో ఉన్నాయి. అక్కడ పర్యావరణానికి విఘాతం కలిగితే అదెంత ప్రమాదమో వేరే చెప్పనవసరం లేదు. అలాగే తీవ్రవాద కార్యకలాపాల ప్రాంతాలకూ ఈ మాదిరి మినహాయింపే ఉంది. దేశ రక్షణ, భద్రత అత్యంత కీలకమైనవే. వాటినెవరూ కాదనరు. కానీ అందుకు పర్యావరణాన్ని పణంగా పెట్టడం ఎలాంటి విపరిణామాలకు దారితీస్తుందో మరిచిపోకూడదు.

పెరుగుతున్న జనాభాకు తగిన మౌలిక సదుపాయాలు ఏర్పర్చటానికి అవరోధాలుంటున్న మాట వాస్తవం. ప్రాజెక్టుల అనుమతుల్లో జాప్యం చోటుచేసుకుంటున్న సంగతి కూడా కాదనలేనిది. కానీ పర్యావరణ హాని, అందువల్ల కలిగే విలయంతో పోలిస్తే ఇదేమంత లెక్కలోనిది కాదు. ఉత్తరాఖండ్‌లో ఇటీవలి పరిణామాలైనా, ప్రస్తుతం దేశమంతా ముంచెత్తుతున్న వరదలను చూసినా అడవుల సంరక్షణ, జీవ వైవిధ్యత పరిరక్షణ ఎంత ప్రాణప్రదమో అర్థమవుతుంది. కనుక అవసరాలకూ, ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పుకూ మధ్య సమతూకం ఉండేలా మరింత మెరుగైన ప్రతిపాదనలుండాలి. పార్లమెంటు ఉభయ సభల్లో లోతైన చర్చలు జరిగితే ఇలాంటి సమస్యలు ప్రస్తావనకొచ్చి దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. ఆ పరిస్థితి లేకపోవటం విచారకరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.ఏకాదశి ఉ.8.34 వరకు తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.40 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.4.20 నుండి 5.54 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.41 నుండి 7.23 వరకు, **అమృతఘడియలు:** వ.12.02నుండి 1.34 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : వ.1.30 నుండి 3.00 వరకు

సాయంతో మనసు గెలిచే యత్నం

విశ్లేషణ



ఎస్.డి. ముని

జూలై 21 నాటి రణిల్ విక్రమసింఘే భారత్ పర్యటన తాలూకూ అజెండా బహుముఖీనమైనది. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవడం ఒక సందర్భమైతే, శ్రీలంక రాజకీయాల్లో అత్యున్నత పదవిని అందుకునేందుకు పరోక్షంగా ఆశీస్సులందించిన భారత్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం మరొకటి. శ్రీలంక ప్రస్తుత సంక్షోభం, ఆర్థికమే. అందుకే విక్రమసింఘే ఆర్థిక సహకారం కోరుతూనే భారత్‌ను సందర్శించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలు సురక్షితంగా అభివృద్ధి చెందుతూండాలన్న లక్ష్యంతో రూపొందించిన 'సాగర్', 'తొలుత పొరుగు' విధానాలతో భారత్ కూడా శ్రీలంకతో గొప్ప ఆర్థిక సమన్వయాన్ని ఆశిస్తోంది. ఇది పెరుగుతున్న చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడమే కాకుండా, వ్యూహాత్మకంగా శ్రీలంకలో భారత్ తన ఉనికిని పెంచుకునేందుకూ ఉపయోగపడుతుంది.

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ఇటీవలే భారత్‌కు వచ్చిపోయారు. బోలెడన్ని ఒప్పందాలు కుదిరాయి. చాలావరకూ ఆర్థిక వ్యవహారాలే. రణిల్ మనకు మిత్రుడే అన్నది చాలాకాలంగా ఉన్న గట్టి అభిప్రాయం. గత ఏడాది జూలైలో అధ్యక్షుడు గొటబయ రాజకపక్స దేశం నుంచి పారిపోవడం, ప్రజాగ్రహం నేపథ్యంలో తన పదవిని వదులుకోవాల్సి రావడం మనకు తెలిసిన విషయమే. అలాంటి అనూహ్యమైన, మునుపెన్నడూ లేని పరిస్థితుల్లో రణిల్ గద్దెనెక్కారు. దారుణమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతోంది ఆ దేశం అప్పుడు. సాధారణంగా పదవి చేపట్టిన కొద్ది కాలానికి శ్రీలంక నేతలు భారత్ పర్యటనకు రావడం కద్దు. కానీ ఈసారి రణిల్ ముందు దేశంలో పరిస్థితులు కొంతైనా చక్కబెట్టుకున్న తరువాతే, విదేశీ పర్యటనల గురించి ఆలోచించాల్సిన వచ్చింది. అటు ఆర్థిక, ఇటు రాజకీయాలూ సర్దుకున్న తరువాత ఆహ్వానం పంపుదామని భారత్ కూడా వేచి చూసింది.

75 ఏళ్ల దౌత్య బంధం

జూలై 21 నాటి రణిల్ విక్రమసింఘే భారత్ పర్యటన తాలూకూ అజెండా బహుముఖీనమైనది. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తవడం ఒక సందర్భమైతే, శ్రీలంక రాజకీయాల్లో అత్యున్నత పదవిని అందుకునేందుకు పరోక్షంగా ఆశీస్సులందించిన భారత్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం మరో విషయం. దేశవాళీ ఆర్థిక, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన సాయం అందిస్తున్నందుకూ విక్రమసింఘే కృతజ్ఞతలు చెప్పుకుని ఉంటారు. ఈ సాయం భవిష్యత్తులోనూ కొనసాగించేందుకు భారత్‌తో సమావేశాలు ఉపయోగపడి ఉంటాయి. ఎందుకంటే భారత్‌తో పాటు ఐఎంఎఫ్ లాంటి సంస్థల సాయంతో శ్రీలంక ఆర్థిక వ్యవస్థలో కొంత స్థిరత్వం కనిపిస్తున్నప్పటికీ పరిస్థితి పూర్తిగా చక్కబడలేదు. సబ్సిడీల తగ్గింపు, పన్నుల పెంపు వంటి సంస్కరణలకు ఐఎంఎఫ్ షరతులు విధించిన విషయమూ చెప్పుకోవాలిక్కడ. ఈ సంస్కరణల భారం మోయడం సామాన్యుడికి కష్టమైతే, ఆ అసంతృప్తిని వాడుకుని తిరగబడేందుకు శ్రీలంకలోని కొన్ని నియోజకవర్గ నేతలు కాచుకూర్చున్నారు.

శ్రీలంకకే చెందిన అంతర్జాతీయ ఆర్థికవేత్తలు సీపీ చంద్రశేఖర్, అహిల్ కదిర్గమర్ వంటి వారు ఐఎంఎఫ్ పథకం సమస్య పరిష్కారానికి అస్సలు ఉపయోగపడదనీ, పరిస్థితిని మరింత దిగజారుస్తుందనీ అభిప్రాయపడుతున్నారు. ఐఎంఎఫ్ షరతుల ప్రకారం శ్రీలంక 2031 వరకూ సంస్కరణలు కొనసాగించాల్సి ఉంటుంది. అంటే ఇంకో ఎనిమిదేళ్లు. చాలా సమయం. విక్రమసింఘేకు ఈ విషయమే కాకుండా, భవిష్యత్తులో ఎదురుకాగల సవాళ్ల గురించి కూడా తెలుసు. విదేశీ అప్పులు ప్రస్తుతం 40 బిలియన్ డాలర్ల వరకూ ఉంటే, అందులో 30 శాతం అయినా తగ్గించుకోవాలని చూస్తున్నారు. అలాగే



తొమ్మిదేళ్లపాటు రుణాల చెల్లింపులను నిలిపివేయడం అప్పులిచ్చే వారి ఆగ్రహానికి కారణమవుతోంది.

పొరుగుకు ప్రాధాన్యత

శ్రీలంక ప్రస్తుత సంక్షోభం ఆర్థికమే. అందుకే విక్రమసింఘే ఆర్థిక సహకారం కోరుతూనే భారత్‌ను సందర్శించారు. దేశ ఆర్థిక వ్యవహారాల్లో భారత్ జోక్యం పెరగాలని లంక ఆశిస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలు సురక్షితంగా అభివృద్ధి చెందుతూండాలన్న లక్ష్యంతో భారత్ రూపొందించిన 'సాగర్'(సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్), 'తొలుత పొరుగు' విధానాలతో భారత్ కూడా శ్రీలంకతో గొప్ప ఆర్థిక సమన్వయాన్ని ఆశిస్తోంది. వీటి ప్రకారం, పెరుగుతున్న చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడమే కాకుండా... వ్యూహాత్మకంగా శ్రీలంకలో భారత్ తన ఉనికిని పెంచుకునేందుకూ ఉపయోగపడుతుంది. ఇరుదేశాల మధ్య అనుసంధానాన్ని పెంచేందుకు, ఆర్థిక సమృద్ధికి ఉపయోగపడే కొన్ని చర్యలకు ప్రధాని మోదీ, విక్రమసింఘే తమ దార్శనిక పత్రం ద్వారా శ్రీకారం చుట్టారు. దీని ప్రకారం ఇరుదేశాల మధ్య అటు సముద్ర మార్గం ఇటు విమాన, భూతల మార్గాల ద్వారా కూడా కనెక్టివిటీ పెంచుకునేందుకు ప్రాధాన్యం ఉంటుంది. ఇందుకు తగ్గట్టుగానే తెగల పోరు నేపథ్యంలో 1980లో నిలిపివేసిన పడవల సేవలను పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘే పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య ఐదు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. యూపీఐ ద్వారా శ్రీలంకలో రూపాయి ద్వారా చెల్లింపులు జరపాలన్నది వీటిల్లో ఒకటి. ఇంధన రంగంతోపాటు ట్రింకోమలై ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి అదాని వంటి భారతీయ వ్యాపారవేత్తలకు సరికొత్త అవకాశాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత పర్యటనలో విక్రమసింఘేను గౌతమ్ అదాని కూడా కలిసిన విషయం గమనార్హం.

శ్రీలంక తమిళుల సమస్య సున్నితత్వాన్ని గుర్తించిన విక్రమసింఘే ఆ విషయంలో తాను తీసుకోబోయే చర్యల గురించి ప్రధాని నరేంద్ర మోదీకి వివరించారు. 13వ రాజ్యాంగ సవరణ ప్రకారం, దక్షిణాఫ్రికా తరహాలో తమిళుల కోసం ఓ నిజనిర్ధారణ కమిటీ ఒకదాన్ని ఏర్పాటు చేయడం కూడా ఇందులో ఉంది. ప్రాంతాల వారీగా అధికార పంపిణీ జరగాలని 13వ సవరణ చెబుతోంది. అయితే దీని అమల్లో ఉన్న సాధకబాధకాల గురించి కూడా శ్రీలంక అధ్యక్షుడు భారత ప్రధానికి వివరించినట్లు తెలుస్తోంది. పార్లమెంటు అనుమతి లేకుండా పోలీసు తదితర సున్నితమైన వ్యవస్థల అధికారాలను పంపిణీ చేయడం కష్టమని వివరించారు. యునైటెడ్ నేషనల్ పార్టీ విక్రమసింఘే వర్గానికి ప్రతినిధి ఈయనొక్కరే. పార్లమెంటులో మద్దతు లభిస్తున్నది కూడా రాజపక్సే పార్టీ నుంచి మాత్రమే. రాజపక్సే పార్టీకి అధికార పంపిణీ సుతరామూ ఇష్టం లేకపోవడం గమనార్హం. ఈ విషయాలన్నింటినీ గుర్తు పెట్టుకునే ప్రధాని మోదీ రాజ్యాంగ సవరణ అమలును మరోసారి గుర్తు చేశారు. తమిళులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల కౌన్సిల్ ఎన్నికలు తొందరగా జరిపించడం గురించి ప్రస్తావించారు. తమ ప్రాంతంలో పెద్దగా అభివృద్ధి జరగడం లేదనీ, విక్రమసింఘే అధికార పంపిణీ ప్రణాళిక తమకు సమ్మతం కాదనీ తమిళ వర్గాలు ఇప్పటికే మోదీకి వేరుగా లేఖలు రాశాయి. తమిళ సామాజిక వర్గపు ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేలా లంకను ఒప్పించాలని వీరు కోరుతున్నారు.

కలిసి పనిచేయాలి

విక్రమసింఘే పర్యటనలో భద్రతా పరమైన అంశాలపై చర్చలు జరక్కపోయినా, చైనా అంశం కచ్చితంగా ఇద్దరు నేతల మనసుల్లో ఉండి ఉంటుంది. విక్రమసింఘే కొన్ని రోజుల క్రితమే ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా శ్రీలంకలో చైనా భద్రతా వ్యవహారాలు లేవని స్పష్టం చేయడం గమనార్హం. అంతేకాకుండా, భారత్‌కు ముప్పు కాగల ఎలాంటి విషయానికైనా శ్రీలంక వేదిక కాదని కూడా ఆయన ప్రకటించారు. ఇది చైనాకు చెక్ పెట్టేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కొంత ఫలితం లభించినట్లే భావించాలి. భారత ప్రధాని మాట్లాడుతూ, 'భారత్ భద్రత, శ్రీలంక అభివృద్ధి రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఇరు దేశాలు భద్రత, సున్నితత్వాలను దృష్టిలో ఉంచుకుని కలిసి పని చేయాలి' అన్నారు. అభివృద్ధి పనులతో భద్రతను పొందాలనుకోవడం భారత్ ఎంత సమర్థంగా, సకాలంలో తన ఆర్థిక హామీలు నెరవేర్చగలదన్న అంశంపై ఆధారపడి ఉంటుంది.

వ్యాసకర్త మాజీ దౌత్యవేత్త, శ్రీలంక రత్న అవార్డు గ్రహీత
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అవే సరిపోతాయి!



వైద్య విద్యార్థులంత బోరింగ్ మనుషులు ఈ భూమ్మీద ఉండరు. వాళ్లు ఎప్పుడూ అకాడమిక్స్, పరీక్షలు, పోస్టింగులు, అటెండెన్సుల గురించి తప్ప మాట్లాడరు. బాధాకరంగా నేను కూడా అందులో ఒకడిని.

– శుభం శర్మ, ఎంబీబీఎస్ విద్యార్థి

అయితే ద్రోహినే!



తీవ్ర టర్కిష్ జాతీయవాదులు నన్ను 'ద్రోహి' అంటున్నారు. ఎందుకంటే వాళ్ల అభిప్రాయంలో నిజమైన టర్క్ అంటే, ఆర్మేనియన్లను రూపుమాపడాన్ని గొప్పగా భావించాలి. దీని గురించి ఒక నిమిషం ఆలోచించండి.

– ఉజయ్ బులూత్, టర్కీ జర్నలిస్ట్

ఎలా మారిపోయారు?



పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత తీవ్రవాదానికి దారితీస్తాయనీ, విద్యాధిక యువత ఆ ఉచ్చులో పడరనీ నమ్మడం అత్యంత తప్పు. తీవ్రవాదులు కోపంతో, మూఢభక్తితో ఉంటారనుకోవడం కూడా భ్రమ అని కౌంటర్–టెర్రరిజం నిపుణుడు సేజ్‌మాన్ అంటారు. సాధారణంగా జిహాదీ తీవ్రవాదులు మంచి ధార్మిక కుటుంబాల నుంచి వచ్చిన మధ్యతరగతి, విద్యాధిక యువత అని ఆయన పరిశోధన చూపింది.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

తిండి మైండ్‌సెట్



మంచి ఆహారపుటలవాట్లకు మారడంలో ఉన్న ప్రధాన అవరోధం ఏమిటంటే– తక్కువ నాణ్యత గల ఆహారం పట్ల ఉండే చాపల్యం. ఆహారాన్ని ఇష్టం కోణంలో కాకుండా, పోషణగా చూడటం మొదలుపెడితే, మన మైండ్‌సెట్ మారుతుంది.

– ప్రమీలా ముంద్రా, న్యూట్రిషనిస్ట్

ఎవరి గోల వారిదే!



సోషల్ మీడియాలో గమ్మత్తు ఏమిటంటే, నిన్నటిదాకా కనీసం మ్యాపులో మణిపూర్ ఎక్కడుందో గుర్తించలేనివాళ్లు కూడా, ఇవ్వాళ ఉన్నట్టుండి మైతేయి–కుకీల వివాదంలో వాళ్ల కథనాలు చిన్నప్పటినుంచీ తెలుసు అన్నంత ఆత్మవిశ్వాసంతో ఒక పక్షం వహిస్తున్నారు.

– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

జవాబులున్నాయా?



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వాళ్ల అబ్బాయి, మనవడు కూడా చెప్పగలిగే అతి మామూలు ప్రశ్నలు! మే 29న మణిపూర్ పర్యటనకు వెళ్లినప్పుడు ఎఫ్ఐఆర్లు రిజిస్టర్ అయిన విషయం ఆయనకు తెలుసా? వాటి గురించి ప్రధాని మోదీకి సమాచారమిచ్చారా? పోలీసు ఆయుధాగారాన్ని మే 4న లూటీ చేశారని ఆయనకు తెలుసా?

– అనురాధా రామన్, జర్నలిస్ట్

కనబడదా?




అసలు భారతదేశంలో ఔషధ నియంత్రణలు ఎందుకు? యథేచ్ఛగా ఉత్పత్తులు జరగనీ. గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఫార్మా కంపెనీ తయారుచేసిన కలుషిత కంటి చుక్కల వల్ల శ్రీలంకీయుల్లో ఇన్‌ఫెక్షన్లు వచ్చాయి. కంటి చూపు కూడా పోయింది. అయినప్పటికీ ఆ కంటి చుక్కల్ని అలాగే తయారుచేయడానికి అనుమతించారు. సిగ్గుచేటు!

– ఆర్. ప్రసాద్, సైన్స్ జర్నలిస్ట్

రచన ఏదైనా ప్రశ్నించడమే లక్ష్యం

సందర్భం




వారాల ఆనంద్

జావేద్ అఖ్తర్ ప్రతిభావంతమయిన కవి, వక్త, స్క్రీన్ ప్లే రచయిత. సూటిగా తన భావాల్ని ఎలాంటి వెరపూ, బెదురూ లేకుండా ప్రకటిస్తున్న సామాజిక గొంతుక ఆయనది. ఇవ్వాళ మన దేశంలో అత్యంత ప్రభావవంతమైన స్వతంత్ర లౌకిక స్వరం, జావేద్ అఖ్తర్.

భావుకుడు, ప్రగతిశీల వాది అయిన జావేద్ అఖ్తర్ ఏడు తరాల సాహిత్య చైతన్యమున్న కుటుంబంలో జన్మించారు. తన కవిత్వం మత తత్వానికి, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా రాశారు. జాతీయ సమైక్యత, స్త్రీల హక్కుల కోసం మాట్లాడారు, రాశారు. తప్పు దోవ పట్టిన యువతనుద్దేశించి జావేద్ రాసిన గీతాన్ని 1995లో కేంద్ర మానవ వనరుల శాఖ యువతకోసం 'జాతీయ గీతం'గా ప్రకటించింది.

గ్వాలియర్‌లో పుట్టిన జావేద్ లక్నో అలీగఢ్, భోపాల్‌లలో ఎదిగారు. బాంబే చేరిన తర్వాత ఆయన పరిధి బాగా విస్తారమయింది. జావేద్ తన మిత్రుడు సలీం ఖాన్‌తో కలిసి రాసిన స్క్రీన్ ప్లేలు 70వ దశకం మధ్య నుండి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. దాంతో వారికి మొట్ట మొదటి విజయవంతమయిన సినిమా రాసే అవకాశం వచ్చింది. 'హాథీ మేరె సాథీ'. అది సూపర్ హిట్ కావడంతో ఆ జంట హిందీ సినీ రంగంలో హాట్ కేక్‌గా మారింది. 'సీతా ఔర్ గీతా' చిత్రానికి పనిచేసే సమయంలో జావేద్‌కు 'హనీ ఇరానీ'తో అయిన పరిచయం పెళ్లిదాకా వెళ్ళింది. వారిద్దరికీ జోయా, ఫర్హాన్‌లు జన్మించారు.

1979లో తన మొదటి కవిత రాశారు జావేద్. ఇంచుమించు అదే కాలంలో 'షబానా ఆజ్మీ'తో పరిచయం సాన్నిహిత్యంగా మారింది. 1995లో ఆయన మొట్ట మొదటి కవితా సంకలనం 'తర్కశ్' వెలువడింది. మొదటి సంకలనమే కవిత్వాభిమానుల నుంచీ, విమర్శకుల నుంచీ ప్రశంసను అందు



జావేద్ అఖ్తర్

కుంది. అంతేకాదు మన దేశంలో మొదటి ఆడియో బుక్‌గా కూడా ప్రాచుర్యం పొందింది. 1983లో హనీ ఇరానీ, జావేద్ విడిపోయారు. కానీ స్నేహంగానే ఉన్నారు.

సలీం–జావేద్ జంటగా 'అందాజ్', 'యాదోం కీ బారాత్', 'జంజీర్', 'దీవార్', 'షోలే', 'డాన్', 'త్రిశూల్' లాంటి సూపర్ డూపర్ హిట్ సినిమాలకు స్క్రిప్టు రాశారు. వాళ్ళు రాసిన 24 సినిమా స్క్రిప్టుల్లో 20 హిట్లు. ఆ తర్వాత ఆ జంట విడిపోయింది. 1981లో సలీం, జావేద్‌ల జంట విడిపోయాక జావేద్ అఖ్తర్ చాలా సినిమాలకు స్క్రిప్ట్ రచన చేశారు. వాటిల్లో 'సాగర్', 'మిస్టర్ ఇండియా', 'బెతాబ్', 'లక్ష్య' లాంటి విజయవంతమయిన సినిమాలు ఉన్నాయి.


తర్వాత జావేద్ అఖ్తర్ ఫిలిం గీతాలవైపు కదిలారు. అలాగే గొప్ప కవితలూ రాశారు. ఆయన రాసిన కవితలు, గజల్స్ సూటిగా మనసుకు హత్తుకుంటాయి. 'లావా' కవితా సంపుటి 2012లో వెలువడింది. దీనికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. ఈ రెండు సంకలనాల్లోంచి ఎంపిక చేసిన కవితల సమాహారమే 'ఇన్ అదర్ వర్డ్స్.' అందులో ఆయన కాలాన్ని గురించి..

కాలమంటే ఏమిటి, /అలుపూ విరామమూ లేకుండా /సాగిపోతున్నది /అదట్లా ప్రయాణించకుండా ఉండి వుంటే అదెక్కడుండేది / ఎక్కడో ఒక చోట ఉండేది కదా... అంటూ గొప్ప తాత్వికతతో రాశారు. ఆయన కవిత్వమంతా ఆయన ఆత్మ నుండి ఒక ప్రవాహంలా సాగుతుంది. హృదయపు లోతుల నుండి పెల్లుబుకుతుంది. వర్తమాన అవ్యవస్థ గురించి తనకోపమూ, తన తాత్వికత, వేదన, దుఃఖం, ప్రశ్న–జవాబు ఇట్లా అనేకానేక స్థితులు ఆవిష్కరించారు. ఇందులో వర్తమాన మత ఛాందసవాదం గురించి ఖండిస్తూ రాశారు, మాట్లాడారు. ఇక పార్లమెంట్ సభ్యుడిగా ముందుండి మేధో హక్కుల గురించి, కాపీ రైట్ చట్టం గురించీ పోరాడి సాధించారు. ప్రశ్నించడమే తన తత్వమని అనేక సందర్భాల్లో నిరూపించారు.

వ్యాసకర్త సాహిత్య అకాడమీ అనువాద పురస్కార గ్రహీత
(జావేద్ అఖ్తర్‌కు నేడు సినారె పురస్కార ప్రదానం)

నైపుణ్య విద్యను ప్రోత్సహించేలా...

సందర్భం



ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి

జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)–2020 అమలులోకి వచ్చి జూలై 29 నాటికి మూడేళ్లవుతోంది. మునుపటి విద్యా వ్యవస్థలలోని భారీ అంతరాలను గుర్తించి నాణ్యమైన విద్యావకాశాలు అందరికీ సమానంగా అందించడం దీని ప్రధాన లక్ష్యం. ప్రీస్కూల్ విద్య నుండి ఆరో తరగతి వరకు మాతృభాష బోధనా మాధ్యమంగా ఉండాలని ఎన్ఈపీ ఉద్దేశం. అదేవిధంగా, అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కోసం కరిక్యులం, క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ కింద చేసిన సవరణలు ఏకకాలంలో రెండు పూర్తికాల విద్యా కార్యక్రమాలను కొనసాగించడాన్ని అనుమతిస్తున్నాయి. భౌతిక, ఆన్‌లైన్ మోడ్‌తో సహా, 4–సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను ప్రోత్సహించడం వంటివి ఉన్నత విద్యలోని ముఖ్యాంశాలు.

ఎన్ఈపీ–2020 నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తోంది. అలానే తల్లిదండ్రులు, తోటివారి ఒత్తిడి నుండి విద్యార్థికి ఉపశమనం కలిగించడానికి కూడా ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులు ఒక సంస్థ నుండి మరొక సంస్థకు, ఒక కోర్సు నుండి మరొక దానికి మారడానికి అవకాశం కల్పిస్తోంది. నైపుణ్య విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఎన్ఈపీ నేరుగా విద్యా సంస్థలతో పరి శ్రమలకు సంబంధాలు ఏర్పరచి చదువుకునే సమయంలోనే సమాంతరంగా వారికి వివిధ వృత్తుల్లో శిక్షణ ఇచ్చి జీవితంలో స్థిరపడే అవకాశాలను కల్పిస్తోంది.

వినూత్న బోధనా పద్ధతులపై శిక్షణ అందించడం, ఐసీటీ సాధనాల విస్తృత వినియోగం వంటివి కూడా ఎన్ఈపీలో ముఖ్యమైన అంశాలు. ఎన్ఈపీ అధునాతన పాఠ్యాంశాలు, బోధనపై దృష్టి కేంద్రీకరిస్తూనే విద్యార్థుల సంభావిత అవగాహన, విమర్శనాత్మక ఆలోచనలనూ ప్రోత్సహిస్తోంది. యోగా, ఫిజికల్ ఎడ్యుకేషన్, పెర్ఫార్మింగ్, విజువల్ ఆర్ట్స్‌తో పాటు పాఠ్యాంశాలను పునరుద్ధరించడం, సమగ్ర పరచడం, గిరిజన జీవనశైలిని అర్థం చేసుకోవడానికి గిరిజన గ్రామానికి వెళ్లి



జీవించడం, 'డూయింగ్ వైల్ లెర్నింగ్' వంటి విద్యార్థి–కేంద్రీకృత పాఠ్యాంశాలు ఇందుకు నిదర్శనం. ఎన్ఈపీ–2020 కింద విద్యార్థుల అంతర్లీన అవసరాలను అభివృద్ధి చేయడానికి నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌హెచ్‌ఈక్యూఎఫ్) వంటి వివిధ ప్రోగ్రామ్‌లు ప్రారంభించబడ్డాయి.

ఎన్ఈపీ–2020 ఈక్విటీ, ఇన్‌క్లూజన్ అలాగే భాగస్వామ్య పాలన సిద్ధాంతాలపై ఆధారపడింది. అందువల్ల దివ్యాంగులు, మహిళలు, ఎల్‌జీ బీటీక్యూలు, ఎస్సీ, ఎస్టీలు, పీవీటీజీలు, డీఎన్‌టీలు వంటి వారికి సాధికారత కల్పించడం, వారికి సమానమైన అవకాశాలను అందిస్తూ అందుబాటులో ఉండటం ఇందులోని చాలా ముఖ్యమైన అంశం. గిరిజనుల కోసం 'ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల'లను బలోపేతం చేయడం, కొత్త ఉపాధ్యాయుల నియామకానికి ప్రాధాన్యత ఇవ్వడం, కొత్త ఈఎమ్ఆర్ఎస్ ప్రారంభించడం, 10–15 చిన్న పాఠశాలలను కలుపుతూ 'వన్ స్కూల్ కాంప్లెక్స్' పునర్నిర్మాణం వంటివి ఇందు కోసం తీసుకున్న కొన్ని చర్యలు. అంతర్జాతీయీకరణ, సహకారం, భాగస్వామ్య పద్ధతిలో పథకాలను బలోపేతం చేయడం, విదేశీ విశ్వవిద్యాలయాల ఆఫ్–షోర్ క్యాంపస్‌లను స్థాపించడానికి ఆహ్వానించడం, అలాగే దేశంలో డిజిటల్ ఈ–విశ్వవిద్యాలయాల స్థాపన... ఎన్ఈపీ అమలు ప్రారంభించిన తర్వాత తీసుకున్న మరికొన్ని కార్యక్రమాలు. ఎన్ఈపీ 'ల్యాబ్ టు ల్యాండ్', 'ల్యాండ్ టు ల్యాబ్'ను ప్రమోట్ చేస్తుంది.

మొత్తం మీద ఎన్ఈపీ–2020 గత మూడు సంవత్సరాల్లో అనేక స్పష్టమైన ఫలితాలను సాధించగలిగింది. బహుళ ప్రవేశ–నిష్క్రమణ విధానం ద్వారా ఇది విద్యార్థులకు నేర్చుకునే సౌకర్యవంతమైన మార్గాన్ని అందించింది. ఆ విధంగా ఎన్ఈపీ–2020 భారతీయ విద్యా వ్యవస్థ చరిత్రలో నిజమైన గేమ్ ఛేంజర్ అని చెప్పవచ్చు.

వ్యాసకర్త వైస్ ఛాన్స్‌లర్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
(ఎన్ఈపీ ప్రారంభమై మూడేళ్లు)

31న కేబినెట్ భేటీ

- వచ్చే ఎన్నికల దృష్ట్యా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం
- ఎజెండాలో 40 నుంచి 50 వరకు అంశాలు... నిరుద్యోగ భృతి లాంటి అమలు కాని హామీలు, పెండింగ్ అంశాలపై చర్చించే చాన్స్
- కొత్త హామీలు, పథకాల ప్రకటనపైనా పరిశీలన!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్‌కు మరో మూడు నెలలే సమయం మిగిలి ఉన్న నేపథ్యంలో అమలు చేయాల్సిన కార్యాచరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా సీఎం కేసీఆర్ ఈ నెల 31న రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కేబినెట్ భేటీకి భారీ ఎజెండాను ఖరారు చేశారు. 40 నుంచి 50 అంశాలపై మంత్రివర్గం చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 'నిరుద్యోగ భృతి'లాంటి అమలు కాని హామీలతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై చర్చించే అవకాశాలున్నాయి. పాక్షికంగా అమలైన పంట రుణాల మాఫీ లాంటి అంశాలు కూడా చర్చకు రానున్నట్టు తెలిసింది. అలాగే ఎన్నికలు పురస్కరించుకుని కొత్త హామీల ప్రకటనకు ఉన్న అవకాశాలను కేబినెట్ సమీక్షించనున్నట్టు సమాచారం. సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించడానికి ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు. ఇందుకు సంబంధించి మంత్రివర్గం నిర్ణయం తీసుకోవచ్చు.

ఉద్యోగులకు వేతన సవరణ, పదోన్నతులు..

గత ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)ను నియమించలేదు. ఈ నేపథ్యంలో పీఆర్సీ ఏర్పాటు, మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటనకు ఉన్న అవకాశాలను మంత్రివర్గం సమీక్షించే అవకాశాలున్నాయి. ఉపాధ్యాయులు, భాషా పండితులు, పీఈటీలు దీర్ఘకాలంగా పదోన్నతులు, బదిలీల కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అట్టడుగు స్థాయిలో పనిచేస్తున్న 2 లక్షల మందికి పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. నెలల తరబడిగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ అంశాలపైనా కేబినెట్ చర్చించవచ్చని చెబుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ అమలు, సంస్థ ఆర్థిక పరిస్థితిపై మంత్రివర్గం చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. ఈ అంశాన్ని కేబినెట్ ఎజెండాలో చేర్చారు.

వర్షాలు, వరదలపై...

భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలో జరిగిన నష్టం, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నివారణ చర్యలపై కేబినెట్ సమీక్షించనుంది. వానాకాలం పంటల పరిస్థితిని అంచనా వేయడంతో పాటు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై చర్చించనుంది. రహదారులు తెగిపోవడం వంటి వాటిపై చర్చించి నష్టాన్ని అంచనా వేయనుంది. యుద్ధప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

ఆగస్టు 3 నుంచి ఉభయసభల సమావేశాలు

- రెండో శాసనసభ చివరి భేటీ ఇదే...
- 31న జరిగే కేబినెట్ సమావేశంలో ఎజెండాపై స్పష్టత
- శని, ఆదివారాల్లో అసెంబ్లీ సిబ్బందికి సెలవు రద్దు



సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి ఎనిమిదో విడత సమావేశాలు ఆగస్టు మూడో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో త్వరలో జరగబోయే సమావేశాలపై ఆసక్తి నెలకొంది. తెలంగాణ రెండో శాసనసభ (2014–18)కు ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలుగా భావిస్తున్న నేపథ్యంలో ఉభయ సభల్లో చర్చించే అంశాలు, చేసే తీర్మానాలు, ప్రకటనలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈనెల 31న జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో సుమారు 60 అంశాలను ఎజెండాలో చేర్చారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో చర్చకు వచ్చే అంశాలపై మంత్రివర్గ సమావేశం తర్వాత కొంత స్పష్టత వస్తుంది. సమావేశాలు నాలుగు రోజుల పాటు కొనసాగే అవకాశముంది. అయితే తొలిరోజున ఉదయం 11:30 గంటలకు జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ భేటీలో అసెంబ్లీ సమావేశ తేదీలు, ఎజెండా ఖరారు చేస్తారు.

ఆరునెలల తర్వాత...

ఈ ఏడాది ఫిబ్రవరి 3 నుంచి 12 వరకు అసెంబ్లీ వార్షిక బడ్జెట్ సమావేశాలు– 2023 జరిగాయి. నాటకీయ పరిణామాల నడుమ గవర్నర్ తమిళిసై ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆరునెలల తర్వాత జరిగే ఈ సమావేశాలను ఉచిత విద్యుత్‌తో పాటు ప్రభుత్వ పథకాలపై విపక్షాల నుంచి ఎదురవుతున్న విమర్శల నేపథ్యంలో 9 ఏళ్ల కాలంలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించేందుకు బీఆర్ఎస్ వేదికగా చేసుకునే అవకాశముంది. ఇదిలా ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాత జలగం వెంకట్రావు భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయించడంలో స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా ఆగస్టు 3 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో అసెంబ్లీ సెక్రటేరియట్ అధికారులు, సిబ్బందికి సెలవును రద్దు చేస్తున్నట్టు కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

1న ఏబీవీపీ కదనభేరి

సాక్షి, హైదరాబాద్: విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆగస్టు 1వ తేదీన కదనభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. ఈ సభకు లక్షల సంఖ్యతో తరలిరావాలని విద్యార్థులకు ఆమె పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

క్లుప్తంగా...

గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీక మొహర్రం: సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశానికే ఆదర్శంగా లౌకికవాద స్ఫూర్తిని మొహర్రం నింపుతుందని, గంగా జమునా తెహజీబ్‌కు, త్యాగాలకు ప్రతీకగా దీనిని జరుపుకుంటారని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా హిందూ, ముస్లిం సోదరులు తరతరాలుగా మొహర్రంను నిర్వహిస్తున్నారని తెలిపారు. 'పీర్ల పండుగ'పేరుతో తెలంగాణలో హిందూ, ముస్లింల సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా మొహర్రం నిలిచిందన్నారు. ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్ సహా పలువురి త్యాగాలను స్మరించుకుంటూ మొహర్రం సాగుతుందన్నారు. హిందువులు హసన్, హుస్సేన్‌ను ఆశన్న, ఊశన్నలనే పేర్లతో పీరీలను ఎత్తుకుని పాటలు పాడుకుంటూ వారి త్యాగాలను కీర్తిస్తూ నిప్పుల గుండాలపై నడుస్తారని తెలిపారు.

పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), ఇతర అధికారులున్నారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఉన్న హేమంత కేశవ్ పాటిల్‌ను నల్లగొండ జిల్లాలో అదే పోస్టుకు బదిలీ చేశారు. నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేస్తున్న ఖుష్బూ గుప్తాను ఆదిలాబాద్ జిల్లాలో అదేపోస్టులో నియమించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేస్తున్న దీపక్ తివారీని కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అదే పోస్టుకు బదిలీ చేశారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఓఎస్డీగా పనిచేస్తున్న పి.కాత్యాయనీదేవిని డైరెక్టర్ మైన్స్, జియాలజీగా బదిలీచేశారు. ఈ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతల్లో పనిచేస్తున్న డి.రొనాల్డ్‌రాస్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. సీసీఎల్ఏ (నాన్ కేడర్) స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వీరారెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా బదిలీ చేశారు.

రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ



పంజగుట్ట (హైదరాబాద్): రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు 3 చేర్చడం ద్వారా రాష్ట్రాలు వర్గీకరణ చేసుకునే అవకాశం వస్తుందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణచేసి రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకునే విధంగా చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి లేఖ రాయాలని కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మంద కృష్ణ మాట్లాడుతూ జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ రాజ్యాంగ సవరణ ద్వారా వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత అవుతుందని చెప్పిందని తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా ప్రధానిపై ఒత్తిడి తెస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి ఆరేళ్లయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎస్సీ రిజర్వ్‌డ్ 19 స్థానాలకు గాను 15 అసెంబ్లీ స్థానాలు మాదిగ ఉపకులాలకు కేటాయించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ, ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు రాగాటి సత్యం, తిప్పారపు లక్ష్మణ్, మంథని ఈశ్వర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రమంత్రి వ్యాఖ్యల్ని స్వాగతిస్తున్నాం

మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య

పంజగుట్ట (హైదరాబాద్): రాజ్యసభలో ఎస్సీ వర్గీకరణపై కేంద్రమంత్రి నారాయణస్వామి వ్యాఖ్యల్ని స్వాగతిస్తున్నట్లు మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. శుక్రవారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎస్సీ వర్గీకరణపై హామీ ఇచ్చిన నారాయణ స్వామి ఇటీవల రాజ్యసభలో ఉమ్మడి ఏపీలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన కమిషన్ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌ను సవరించాలని సూచించిందని గుర్తుచేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరారు. అలాకాకుండా తనస్వార్థ రాజకీయాల కోసం దళితుల మధ్య చిచ్చుపెట్టి విడదీయాలని చూస్తే కిషన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో ఎక్కడ నిలబడినా 200 మందితో నామినేషన్ వేయించి ఓడిస్తామని చెన్నయ్య హెచ్చరించారు.



మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా బుత్కూరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్‌గా బుత్కూరి శంకర్ లూక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రిస్టియన్ కమ్యూనిటీకి చెందిన బుత్కూరి కమిషన్ వైస్ చైర్మన్‌గా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

సీయూఈటీ ఆధారంగా ఎల్పీయూలో అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: సీయూఈటీ–2023 పరీక్ష ఆధారంగా తమ వర్సిటీలో అడ్మిషన్లు కల్పించనున్నట్లు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ) ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. సీయూఈటీ పరీక్షలో వచ్చిన స్కోర్స్ ఆధారంగా ఎల్పీయూలో స్కాలర్‌షిప్‌లు పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. ఎల్పీయూలో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 15 నుంచి 27వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపింది. సీట్ల కేటాయింపును 29న ప్రకటిస్తామంది. ఇక కాలేజీలో అడ్మిషన్ల ప్రక్రియకు ఈనెల 31 ఆఖరి తేదీ అని వెల్లడించింది.

మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

- కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రొఫెసర్లకు రూ. 1.90 లక్షలు, అసోసియేట్లకు రూ. లక్షన్నర వేతనం
- అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ. 1.25 లక్షల జీతం
- అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీలకు అదనంగా రూ. 50 వేలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏడాది కాలానికి వీరిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిస్తారు. వనపర్తి, నాగర్‌కర్నూలు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, సంగారెడ్డి, మంచిర్యాల, రామగుండం, కామారెడ్డి, వికారాబాద్, జనగాం, కరీంనగర్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, ఖమ్మం, సిరిసిల్ల, ఆదిలాబాద్ రిమ్స్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేటల్లోని మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను ఈ నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్‌లలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తారు. నోటిఫికేషన్ నాటికి అభ్యర్థి వయసు 69 ఏళ్ల కంటే తక్కువ ఉండాలి. ఆసక్తి కలిగినవారు వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం 5 గంటలకల్లా అవసరమైన డాక్యుమెంట్లతో dmerecruitment.contract@mail.comకు మెయిల్ ద్వారా దరఖాస్తు చేయాలని రమేశ్‌రెడ్డి కోరారు. అదే నెల 9న కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లకు ఆ రోజు ఉదయం 10 గంటలకు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులు అదే నెల 24వ తేదీ నాటికి వారికి కేటాయించిన కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ.1.90 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ. లక్షన్నర, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం నెలకు రూ. 1.25 లక్షలుగా ఖరారు చేశారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ఫ్యాకల్టీలకు రెమ్యునరేషన్‌తోపాటు అదనంగా నెలకు రూ. 50 వేల ప్రోత్సాహకం ఇస్తారు. వీరి ఎంపిక దేశవ్యాప్తంగా వచ్చే అభ్యర్థుల నుంచి ఉంటుంది. స్థానిక అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఇతర రాష్ట్రాల వారిని తీసుకుంటారు.

ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణకు లైన్‌క్లియర్?

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణకు ఎదురుచూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు చెప్పేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఈనెల 31న జరిగే మంత్రివర్గ సమావేశ ఎజెండాలో ఆర్టీసీ ఆర్థికపరమైన అంశాలను చేర్చటంతో ఈ చర్చ జరుగుతోంది.

44 శాతం ఫిట్‌మెంట్‌తో...

2013 సంవత్సరానికి సంబంధించి 2015లో ప్రభుత్వం వేతన సవరణ చేసిన విషయం తెలిసిందే. 30 శాతం మేర ఫిట్‌మెంట్ ప్రకటిస్తారని కార్మిక సంఘాలు భావించగా, ప్రభుత్వం ఏకంగా 44 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఆశ్చర్యపరిచింది. దీంతో ఆర్టీసీపై రూ.850 కోట్ల వార్షికభారం పడింది. అప్పటి నుంచి ప్రభుత్వం తర్వాత వేతన సవరణల జోలికి పోలేదు.

వేతన సవరణ 2017లో చేయాల్సి ఉండగా..

2017లో వేతన సవరణ చేయాల్సి ఉండగా, ప్రభుత్వం స్పందించలేదు. దీంతో అప్పట్లో కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరిపింది. వేతనసవరణ రూపంలో పడే భారాన్ని తట్టుకునే పరిస్థితి లేక, మధ్యంతర భృతితో సరిపెట్టింది. 16 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ ఇవ్వగా, ఇప్పటికీ అదే కొనసాగుతోంది. 2021లో ఇవ్వాల్సిన వేతన సవరణపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

అదే 16 శాతాన్ని ఖాయం చేస్తే రూ.40 కోట్ల భారం

ప్రస్తుతం 2017కు సంబంధించిన 16 శాతం మధ్యంతర భృతి కొనసాగుతోంది. అంతే శాతాన్ని ఫిట్‌మెంట్‌గా మారిస్తే నెలవారీ భారం ఏకంగా రూ.40 కోట్లుగా ఉంటుందని ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రస్తుతం అమలు చేస్తున్న మధ్యంతర భృతికి అదనంగా ఒక్కశాతం అదనంగా ఫిట్‌మెంట్ ప్రకటించినా ప్రతినెలా రూ.3 కోట్ల మేర అదనపు భారం పడుతుందని అధికారులు పేర్కొన్నారు. 18, 20, 22, 24 శాతం లెక్కలను కూడా పరిశీలించి ఓ నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

'దళితబంధు' దేశానికే ఆదర్శం

సీఎం కేసీఆర్‌తో భీమ్‌ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ భేటీ

సాక్షి, హైదరాబాద్: దళితుల అభ్యున్నతి, సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న దళితబంధుసహా పలు పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని భీమ్‌ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. సామాజిక, ఆర్థిక వివక్షల నుంచి ఆత్మగౌరవం దిశగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ప్రగతి కార్యాచరణ దళితజాతి విముక్తికి బాటలు వేసేలా ఉందన్నారు. గురువారం రెండురోజుల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆజాద్ శుక్రవారం ప్రగతిభవన్‌లో కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కేసీఆర్‌తో జరిగిన సుదీర్ఘ చర్చలో దళితుల పరిస్థితి, పాలకుల వైఖరి తదితరాలపై చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న దళిత అభివృద్ధి కార్యాచరణ భవిష్యత్‌లో దేశంలోని దళితుల సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తుందని ఆజాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కేటీఆర్ గారూ.. డాలస్, ఇస్తాంబుల్ ఏమైంది?

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా
- గన్‌పార్క్ నుంచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ



బషీర్‌బాగ్ వద్ద ర్యాలీగా వెళ్తున్న టీ కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్(హిమాయత్‌నగర్): జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరాన్ని డల్లాస్, ఇస్తాంబుల్ చేస్తానంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ గుర్తు చేశారు. 'నగరంలో ఐదు నిమిషాలు వర్షం కురిస్తే మహాసముద్రాన్ని తలపిస్తుంది. ఇదేనా మీరన్న డల్లాస్, ఇస్తాంబుల్'అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం, జీహెచ్ఎంసీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం మహాధర్నా చేపట్టింది. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ నుంచి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. జీహెచ్ఎంసీ కార్యాలయ మూడు ప్రధాన ద్వారాల వద్ద పోలీసులు భారీఎత్తున మోహరించారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. దీంతో అరగంట పాటు వాగ్వాదం, తోపులాట జరిగింది.

కమిషనర్ కార్యాలయం వద్ద పడుకొని నిరసన

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కొందరు నాయకులను లోపలకు అనుమతించారు. అయితే రోనాల్డ్‌రాస్ వినతిపత్రం తీసుకునేందుకు తొలుత నిరాకరించారు. దీంతో వీహెచ్, ఇతర నాయకులు అక్కడే నేలపై పడుకొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. వినతిపత్రం తీసుకునే వరకు లేచేది లేదంటూ తేల్చి చెప్పారు. దీంతో అరగంట తర్వాత కమిషనర్ వారి నుంచి వినతిపత్రం తీసుకున్నారు. అంతకుముందు పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి మాట్లాడుతూ 'నగరంలో అనేక ముంపు ప్రాంతాలు ఉన్నాయి, వారికి మేలు చేయడంలో ప్రభుత్వం, జీహెచ్ఎంసీ విఫలమైందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.15వేలు ఇచ్చి, తక్షణం నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని'డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కౌశిక్ యాదవ్, మాజీ ఎంపీ వీహెచ్, కార్పొరేటర్లు విజయారెడ్డి, రజిత, ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ రోహిణిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా కల్వకుంట్ల వంశీధర్‌రావు

కేసీఆర్ చైర్మన్‌గా 15 మందితో స్టీరింగ్ కమిటీ



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలుపుతున్న కల్వకుంట్ల వంశీధర్‌రావు

సాక్షి, హైదరాబాద్: భారత్‌రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) మహారాష్ట్ర యూనిట్‌కు 15 మందితో కూడిన తాత్కాలిక స్టీరింగ్ కమిటీని పార్టీఅధినేత, ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు ఏర్పాటు చేశారు. కేసీఆర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఈ స్టీరింగ్ కమిటీ తక్షణమే మనుగడలోకి వస్తుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ సోదరుడి కుమారుడు కల్వకుంట్ల వంశీధర్‌రావుకు ఈ స్టీరింగ్ కమిటీలో చోటు దక్కగా, కమిటీ సభ్యుడి హోదాలో బీఆర్ఎస్ మహారాష్ట్రశాఖ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఆయన వ్యవహరిస్తారు. ఈ రాష్ట్రంలో బీఆర్ఎస్‌లో చేరికలు, పార్టీ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో తాత్కాలిక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. తనను మహారాష్ట్రకు ఇన్‌చార్జ్‌గా నియమించిన నేపథ్యంలో శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కల్వకుంట్ల వంశీధర్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

స్టీరింగ్ కమిటీలో సభ్యులు వీరే...

స్టీరింగ్ కమిటీలో మాజీ ఎమ్మెల్యేలు శంకరన్న దోంగ్డె, భానుదాస్ ముర్కుటే, ఘనశ్యామ్ శేలర్, అన్నాసాహెబ్ మానే, దీపక్ ఆత్రమ్, హరిభావ్ రాథోడ్ (మాజీ ఎంపీ), మానిక్ కదమ్ (కిసాన్ సెల్ అధ్యక్షుడు)తో పాటు ధ్యానేష్ వకూడ్కర్, సచిన్ సాథే, సురేఖా పునేకర్, కదిర్ మౌలానా, యశ్‌పాల్, ఫిరోజ్ పటేల్‌లకు చోటు దక్కింది.

ఆరు డివిజన్లకు కోఆర్డినేటర్లు, సహ కోఆర్డినేటర్లు

నాగ్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కోఆర్డినేటర్‌గా ఉన్న ధ్యానేష్ వకూడ్కర్‌కు స్టీరింగ్ కమిటీలో చోటు కల్పించి, ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే చరణ్ వాంగ్మోరెకు బాధ్యతలు అప్పగించారు. మహారాష్ట్రలోని 36 జిల్లాలను ఆరు డివిజన్లుగా విభజించి కోఆర్డినేటర్, సహ కోఆర్డినేటర్లను నియమించారు. వీరితో పాటు 36 జిల్లాలకు కూడా జిల్లా కో ఆర్డినేటర్లను నియమించినట్టు పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. డివిజన్ల వారీగా కో ఆర్డినేటర్, సహ కోఆర్డినేటర్‌గా నియమితులైన వారిలో సోమనాథ్ థోరట్, దత్తా పవార్ (ఔరంగాబాద్), నిఖిల్ దేశ్‌ముఖ్, డాక్టర్ సుభాష్‌రాథోడ్ (అమరావతి), చరణ్ వాంగ్మోరె, బాలాసాహెబ్ సలుంకే గురూజి (నాగపూర్), నానా బచవ్, సందీప్ ఖుటే (నాశిక్), బీజే దేశ్‌ముఖ్, భగీరథ్ భల్కే (పుణే), విజయ్ మొహితే, దిగంబర్ విషే (ముంబై) ఉన్నారు.

ఆగస్టు ఒకటిన మహారాష్ట్రకు కేసీఆర్

ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాభావ్ సాతే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 1న మహారాష్ట్రలో పర్యటిస్తారు. సాంగ్లి జిల్లాలోని వటేగావ్‌లోఅన్నా భావ్ సాతే చిత్రపటానికి కేసీఆర్ నివాళులర్పిస్తారు. అనంతరం కొల్హాపూర్‌లోని అంబాబాయి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. కేసీఆర్ సమక్షంలో అన్నాభావ్ సాతే కోడలు, మనుమడు బీఆర్ఎస్‌లో చేరుతారు.

క్లుప్తంగా...

హత్య కేసులో చోటా రాజన్‌కు ఊరట

ముంబై: ట్రేడ్ యూనియన్ లీడర్ దత్తా సామంత్ హత్య కేసులో గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్‌ను నిరపరాధిగా తేలుస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. 1997లో జరిగిన ఈ హత్యకు చోటా రాజన్ కుట్ర పన్నాడనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు వెల్లడించింది. సామంత్ తన జీపులో పంత్ నగర్ నుంచి ఘట్కోపర్ వెళుతుండగా మోటార్‌బైక్‌పై వచ్చిన దుండగులు ఆయనపై 17 రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో సామంత్ అక్కడికక్కడే మరణించాడు. ఈ హత్య వెనుక చోటా రాజన్ హస్తం ఉందంటూ ప్రాసిక్యూషన్ కేసు నమోదు చేసింది. అయితే అందుకు గల సాక్ష్యాధారాలను సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో ప్రత్యేక న్యాయమూర్తి బి.డి.షెల్కె రాజన్‌కు కేసు నుంచి విముక్తి కలిగించారు. అతనిపై మరిన్ని కేసులు పెండింగ్‌లో ఉండడంతో విడుదలయ్యే అవకాశాల్లేవు.

ఐఫోన్ కొనేందుకు.. కొడుకును అమ్మేశారు!

కోల్‌కతా: ఖరీదైన ఐఫోన్ కొనేందుకు దంపతులు తమ 8 నెలల కొడుకును అమ్మేసుకున్నారు.. ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లో తాజాగా వెలుగుచూసింది. పోలీసులు తల్లిని అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న తండ్రి కోసం గాలింపు చేపట్టారు. గంగానగర్ ఏరియాకు చెందిన దంపతులు సొంతంగా తయారు చేసిన వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి డబ్బు సంపాదించాలనుకున్నారు. అందుకోసం ఎనిమిది నెలల వయస్సున్న తమ కొడుకును విక్రయించి ఖరీదైన ఐఫోన్ 14ను కొన్నారు. ఇది నెల క్రితం జరిగింది. చిన్నారి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చింది. ఈ నెల 24న వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం వెల్లడించింది. ఇప్పటికే ఆ డబ్బును ఖర్చయినట్లు చెప్పింది. చిన్నారి తండ్రి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

2014 నుంచి 110% పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

న్యూఢిల్లీ: దేశంలో వైద్య కళాశాలలు 2014 నుంచి 82 శాతం పెరిగాయని కేంద్రం తెలిపింది. 2014 మెడికల్ కాలేజీలో 387 ఉండగా, నేడు వాటి సంఖ్య 704కు చేరుకుందని వివరించింది. ఇదే కాలంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 51,348 నుంచి 1,07,948కి చేరుకున్నాయని తెలిపింది. శుక్రవారం లోక్‌సభలో ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.

వాతావరణ మార్పులతో... అల్లకల్లోలం


ఆసియాను అతలాకుతలం చేస్తున్న విపత్తులు

అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో ఆహార భద్రతకు ముప్పు



వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలను అల్లకల్లోలం చేస్తోంది. అయితే శారెత్తించే ఎండలు లేదంటే కుండపోత వర్షాలతో కేవలం భారత్ మాత్రమే కాకుండా ఇతర ఆసియా దేశాలు సతమతమవుతున్నాయి. 2022 సంవత్సరంలో 81 విపత్తులు ఆసియా దేశాలను వణికించాయి. అందులో అత్యధిక భాగం వరదలు తుపాన్లే ఉన్నాయి. కరువు కాటకాలతో కొన్ని దేశాలకు కంటి మీద కునుకు లేకుండా పోతే మరికొన్ని దేశాలు వరదలతో విలవిలలాడాయి. ఈ పరిస్థితులతో ఆసియాలో ఆహార భద్రత సమస్య తలెత్తుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో సామాజికంగా ఆర్థికంగా ఈ దేశాలు మరింత విచ్ఛిన్నమవుతాయని డబ్ల్యూఎంఒ తాజా నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలోనే ఆసియా ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతోంది. 1961–1990 మధ్య సగటు వేడి కంటే 1991–2022 మధ్య కాలంలో ఆసియా ఖండంలో వేడిమి రెట్టింపు అయింది. వరదలు, తుపాన్లతో పాటుగా పశ్చిమాసియా దేశాలు ఇసుక తుపాన్లతో విలవిలలాడాయి. "2022లో వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలపై విపరీతమైన ప్రభావం చూపించింది. సాధారణం కంటే అధిక వేడి, పొడి వాతావరణంతో చైనా కరువు పరిస్థితుల్ని ఎదుర్కొంది. దీని వల్ల నీటి లభ్యత తగ్గిపోవడమే కాకుండా విద్యుత్ రంగంపై కూడా ప్రభావం పడింది. కేవలం కరువు కారణంగా చైనాలో ఒక్క ఏడాది 706 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వచ్చింది. దీనికి విరుద్ధంగా పాకిస్తాన్, భారత్‌లు వరదలు, తుపాన్లతో అల్లాడిపోయాయి" అని డబ్ల్యూఎంఒ ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ పెట్రి టాలస్ వెల్లడించారు. ఈ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల వ్యవసాయం, ఆహార భద్రతపై అత్యధిక ప్రభావం చూపిస్తుందని, ఆసియా దేశాల్లో ప్రభుత్వాలు ఆహార భద్రత సవాల్‌ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



నివేదిక ఏం చెప్పిందంటే ..!

ఆసియా ఖండంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. 2022 రెండో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. 1991–2020 సగటు కంటే ఎక్కువగా 0.72డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- కరువుతో ఎన్నో ప్రాంతాలు అల్లాడిపోయాయి. నీటి వనరులు తరిగిపోయాయి. ఒక్క చైనాలో కరువు కారణంగా 706 కోట్ల అమెరికా డాలర్ల నష్టం వచ్చింది
- భారీ వర్షాలు, వరదలు పాకిస్తాన్‌ను అతలాకుతలం చేశాయి. కేవలం మూడు వారాల్లో ఏడాది మొత్తంగా కురవాల్సి వానలో 60% కురిసింది. పాక్ జనాభాలో 14% మందిపై వరదలు ప్రభావం చూపించాయి
- ఆసియాలోని పర్వత ప్రాంతాల్లో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. గత 40 ఏళ్లలో హిమానీనదాలు పరిమాణం భారీగా తగ్గిపోయింది. గత కొంతకాలంగా మరింత వేగంగా క్షీణిస్తోంది. 2022లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా చాలా హిమానీనదాలు వేగంగా కరిగిపోవడం మొదలైంది. తూర్పు తియెన్ షాన్‌లో ఉరుమ్‌కీ గ్లేసియర్ ఉపరితలం నుంచి 1.25 మీటర్ల మేర క్షీణించింది.
- ఆసియా ఖండంలో సముద్ర ఉపరితలాలు వేడెక్కిపోతున్నాయి. 1982 నుంచి సముద్రాలు వేడెక్కడం మొదలైంది. వాయవ్య అరేబియన్ సముద్రం, ఫిలిప్పైన్స్ సముద్రం, తూర్పు జపాన్‌లో సముద్రం మొదలైనవి ప్రపంచంలో సముద్రాలు వేడెక్కే సగటు రేటు కంటే మూడు రెట్లు అధికంగా వేడెక్కుతున్నాయి. గత దశాబ్దంలో 0.5డిగ్రీల సెల్సియస్ అత్యధిక వేడిమి నమోదైంది.

ఈ ఏడాది ఇంతే

ఆసియాలో ఈ ఏడాది కూడా వివిధ దేశాలను విపత్తులు వణికిస్తున్నాయి. ఇండోనేసియా సమత్రాలో కొండచరియలు విరిగిపడి 15 వేల ఇళ్లు ధ్వంసమైతే లక్ష మందికి పైగా నిరాశ్రయులయ్యారు. చైనాను గత ఏడాది కరువు కాటేస్తే, ఈ ఏడాది వరదలతో అతలాకుతలమవుతోంది. వచ్చే నెలలో మరిన్ని టైఫూన్లు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మన దేశంలో హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్, హరియాణాలను కూడా వణికించాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలకి 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇక పాకిస్తాన్‌లోనూ ఈ ఏడాది వరదలకి ఇప్పటివరకు 150 మందికి పైగా మరణించారు. ఇలా వాతావరణ మార్పుల ప్రభావం అన్ని దేశాలకు సవాల్ విసురుతోంది.



కేరళ మున్సిపల్ మహిళా కార్మికులకు జాక్‌పాట్

రూ. 250తో కొన్న టికెట్‌కు రూ.10 కోట్ల లాటరీ

మలప్పురం: లాటరీ టికెట్ కొనేందుకు నానా హైరానా పడిన ఈ మహిళలు ఎన్నడూ ఊహించని విధంగా జాక్‌పాట్ కొట్టేశారు. కేరళ లాటరీ విభాగం ప్రకటించిన వర్షాకాల ఫలితాల్లో వీరు కొనుగోలు చేసిన టికెట్ ఒకటీ రెండూ కాదు..ఏకంగా రూ.10 కోట్లు గెలుచుకుంది. కేరళలోని పరప్పనంగడి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటింటికీ తిరిగి సేకరించిన చెత్త నుంచి 'హరిత కర్మ సేన'కు చెందిన 11 మంది మహిళా సభ్యులు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తుంటారు. వీరు తలా రూ.25 కంటే తక్కువగా పోగేయగా జమయిన రూ.250 పెట్టి ఇటీవల కేరళ లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో హరిత కర్మ సేన కొనుగోలు చేసిన టికెట్ రూ.10 కోట్ల జాక్‌పాట్ వరించింది. దీంతో, వీరి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గత ఏడాది కూడా ఓనమ్ పండుగ సందర్భంగా తలాకొంత పోగేసి కొన్న టికెట్‌కు రూ.7,500 రాగా అందరం సమానంగా పంచుకున్నామని చెప్పారు. అదే ధైర్యంతో ఈసారి కొన్న టికెట్‌కు ఏకంగా రూ.10 కోట్లు వస్తాయని ఊహించలేదన్నారు. ఈ డబ్బును అందరం సమంగా పంచుకుంటామని తెలిపారు. అప్పులు తీర్చుకుని, పిల్లల పెళ్లిళ్లు చేస్తామని, కుటుంబసభ్యులకు అవసరమైన వైద్యం చేయించుకుంటామని చెబుతున్నారు. వీరి నెలవారీ వేతనం రూ.7,500–రూ.14,000 వరకు ఉంది.

అణు క్షిపణులతో ఉత్తరకొరియా పరేడ్

రష్యా, చైనా ప్రతినిధులతో కలిసి తిలకించిన అధ్యక్షుడు కిమ్

సియోల్: ఉత్తరకొరియా శక్తివంతమైన అణు క్షిపణులను ప్రదర్శించింది. గురువారం సాయంత్రం రాజధాని ప్యాంగ్యాంగ్‌లో జరిగిన సైనిక పరేడ్‌లో రష్యా, చైనా ప్రతినిధులతో కలిసి అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ వీటిని తిలకించారు. 1950–53 కొరియా యుద్ధానికి విరామం పలికి 70 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్తరకొరియా పలు కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్న వేళ అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, రష్యాతో బంధం మరింత బలోపేతమైందని చాటేందుకే కిమ్ పరేడ్‌ను వేదికగా మార్చుకున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఉత్తరకొరియా వ్యవస్థాపకుడు, కిమ్ తాత పేరుతో ప్యాంగాంగ్‌లో ఉన్న కిమ్–2 సంగ్ స్క్వేర్‌లో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధి లి హొంగ్‌జోంగ్‌లతో కలిసి ప్రదర్శనను కిమ్ వీక్షించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. సైనిక కవాతు మధ్య



యుద్ధ ట్యాంకులు, భారీ ఖండాంతర క్షిపణు(ఐసీబీఎం)లతో కూడిన ట్రక్కులు కదులుతుండగా ముగ్గురూ చేతులు ఊపుతున్న ఫొటోలను అధికార వార్తాసంస్థ కేసీఎన్ఏ శుక్రవారం విడుదల చేసింది. కిమ్ ప్రసంగించిందీ లేనిదీ వెల్లడించలేదు. క్షిపణి వ్యవస్థలతో పాటు కొత్తగా అభివృద్ధి చేసిన నిఘా, అటాక్ డ్రోన్లను కూడా ప్రదర్శించారు. ఈ ఐసీబీఎంలన్నీ రష్యా డిజైన్ల ఆధారంగా తయారైనవేనని విశ్లేషకులు అంటున్నారు.

సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు 50 శాతం ఆర్థిక సాయం

'సెమీకాన్ ఇండియా–2023'సదస్సులో ప్రధానమంత్రి మోదీ ప్రకటన

- భారత్‌లో పరిశ్రమ అభివృద్ధికి పూర్తి అనుకూల వాతావరణం
- త్వరలో పార్లమెంట్‌లో 'నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' బిల్లు
- గుజరాత్‌లో 'సెమికాన్ ఇండియా–2023' సదస్సు



గాంధీనగర్: దేశంలో సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలకు ఊతం ఇచ్చే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. స్థానికంగా సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పే టెక్నాలజీ సంస్థలకు 50 శాతం ఆర్థిక సాయం అందించనున్నట్లు చెప్పారు. ఇలాంటి పరిశ్రమలకు తమ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరుస్తోందని అన్నారు. శుక్రవారం గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో 'సెమికాన్ ఇండియా–2023' సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు. ప్రపంచంలో వేర్వేరు కాలాల్లో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే ప్రతి పారిశ్రామిక విప్లవాన్ని ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. ఇప్పుడు నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని భారతీయుల ఆకాంక్షలే ముందుకు నడిపిస్తున్నాయని తాను నమ్ముతున్నానని తెలిపారు. భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి పూర్తి అనుకూల వాతావరణం ఉందన్నారు. 'సెమికాన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ వర్గాలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వివరించారు. దీన్ని మరింత పెంచుతున్నామని, ఇకపై దేశంలో సెమికండక్టర్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ఏకంగా 50 శాతం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

300 కాలేజీల్లో సెమికండక్టర్ డిజైన్ కోర్సులు

భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ వృద్ధికి ఇక ఆకాశమే హద్దు అని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఏడాది క్రితం భారత్‌లో ఈ పరిశ్రమలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలని ప్రశ్నించేవారని, ఇప్పుడు ఎందుకు పెట్టకూడదో చెప్పాలని అడుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ రంగంలో పెట్టుబడులకు భారత్ 'గ్రాండ్ కండక్టర్'గా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. విశ్వసనీయమైన 'చిప్ సప్లై చైన్' అవసరం ప్రపంచానికి ఉందన్నారు.

అతి తక్కువ కార్పొరేట్ ట్యాక్స్

'నేషనల్ క్వాంటమ్ మిషన్'ను ఇటీవలే ఆమోదించామని, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నామని వెల్లడించారు. క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ పరిశోధనలు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు క్వాంటమ్ మిషన్ దోహదపడుతుందన్నారు. సెమికండక్టర్ పరిశ్రమకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టామని, దేశంలో పదేళ్లలో సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 20 రెట్లు పెరిగిందని గుర్తుచేశారు. సోలార్ పీవీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రోలైజర్స్ విధానాల్లో కరెంటును ఉత్పత్తి చేయాలని నిర్ణయించామన్నారు. సదస్సులో పలు దేశాల పారిశ్రామికవేత్తలు, సెమికండక్టర్ రంగ నిపుణులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణలో భారత్ ముందంజ

చెన్నై: జీవ వైవిధ్య పునఃస్థాపన, పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో భారత్ ముందంజలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన 'జి–20 పర్యావరణ, వాతావరణ స్థిరత్వ మినిస్టీరియల్' సదస్సులో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. గంగా నదిని శుభ్రపరిచేందుకు నమామి గంగ మిషన్ అమలు చేస్తున్నామన్నారు. "భారతీయులకు ప్రకృతే పెద్ద గురువు. భూమాత పరిరక్షణ అందరి బాధ్యత" అన్నారు.

స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు భారత్ కీలకం

జపాన్ విదేశాంగ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ: స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ సాధనలో భారత్ అనివార్య భాగస్వామి అని జపాన్ విదేశాంగ మంత్రి యోషిమస హయాషి పేర్కొన్నారు. భారత్‌తో అన్ని రంగాల్లో ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యం బలోపేతం చేసుకునేందుకు జపాన్ ఆసక్తితో ఉందన్నారు. గ్లోబల్ సౌత్‌పై దృష్టిసారించిన భారత్‌ను హయాషి ప్రశంసించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు సరైన శ్రద్ధ చూపకుంటే స్వేచ్ఛాయుత, నిబంధనల ఆధారిత అంతర్జాతీయ క్రమత ఒట్టి నినాదంగానే మారిపోతుందన్నారు. భారత్‌కు రెండు రోజుల పర్యటనకు వచ్చిన హయాషి శుక్రవారం విదేశాంగ ఏర్పాటు చేసిన భారత్–జపాన్ ఫోరం సమావేశంలో మాట్లాడారు. సైబర్, అంతరిక్ష రంగాల్లో రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చల్లో పురోగతి సాధించామన్నారు. రక్షణ ఉత్పత్తులు, సాంకేతిక అంశాలకు సంబంధించిన చర్చల్లో సహకారంపై చర్చలు సాగుతున్నాయని వివరించారు. ఈ చర్చలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ..భారత్‌కు జపాన్ సహజ భాగస్వామిగా పేర్కొన్నారు.

ఆలస్యంగా గవర్నర్.. విమానం మిస్

ఎయిర్ ఏసియా విమాన సంస్థపై ఫిర్యాదు

సాక్షి, బెంగళూరు: రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్.. అలాంటి ప్రముఖుని కోసం ఆగకుండా విమానం వెళ్లిపోయింది. దీంతో ప్రొటోకాల్ ఉల్లంఘన కింద విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థపై కేసు నమోదైంది. ఈ ఘటన బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ రాయచూర్ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. హైదరాబాద్ వెళ్లే ఎయిర్ ఏషియా విమానం ఎక్కేందుకు 10 నిమిషాలు ఆలస్యంగా బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే విమానం టేకాఫ్ కావడంతో గంట వేచి ఉండి మరో విమానంలో వెళ్లారు. ప్రొటోకాల్ పాటించలేదంటూ ఎయిర్ ఏసియా, బెంగళూరు విమానాశ్రయ అధికారులపై రాజ్‌భవన్ ఫిర్యాదు చేసింది.

నేడు మణిపూర్‌కు 'ఇండియా'

క్షేత్ర స్థాయి పరిస్థితులను పార్లమెంట్‌కు నివేదిస్తామంటున్న నేతలు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పర్యటించి, అక్కడి క్షేత్ర స్థాయి పరిస్థితులపై సమస్యలకు తగు పరిష్కారం చూపుతూ కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంట్‌కు నివేదిక అందజేస్తామని ప్రతిపక్ష 'ఇండియా'కూటమి నేతలు ప్రకటించారు. కూటమిలోని 16 పార్టీలకు చెందిన 20 మంది ఎంపీలు ఈ నెల 29, 30వ తేదీల్లో మణిపూర్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ ప్రతినిధి బృందంలో కాంగ్రెస్ నుంచి అధిర్ రంజన్ చౌధురి, గౌరవ్ గొగోయ్, టీఎంసీ నేత సుష్మితా దేవ్, జేఎంఎంకు చెందిన మహువా మాజీ, డీఎంకే కనిమొళి, ఎన్సీపీ నేత మహ్మద్ ఫైజల్, ఆర్ఎల్డీ జయంత్ చౌధరి, ఆర్జేడీ మనోజ్ ఝా, ఆర్ఎస్పీ ఎన్‌కే ప్రేమచంద్రన్, వీసీకే నేత తిరుమావళన్. వీరితో పాటు జేడీ(యు) చీఫ్ రాజీవ్ రంజన్ సింగ్, జేడీ–యూకు చెందిన అనీల్ ప్రసాద్ హెగ్డే, సీపీఐ నుంచి సందేశ్ కుమార్, సీపీఎం నేత ఏఏ రహీం, ఎస్పీ నుంచి జావెద్ అలీఖాన్, ఐయూఎంఎల్ ఈటీ మహ్మద్ బషీర్, ఆప్ నేత సుశీల్ గుప్తా, శివసేన(యూటీ) అర్వింద్ సావంత్, డీఎంకే నేత డి.రవి కుమార్, కాంగ్రెస్ నేతలు ఫులో దేవి నేతం, కె.సురేశ్ ఈ బృందంలో ఉన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తితో మణిపూర్ హింసపై దర్యాప్తు జరిపించాలని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో అంతా మంచిగానే ఉన్నట్లు చూపాలని కేంద్రం అనుకుంటోందని ఆరోపించారు.

మహిళల గౌరవంతో ఆటలా?



బీజేపీ అధికార దాహంతోమహిళల గౌరవంతో, దేశ ఆత్మగౌరవంతో ఆటలాడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో వీడియో షేర్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నా కేంద్రం నోరు విప్పడం లేదని మండిపడ్డారు. మహిళా రెజ్లర్లపై బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులను ప్రస్తావిస్తూ, మహిళలను గౌరవించని దేశం పురోగమించదన్నారు.

పట్టువీడని విపక్షాలు

- మణిపూర్ హింస, అవిశ్వాస తీర్మానంపై చర్చించాలని పార్లమెంట్‌లోడిమాండ్
- ఉభయ సభలు సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలన్న డిమాండ్‌పై ప్రతిపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మణిపూర్‌లో అమాయకులు బలైపోతున్నా ప్రధానమంత్రి ఎందుకు నోరువిప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విపక్ష ఎంపీలు శుక్రవారం సైతం పార్లమెంట్ ఉభయసభల్లో ఆందోళనకు దిగారు. అలాగే మోదీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సభలో తక్షణమే చర్చ ప్రారంభించాలని పట్టుబట్టారు. నినాదాలతో హోరెత్తించారు. దీంతో ఉభయసభలను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. కార్యకలాపాలేవీ జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో 3 బిల్లులకు ఆమోదం

లోక్‌సభ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు తమ




లోక్‌సభలో విపక్ష సభ్యుల నిరసన

స్థానాల్లో లేచి నిల్చున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాలకు సహకరించాలని స్పీకర్ ఓం బిర్లా పదే పదే విజ్ఞప్తి చేసినా వారు వినిపించుకోలేదు. 1978 మే 10న కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వెంటనే చర్చ జరిగిందని కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి గుర్తుచేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పందిస్తూ.. ప్రభుత్వం నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని, అవిశ్వాస తీర్మానంపై 10 రోజుల్లోగా చర్చ చేపట్టవచ్చని తేల్చిచెప్పారు. సంఖ్యా బలం ఉంటే ప్రభుత్వాన్ని పడగొట్టాలని ప్రతిపక్షాలకు సవాలు విసిరారు. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ మధ్యాహ్నం 12 గంటల దాకా సభను వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు శాంతించలేదు. దీంతో సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ లోక్‌సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గందరగోళం మధ్యే పలు బిల్లులను సభ ఆమోదించింది.

ఇదేమన్నా స్టేజీయా: చైర్మన్ ఆగ్రహం

మణిపూర్ తదితర అంశాలపై చర్చకు రాజ్యసభలోనూ విపక్షాలు పట్టుబట్టాయి. 47 మంది ఎంపీలు ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రశ్నోత్తరాల ప్రాధాన్యతను వివరిస్తుండగా తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ జోక్యం చేసుకున్నారు. అది తమకు తెలుసని, మణిపూర్ హింసపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాంతో, ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి ఇది నాటక రంగం కాదని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓబ్రెయిన్ బల్లపై చేతితో గట్టిగా కొడుతూ అరిచారు. ఆయన తీరును తప్పుబడుతూ సభను చైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు.

ర్యాంప్‌పై హొయల గేల



ఫొటోలో కనిపిస్తున్నది రబనే విక్టర్ అనే గే మోడల్. ఇలా గడ్డం, మీసాలతోనే చూడచక్కని లెహెంగా ధరించి మరీ ర్యాంప్ వాక్ చేశాడు. కాస్త వయ్యారమూ, కాస్త మగటిమీ కలగలిపిన రెండు ప్రకృతులనూ ప్రదర్శించి తాజాగా ఇండియా కౌచర్ వీక్–2023 ప్రారంభ వేడుకలో అందరినీ అలరించాడు...

సాక్షి హైదరాబాద్

శనివారం । 29 । జులై । 2023



జడ్జిని అంటూ మోసాలు

అసిస్టెంట్ జిల్లా న్యాయమూర్తిని అని చెబుతూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తి ఆట కట్టించారు పోలీసులు. కేసు వివరాలను మల్కాజిగిరి డీసీపీ దారావత్ జానకి వెల్లడించారు. -8లో



మైనర్లను 'ముందు పెట్టి' బైక్ చోరీలు

మైనర్లను ముందు పెట్టి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి గుట్టును సౌత్ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ రట్టు చేశారు. -8లో

రోహింగ్యాలకు సిటీ నుంచి పాస్‌పోర్టులు



పాస్‌పోర్టు జారీకి ముందు జరిగే వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించి, రోహింగ్యాలకు పాస్‌పోర్టుల జారీకి కారణమైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) సిబ్బందిపై వేటు పడింది. -8లో

న్యూస్‌రీల్

సీఅండ్‌డీ వ్యర్థాలు రోడ్లపై వేస్తే చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: భవన నిర్మాణ, కూల్చివేతల (సీఅండ్‌డీ) వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తీసుకుంటామని ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ అధీకృత ఏజెన్సీల ద్వారానే వాటిని తరలించాలని స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో వేసేవారికి సీఅండ్‌డీ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2016 మేరకు భారీ జరిమానాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై కనిపించే సీఅండ్‌డీ వ్యర్థాల గురించి ప్రజలు ట్విట్టర్ ద్వారా ఃఛ్రిఛి- ౄఠిఛీఝకు గాని.. 91541 14998 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. వర్షాలతో కూలిన చెట్లు 249 ఈ నెల 20 నుంచి 28 వరకు ఈవీడీఎం డీఆర్ఎఫ్‌కు 249 చెట్లు కూలిన ఫిర్యాదులందాయి.

సూరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో 'సీడ్ బాల్స్' పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అమృత విద్యాలయం, ఆయుద్- మాతా అమృతానందమయి మఠం (మామ్) భక్తుల సహకారంతో శుక్రవారం సూరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో లక్షా 15 వేల సీడ్‌బాల్స్ పంపిణీ చేశారు. సీడ్ బాల్స్‌ను సీ 20 ప్రపంచ విత్తన బంతి ప్రచారంలో భాగంగా పర్యావరణ సంరక్షణ కోసం అటవీప్రాంతలో పంపిణీ చేశారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, స్థిరమైన పర్యావరణహిత పద్ధతుల ప్రోత్సాహం లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమృత విద్యాలయం ప్రిన్సిపాల్ 'స్వామిని సువిద్యామృత ప్రాణ' మాట్లాడుతూ.. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుగ్గా పాల్గొనేందుకు సీడ్‌బాల్ పంపిణీ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందని తెలిపారు. సూరారం రిజర్వ్ ఫారెస్ట్‌లో సీడ్ బాల్స్ విత్తడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా వాటిని పరిరక్షించడంపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. మెరుగైన భవిష్యత్తు కోసం స్థిరమైన అభ్యాసాల ప్రాముఖ్యత ప్రస్తుత తరానికి చేరువ చేయాల్సిన అవసరముందన్నారు.

నగరంలో ఎక్కడి సమస్యలక్కడే

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మలక్‌పేట: మూసారంబాగ్ బ్రిడ్జి శుక్రవారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని, ఇస్తాంబుల్, న్యూయార్క్, వాషింగ్టన్ చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పినప్పటికీ, కింది స్థాయిలో ఏ రకమైన మార్పు రాలేదన్నారు. ట్యాంక్ బండ్‌లో మురికి నీరు తీసి కొబ్బరి నీళ్లు పోస్తామని చెప్పిన మాటలు మొదలుకొని.. అన్ని బస్తీల్లో డ్రైనేజీ, మంచి నీళ్లు, రోడ్లు, పార్కు, వీధుల మరమ్మతులు, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేవని.. అన్నీ సమస్యలే ఉన్నాయన్నారు. హైటెక్ సిటీలో, ఫైనాన్షియల్ డిస్ట్రిక్స్‌లో ఫ్లై ఓవర్లు కడుతున్నామని, రకరకాలు రంగులు వేస్తున్నామని చెబుతున్నారే తప్ప బడుగు బలహీన వర్గాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో నగర ప్రజలు నరకం అనుభవిస్తున్నారని, సీఎం కేసీఆర్ అధికారంలో ఉండే ఈ మూడు నెలల్లోనైనా హైదరాబాద్ గురించి ఆలోచన చేయాలన్నారు.



బంజారాహిల్స్‌లో ..

సిటీకి సూరీడు వచ్చేనమ్మా!



ఎన్ని రోజులకెన్ని రోజులకు భానుడు కనిపించాడు. నగరవాసులకు కనువిందు చేశాడు. పదిరోజులుగా ఆకాశంలో ముసుగేసిన మబ్బులతో నగరం మసకేసింది. ముసురు వానలతో కారుచీకట్లు అలుముకున్నాయి. సూరీడు మబ్బుల చాటునే దాగుండిపోయాడు. ఈదురు గాలులతో సిటీజనులు గజగజ వణుకుతున్న వేళ.. శుక్రవారం ఆదిత్యుడి ఆగమనం నూతన ఉత్సాహాన్ని కలిగించింది. వరుసపెట్టి కురుస్తున్న వర్షాలు తెరిపినివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. రవి కిరణాల వెలుగుల్లో ధవళ కాంతులతో డాక్టర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం తళుకులీనుతూ కనిపించింది. సందర్శకులతో ట్యాంక్‌బండ్ సందడిగా మారింది. గరిష్ఠంగా 27.8, కనిష్ఠంగా 24.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. – సాక్షి, సిటీబ్యూరో



ఎల్ఆర్ఎస్.. తుస్

సాక్షి, సిటీబ్యూరో: కొర్రెములకు చెందిన ఓ దరఖాస్తుదారు కొద్ది రోజుల క్రితం తన స్థలం రెగ్యులరైజేషన్ కోసం హెచ్ఎండీఏ అధికారులను సంప్రదించారు. ఎల్ఆర్ఎస్ కోసం 2020లో వెలువడిన నోటిఫికేషన్ మేరకు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. అప్పుడు ఫీజు చెల్లించినట్లుగా రసీదు ఉంటే తప్ప తాము ఏమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. మూడేళ్ల క్రితం చెల్లించిన ఫీజు తాలూకు రసీదు అతని వద్ద లేదు. సదరు దరఖాస్తుదారే కాదు. అప్పట్లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది దరఖాస్తుదారుల వద్ద ఇప్పుడు ఎలాంటి రసీదులు లేకుండాపోయాయి. పైగా చాలామంది తమ స్థలాలను ఇతరులకు విక్రయించారు. ఈ పరిస్థితుల్లో రసీదు ఉంటే తప్ప ఎల్ఆర్ఎస్ పరిశీలన సాధ్యం కాదని హెచ్ఎండీఏ అధికారులు చెప్పడం వారి పాలిట అశనిపాతంలా మారింది. ఒక్క కొర్రెంల, నారపల్లి, పోచారం వంటి వాటితో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్త నడకన సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల మధ్య సమన్వయం కొరవడడం కూడా ఇందుకు మరో కారణమని సమాచారం.

దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం

- రసీదు ఉంటేనే అవకాశం
- సీజీఎస్ నుంచి హెచ్ఎండీఏకు చేరిన డేటా
- ప్లాట్ల యజమానుల ఎదురుచూపులు



వేలాది మంది ఎదురుచూపులు..

- ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం నోటిఫికేషన్ వెలువరించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు మినహాయించి హెచ్ఎండీఏ పరిధిలోనూ సుమారు 80 వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు అంచనా. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీఎస్) ఎల్ఆర్ఎస్ కోసం ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. దరఖాస్తుల స్వీకరణను సులభతరం చేసింది. పెద్ద ఎత్తున దరఖాస్తులను స్వీకరించినప్పటికీ కొన్ని వివాదాల కారణంగా అప్పట్లో ఎల్ఆర్ఎస్ జారీని నిలిపివేశారు.
- తాజాగా ఎల్ఆర్ఎస్‌ల జారీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. మొదటి దశలో ఎకరానికి పైగా ఉన్న వెంచర్‌లలో మిగిలిపోయిన ప్లాట్‌లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం భూయజమానులు ఎల్ఆర్ఎస్ కోసం రూ.10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలోని మేడ్చల్, ఘట్కేసర్, శంషాబాద్, చేవెళ్ల జోన్‌ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌కు అయ్యే ఖర్చులను కూడా చెల్లించి ప్రస్తుతం ప్రొసీడింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఒకవైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే చిన్న ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు కూడా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు అవకాశం లభించింది.
- ఫీజు చెల్లించినట్లుగా చాలామంది వద్ద రసీదులు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల మొబైల్ ఫోన్‌కు సమాచారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇటు హెచ్ఎండీఏ నుంచి, అటు మున్సిపాలిటీల నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరు హెచ్ఎండీఏ అధికారులను స్వయంగా సంప్రదించేందుకు తరలివస్తున్నారు. ఫీజు చెల్లించినట్లుగా రసీదు ఉంటే తప్ప తామేం చేయలేమంటూ అధికారులు తేల్చి చెప్పడంతో దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు.

రసీదు తప్పనిసరి కాదు..

ఈ నేపథ్యంలో.. దరఖాస్తుదారుల నుంచి సేకరించిన వివరాలన్నింటిని హెచ్ఎండీఏకు అందజేసినట్లు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల వివరాలు తెలుసుకొనేందుకు ఫీజు చెల్లించినట్లుగా ఎలాంటి రుజువులు అవసరం లేదని, అప్పట్లో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి డేటా పూర్తిగా అందుబాటులో ఉందని చెప్పారు.రసీదుతో సంబంధం లేకుండా దరఖాస్తుదారుల పూర్తి పేరు, సర్వే నంబర్, ప్లాట్ నంబర్, ఫోన్ నంబర్ ఆధారంగా కూడా వివరాలు తెలుసుకొనే సదుపాయం ఉందని చెప్పారు. కానీ.. హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తుదారులు కోరిన సమాచారం మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు వివిధ జోన్‌లలో పని చేసే ఏపీఓలు, జేపీలు, తదితర ఉద్యోగుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతోనూ దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇక వ్యాధుల నివారణపై నజర్

పారిశుద్ధ్యంపై శ్రద్ధ

- సిద్ధమవుతున్న బల్దియా



సాక్షి, సిటీబ్యూరో: సుమారు పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు శుక్రవారం విరామమివ్వడంతో తదుపరి తలెత్తబోయే సమస్యలపై జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. వర్షాల వల్ల చాలా ప్రాంతాల్లో వరద, మురుగు నీరు కలిసిపోవడంతో కలుషిత నీటి సమస్యలు తలెత్తనున్నాయి. తడిసిన చెత్తతో పరిసరాలు దుర్గంధంగా మారి దోమలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి. వర్షాలు కురుస్తున్న రోజుల్లోనూ పారిశుద్ధ్యంపై తగిన శ్రద్ధ చూపి సిబ్బందితో పాటు అధికారులు రాత్రుళ్లు కూడా క్షేత్రస్థాయిలో పనులు చేయడంతో రోడ్లపై చెత్త సమస్యలు పెద్దగా కనిపించలేదు. ఈ విధానాన్ని ఇక నిరంతరం కొనసాగించడంతో పాటు దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లు సక్రమంగా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

- వర్షాలు వెలిశాక వ్యాధుల నివారణపై దృష్టి సారిస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్న నేపథ్యంలో అధికారులు ఆ దిశగా శ్రద్ధ చూపుతున్నారు. మంత్రి ఆదేశాలకనుగుణంగా ఇంకా వివిధ కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. ఓపెన్ ప్లాట్లలోని కుంటల్లో వర్షపు నీరు చేరడం వల్ల, పిచ్చిమొక్కలు పెరగడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి కాబట్టి అలాంటి కుంటల్ని పూడ్చి వేయనున్నారు. వ్యయాన్ని సంబంధిత భవన యజమానులకే విధించనున్నారు. జనాలు లేకుండా ఖాళీగా ఉన్న భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పాములకు ఆవాసాలుగా మారుతున్నాయి.
- ఇటీవల అల్వాల్‌లో ఒక ఇంట్లోకి పాము రాగా ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులపై విమర్శలు వెల్లువెత్తడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు లేకుండా చర్యలు చేపట్టనున్నారు. డీసిల్టింగ్ ఇప్పటికే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పనులు పూర్తికాని ప్రాంతాల్లో డీసిల్టింగ్ చేయనున్నారు.
- దీంతోపాటు వర్షాలకు కొట్టుకువచ్చిన వ్యర్థాలతో నాలాల్లో సిల్ట్ పేరుకుపోతోంది ఇక ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేయనున్నారు. ప్రస్తుతానికి వర్షాలు తెరిపినిచ్చినా అక్టోబర్ వరకు నగరంలో భారీ వర్షాలకు అవకాశం ఉన్నందున శిథిల భవనాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. శిథిల భవనాలను కూల్చివేయడమో వాటిలో ఉంటున్న వారిని ఖాళీ చేయించడమో చేస్తామని చెబుతున్నారు. ఎదురయ్యే పరిస్థితుల్ని బట్టి చర్యలు తీసుకుంటామంటున్నారు.

బుక్కవుతున్న టెకీలు

గత నెలలో సైబరాబాద్‌లో వంద కేసులు

- ఇందులో 80 శాతం ఐటీ ఉద్యోగులవే
- రాజస్థాన్, హరియాణా, యూపీ మోసగాళ్లే ఎక్కువ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఆశతోనే సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నట్లు తెలుస్తోంది. అధిక లాభాల ఆశతో ఐటీ ఉద్యోగులే ఎక్కువ సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. గత నెలలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వంద సైబర్ క్రైం కేసులు నమోదు కాగా.. ఇందులో 80 శాతం బాధితులు టెకీలు ఉండటమే ఇందుకు ఉదాహరణ.

ఎలా చిక్కుతున్నారంటే..

చాలా మంది కస్టమర్ కేర్ నంబర్ల కోసం గూగుల్‌లో వెతుకుతుంటారు. అవి నకిలీ నంబర్లని, సైబర్ నేరస్తుల వలలో చిక్కే ప్రమాదముందని గ్రహించరు. గూగుల్‌లో పొందిన కస్టమర్ కేర్ నంబర్‌ను ధ్రువీకరించుకోకుండానే నేరుగా ఫోన్ చేస్తుంటారు. దీంతో సైబర్ నేరస్తుల చేతికి చిక్కి మోసపోతుంటారు. కస్టమర్ కేర్ నంబర్ల కోసం అధికారిక వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందాలి. ఐటీ ఎంప్లాయిస్ మూన్‌లైట్, పార్ట్ టైం జాబ్, ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో మోసాల బారిన ఎక్కువగా పడుతున్నారు. క్లిక్ చేయండి, లైక్ కొట్టండి, ఇంటి నుంచే డబ్బు సంపాదించండి అంటూ సామాజిక మాధ్యమాల్లో సైబర్ నేరగాళ్లు మోసపూరిత ప్రకటనలు చేస్తుంటారు. వీటికి ఆకర్షితులై ఐటీ ఉద్యోగులు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి నట్టేట మునిగిపోతున్నారు.



మోసగాళ్లు ఈ రాష్ట్రాల నుంచే ఎక్కువ..

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటమే నేరాల నియంత్రణకు సరైన మందు. విద్యావంతులు సైబర్ నేరాల బారిన పడరన్నది అపోహ మాత్రమే. నిజం చెప్పాలంటే నిరుద్యోగులు, నిరక్షరాస్యుల కంటే వీరిని మోసం చేయడమే సులువు. మోసపూరిత స్కీమ్‌లలో పెట్టుబడులు, ఎనీ డెస్క్ వంటి రిమోట్ యాక్సెస్‌ను ఇచ్చే నకిలీ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం లేదా వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) వంటి రహస్య వివరాలను బహిర్గతం చేయడం వంటి సైబర్ నేరాల బారిన పడటానికి ప్రధాన కారణమని సైబర్ క్రైమ్ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. సైబర్ నేరాలు రాజస్థాన్, హరియాణా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కస్టమర్ కేర్, ఓఎల్ఎక్స్, ఓటీపీ, క్రెడిట్ కార్డ్ వంటి మోసాలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

అందంగా.. ఆహ్లాదంగా..



మూసీపై 14 చోట్ల వంతెనలు

- 10 చోట్ల జీహెచ్ఎంసీ, మరో 5 చోట్ల హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మాణాలు
- సుమారు రూ.545 కోట్లతో నిర్మాణం



సాక్షి, సిటీబ్యూరో: మూసీనదిపై బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం 14 ప్రాంతాల్లో విశాలమైన వంతెనలను నిర్మించే పనుల్లో వేగం పెరిగింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్), కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో వంతెనలు నిర్మించనున్నారు. నగర చారిత్రక సౌందర్యానికి మరింత వన్నె తెచ్చేలా వంతెనల నిర్మాణ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.545 కోట్లు కేటాయించింది. మూసారంబాగ్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్, ప్రతాప్ సింగారం, మంచిరేవుల, బుద్వేల్ తదితర చోట్ల బ్రిడ్జీల నిర్మాణానికి రూ.130 కోట్లతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారు 200 మీటర్ల వెడల్పుతో అందుబాటులోకి రానున్న ఈ బ్రిడ్జీలు మూసీనదికి వడ్డాణం చుట్టినట్లుగా ఎంతో అందంగా ఉంటాయి. వంతెనకు రెండు వైపులా పేవ్‌మెంట్‌లు, రెయిలింగ్‌లను ఏర్పాటు చేస్తారు. చారిత్రక మూసీ గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ఇవి ఉంటాయి. రెండు వైపులా అందమైన దీపస్తంభాలను ఏర్పాటు చేస్తారు. దూరం నుంచి ఈ బ్రిడ్జీలను చూసినప్పుడు విద్యుద్దీపాల వెలుగుల్లో ఎంతో అందంగా కాంతులీనుతూ ఆకట్టుకుంటాయని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. మూసారంబాగ్‌పై నిర్మించనున్న బ్రిడ్జీ నమూనా చిత్రాలను తాజాగా అందుబాటులోకి తెచ్చారు. నగరంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య వాహనాల రాకపోకలకు మూసీనది ప్రధాన ఆటంకంగా ఉన్న సంగతి తెలిసిందే. నిజాం కాలంలోనూ, ఆ తర్వాత కట్టించిన కొన్ని బ్రిడ్జీలతో రాకపోకలకు కొంత వరకు సదుపాయం ఉన్నప్పటికీ మహానగరం విస్తరణకు అనుగుణంగా బ్రిడ్జీల విస్తరణ లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో కొత్త బ్రిడ్జీల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. మరోవైపు కొన్ని చోట్ల పాత కాలం నాటి బ్రిడ్జీలు వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలకు ఆటంకంగా ఉన్న మూసీనదిపై వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2024 నాటికి వీటి నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.



మూసారంబాగ్ వద్ద నిర్మించనున్న బ్రిడ్జి నమూనా చిత్రం



కదం తొక్కిన కాంగ్రెస్

జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

హిమాయత్‌నగర్: భీకర వర్షాలతో నగరం అతలాకుతలమవుతున్న నేపథ్యంలో ఇటు ప్రభుత్వం, అటు జీహెచ్ఎంసీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి ర్యాలీగా జీహెచ్ఎంసీ కార్యాలయానికి చేరుకున్నాయి. కొందరు నాయకులు నినాదాలు చేస్తూ బైఠాయించారు. మరికొందరు గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి తన అనుచరులతో కలిసి ప్రధాన ద్వారా గేట్లు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి లిబర్టీ, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, సచివాలయం, ట్యాంక్‌బండ్, గన్‌ఫౌండ్రీ, ఖైరతాబాద్ వరకు దాదాపు గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. భారీ ర్యాలీగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులను ప్రధాన ద్వారాల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దాదాపు అరగంట పాటు పోలీసులకు, కాంగ్రెస్ శ్రేణులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కొంతమంది నాయకులను కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు లోపలికి అనుమతించారు.



ప్రగతిభవన్ నుంచి బయటికొస్తేనే వాస్తవాలు తెలుస్తాయి

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



రోడ్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రగతిభవన్‌లో కూర్చొని మాట్లాడితే ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. ఆద్యంతం ఆయన పర్యటన మురుగునీటిలోనే కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వచ్చే ఆదాయంలో 80 శాతం ఒక్క హైదరాబాద్ నుంచే ప్రభుత్వానికి వస్తున్నదని, అందులో 8 శాతం కూడా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. అరకొర నిధులతో హైదరాబాద్ విశ్వనగరంగా మారదని, ఫ్లైఓవర్లు కట్టి రంగులు వేస్తే ఇంటర్నేషనల్ సిటీగా మారదని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను తీర్చిదిద్దడం లేదని అన్నారు. దీనిని ఇస్తాంబుల్, లండన్ చేస్తారా, న్యూయార్క్, వాషింగ్టన్‌లా చేస్తారో చేయండి, ముందుగా తాగునీటి వ్యవస్థ సహా రోడ్లను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను పిలిపించి పలు ప్రాంతాల్లో నిలిచిన వరద, డ్రైనేజీ నీరు వెళ్లిపోయేలా పూడికను తీయించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతం రావు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కిలారి మనోహర్, కుంభాల గంగరాజు, చంద్రమోహన్, జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, స్వప్న పాల్గొన్నారు.

ఎల్ఐసీ కొత్త పాలసీ జీవన్ కిరణ్

సాక్షి, సిటీబ్యూరో: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) జీవన్ కిరణ్ పేరుతో మరో సరికొత్త బీమా పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీని వ్యక్తిగత, పొదుపు, జీవిత బీమా ప్లాన్‌గా తీసుకోవచ్చని ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయస్కులు అర్హులుగా ఉండే ఈ పాలసీ తక్కువ ధరకు ఎక్కువ బీమా కవర్ అందుతుందని పేర్కొంది. 10 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ఉండే ఈ పాలసీ టర్మ్‌లో కనిష్ఠ సమ్ అష్యూర్డ్ రూ.15 వేలుగా ఉంటుందని తెలిపింది.

మైనర్లను ‘ముందు పెట్టి’ బైక్ చోరీలు!

- ఇళ్లు, దుకాణాల ముందు పార్క్ చేసినవే టార్గెట్
- ఎవరైనా గుర్తిస్తే పొరపాటు అంటూ ఎస్కేప్
- ఆరు ఠాణాల పరిధిలో ఏడు తస్కరణ
- ఇద్దరు బాలురు సహా నలుగురి పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: మైనర్లను ముందు పెట్టి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరి వ్యవహారాన్ని సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టురట్టు చేశారు. ఇద్దరు బాలురు సహా నలుగురిని పట్టుకున్నామని వీరి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు శుక్రవారం వెల్లడించారు. హుస్సేనిఆలం ప్రాంతానికి చెందిన షేక్ ముస్తాఫా బ్యాండ్ మాస్టర్. ఓల్డ్ సంతోష్‌నగర్ వాసి మహ్మద్ అఫ్సర్ ఆటో డ్రైవర్. విలాసాలకు అలవాటుపడిన ఈ ద్వయం వాటి కోసం తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేయాలని పథకం వేశారు. దీన్ని కార్యరూపంలో పెట్టడం కోసం ఇద్దరు మైనర్లను తమతో చేర్చుకున్నారు. పగలు–రాత్రి తేడా లేకుండా ఇళ్ల ముందర, దుకాణాల వద్ద నిలిపి ఉంచే వాహనాలను టార్గెట్‌గా చేసుకున్నారు. వీరిలో ఒక్కొక్కరూ ఒక్కో మైనర్‌ను తీసుకుని బయలుదేరతారు. ఓ వాహనాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత దాని వద్ద కాస్సేపు తచ్చాడుతారు. అదును చూసుకుని సదరు మైనర్ ఆ వాహనం ఎక్కి కాలితో గట్టిగా తన్నడం ద్వారా హ్యాండిల్ లాక్ పగులకొడతాడు. ఆపై కొద్దిదూరం తోసుకుంటూ వస్తాడు. ఇదంతా కాస్త దూరంలో ఉండి ముస్తాఫా, అఫ్సర్ గమనిస్తుంటారు. మార్గ మధ్యంలో ఎవరైనా పట్టుకుంటే బాలుడు తెలియక చేశాడనో, తమ వాహనంగా పొరబడ్డామనో వీళ్లు చెప్తారు. ఎవరూ గమనించకపోతే వైర్లు కలపడం ద్వారా వాహనాన్ని స్టార్ట్ చేసి ఉడాయిస్తారు. ఇలా ఈ నలుగురు ఇద్దరిద్దరుగా కలిసి గడిచిన కొన్నాళ్లలో హుస్సేనిఆలం, బండ్లగూడ, ఖైరతాబాద్, ఐఎస్ సదన్, ఫలక్‌నుమ, కాలాపత్తర్ ఠాణాల పరిధి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు తస్కరించారు. వీటిని ఖరీదు చేసే వ్యక్తుల కోసం అన్వేషిస్తూ ఓ ప్రాంతంలో దాచి ఉంచారు. ఈలోపు వీరి వ్యవహారాలపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ నేతృత్వంలో ఎస్సైలు పి.సాయిరామ్, ఎం.అనంతాచారి, సి.రాఘవేంద్రరెడ్డి తమ బృందాలతో వలపన్ని నలుగురినీ పట్టుకున్నారు. వీరి నుంచి చోరీ వాహనాలు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత పోలీసుస్టేషన్లకు అప్పగించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

ఉప్పల్: హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ డీసీపీ కె.మురళీధర్, ఎల్‌బీనగర్ ఏసీపీ కె.జానకిరెడ్డిలతో కలిసి శుక్రవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాజస్థాన్‌లోని జాలోరు జిల్లా రానోదర్ ప్రాంతానికి చెందిన పూనమ్ రామ్ బిషనోయి, దినేష్ కుమార్, ధర్మారామ్‌లు సిటీకి వచ్చి బీరంగూడలో ఉంటున్నారు. వీరు మత్తుమందులకు అలవాటు పడ్డారు. తర్వాత వాటినే విక్రయిస్తూ లాభాలుగడిస్తున్నారు. రాజస్థాన్ నుంచి సజ్జలతో కలిపి బస్సుల్లో నగరానికి మత్తు పదార్థాలు తీసుకువస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా మాటువేసి శుక్రవారంసరూర్‌నగర్ గాంధీ విగ్రహం వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న వీరిని పట్టుకున్నారు. విచారించగా మత్తు పదార్థాలను రూ.6 వేలకు కొన్ని రూ.10 వేల వరకు విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 40 గ్రాముల హెరాయిన్, 100 గ్రాముల ఓపియం, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దాం

సీఎండీ రఘుమారెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సరిచేసి..అన్ని కేటగిరీల వినియోగదారులకు సరఫరాను పునరుద్ధరించినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ జి.రఘుమారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంస్థ ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలతో విద్యుత్ పునరుద్ధరణ పనులు, సరఫరా పరిస్థితిని సమీక్షించారు. వర్షాల వల్ల సంస్థ పరిధిలో ఈ పది రోజుల్లో 2770 స్తంభాలు, 34 ట్రాన్స్ ఫార్మర్లు, అలాగే గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో 605 స్తంభాలు, ఏడు ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయని, అన్నింటిని పునరుద్ధరించినట్లు తెలిపారు. వరద ప్రభావం తగ్గిన తర్వాత అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా పెట్రోలింగ్ నిర్వహించి భవిష్యతులో మళ్లీ ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమతంగా ఉండాలని, సెలవు రోజుల్లో కూడా హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదుల స్వీకరణ కోసం, అన్ని జిల్లాల/సర్కిళ్ల హెడ్ క్వార్టర్లలో, హైదరాబాద్‌లోని స్కాడా కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు సమీప విద్యుత్ కార్యాలయానికి, కంట్రోల్ రూమ్స్‌కు, సంస్థ మొబైల్ ఆప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, 1912/ 100 కు కాల్ చేసి సమస్యను తమ దృష్టికి తీసుకురావాలని సీఎండీ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్స్ జె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జడ్జిని అంటూ మోసాలు

- నకిలీ వేషగాడి ఆటకట్టు
- గన్‌మెన్‌తో సహా అరెస్టు
- పిస్టల్, బుల్లెట్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకి తదితరులు

ఉప్పల్: అసిస్టెంట్ జిల్లా న్యాయమూర్తిని అని చెబుతూ పలు రకాల మోసాలకు పాల్పడుతున్న ఓ నకిలీ ఆట కట్టించారు పోలీసులు. వివరాలను మల్కాజిగిరి డీసీపీ దారావత్ జానకి, ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, ఏసీపీ నరేష్ రెడ్డిలు శుక్రవారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కరీంనగర్ జిల్లా వేములవాడ ప్రాంతానికి చెందిన నామాల నరేందర్ (31)వృత్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం. ఇతడు తాను అసిస్టెంట్ జిల్లా జడ్జిని అని అబద్ధం చెప్పి...అనంతపురం జిల్లాకు చెందిన మాజీ సైనికుడు చిక్కం మధుసూదన్ రెడ్డిని గన్‌మెన్‌గా నియమించుకున్నాడు. నిత్యం రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు. 2021లో వనస్థలిపురానికి చెందిన గార్లపాటి సోమిరెడ్డితో తాను జడ్జిగా పరిచయం చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో సోమిరెడ్డికి సంబంధించిన భూమి పేరు మార్పిడి చేయిస్తానని అతని వద్ద రూ.10 లక్షలు తీసుకున్నాడు. సంవత్సరాలు గడిచినా పని చేయడం లేదు. అడిగితే తప్పించుకుని తిరుగుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం నామాల నరేందర్, గన్‌మెన్‌గా ఉన్న చిక్కం మధుసూదన్‌రెడ్డిలను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో నామాల నరేందర్ న్యాయమూర్తి కాదని తేలింది. అలాగే గన్‌మెన్ వద్ద ఉన్న పిస్టల్‌కు లైసెన్స్ లేదని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి షార్ట్ వెపన్, ఐదు రౌండ్ల బుల్లెట్స్, రెండు మ్యాగ్జిన్స్, కారు, నకిలీ ఐడీ కార్డులు, విజిటింగ్ కార్డు, నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు నామాల నరేందర్, గన్‌మెన్ మధుసూదన్ రెడ్డి

నామాల నరేందర్ నేర చరిత్ర...

- డిగ్రీ వరకు చదువుకున్న నామాల నరేందర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. గతంలో 9 కేసుల్లో నిందితుడు. జైలు శిక్ష కూడా అనుభవించి వచ్చాడు. 2014 నుంచి 2016 వరకు హైదరాబాద్, సైబరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు.
- 2017లో ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పీడీ యాక్టును నమోదు చేశారు. 2018లో జైలు నుంచి వచ్చి ఖమ్మం వెళ్లాడు. అక్కడ తాను అసిస్టెంట్ సివిల్ జడ్జిగా ప్రమోట్ చేసుకున్నాడు. అమాయకులను నమ్మించి మోసం చేస్తూ వస్తున్నాడు.

రోహింగ్యాలకు సిటీ నుంచి పాస్‌పోర్టులు

- వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్బీ సిబ్బంది
- ఈ విషయం గుర్తించి అప్రమత్తం చేసిన నిఘా విభాగం
- ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన నగర కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: పాస్‌పోర్టు జారీకి ముందు జరిగే వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించి, రోహింగ్యాలకు పాస్‌పోర్టుల జారీకి కారణమైన స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) సిబ్బందిపై వేటు పడింది. గత వారం జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మయన్మార్ నుంచి బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వలసవచ్చి, నగరంలో అనధికార శరణార్థిగా స్థిరపడి, దేశ పౌరులుగా ప్రకటించుకుని గుర్తింపుకార్డులు పొందుతున్న రోహింగ్యాలతో పెను ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు చాన్నాళ్లుగా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్నాళ్లుగా పాస్‌పోర్ట్స్ వెరిఫికేషన్‌లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పదేపదే స్పష్టం చేస్తున్నాయి. మయన్మార్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన రోహింగ్యాలు బంగ్లాదేశ్ మీదుగా భారత్‌లో ప్రవేశిస్తున్నారు. కొన్నాళ్లు జమ్మూ కాశ్మీర్, పశ్చిమ బెంగాల్ సహా ఉత్తరాదిలోని అనేక రాష్ట్రాల్లోని ఉంటున్నారు. ఆపై అదును చూసుకుని హైదరాబాద్‌కు వచ్చి వివిధ ప్రాంతాల్లో స్థిరపడుతున్నారు. కొందరికి ఐక్యరాజ్య సమితి జారీ చేసే శరణార్థి కార్డులు ఉంటుండగా మరికొందరికి ఉండట్లేదు. కార్డు ఉన్నా ఆ విషయం దాచి పెడుతున్న రోహింగ్యాలు తాము భారతీయులమే అని చెబుతున్నారు. నగరంలోని వివిధ మీ సేవ సర్వీస్ సంస్థల నిర్వాహకుల సహకారంతో ఓటర్ ఐడీ వంటి గుర్తింపులు పొందుతున్నారు. వీటి ఆధారంగా కొన్ని ప్రభుత్వ పథకాల లబ్ధి పొందటంతో పాటు పాస్‌పోర్టులు తీసుకుంటున్నారు. ఇలా భారతీయులుగా మారిపోతున్న ఈ రోహింగ్యాల్లో అనేక మంది దేశం దాటేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పాస్‌పోర్టుల జారీకి ముందు నిర్వహించే ఎస్బీ వెరిఫికేషన్‌ను పక్కాగా నిర్వహించాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, రోహింగ్యాలకు పాస్‌పోర్టు జారీ కావడానికి కొందరు సిబ్బంది కారణమని నిఘా విభాగం గుర్తించింది. ఈ మేరకు నగర కొత్వాల్‌కు నివేదిక అందించింది. దీని ఆధారంగా శాఖాపరమైన విచారణ చేపట్టిన కమిషనర్ దీని ఆధారంగా నారాయణగూడ, నాంపల్లి, అబిడ్స్ పరిధుల్లో విధులు నిర్వర్తించిన ముగ్గురు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. వెరిఫికేషన్ విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

బీఎన్ఐ ‘గోనాట్–2023 సదస్సు’ లోగో ఆవిష్కరణ

మాదాపూర్: వ్యాపారాలను జాతీయస్థాయిలో నిర్వహించుకోవడానికి బీఎన్ఐ(బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) ఎంతగానో ఉపయోగపడుతుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం గోనాట్– 2023 లోగోను బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనతో కలసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధికి ప్రభు త్వం నుంచి సహకారం ఉంటుందన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో డైరెక్టర్ సంజన మాట్లాడుతూ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో సెప్టెంబర్ 9,10వ తేదీలలో గోనాట్–2023, 4వ ఎడిషన్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో చిన్న, మధ్యతరహా వ్యాపారాలు తమ ఉనికిని విస్తరించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. దేశం నలుమూలల నుండి 3వేల మంది హాజరుకానున్నట్లు తెలిపారు. 200 స్టాల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. బీఎన్ఐ సభ్యులు తమ ఉత్పత్తులను, సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ హైదరాబాద్ ఏరియా డైరెక్టర్ టి.సతీష్‌కుమార్, బీఎన్ఐ సభ్యులు మీరా, కెప్టెన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



బీఎన్ఐ గోనాట్ లోగోను ప్రారంభించిన జయేశ్‌రంజన్ తదితరులు

నేడు మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ సంస్మరణ సభ



అబిడ్స్: ఉమ్మడి రాష్ట్ర మంత్రి, గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగిన దివంగత ముఖేష్‌గౌడ్ సంస్మరణ సభ ఈనెల 29న శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ తెలిపారు. దాదాపు 40 ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలందించిన ముఖేష్‌గౌడ్ సంస్మరణ సభకు పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు, నియోజకవర్గ ప్రజలు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సంస్మరణ సభ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ఈ సభకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

నగరంలో అత్యధిక యూఎస్‌ఎఫ్‌డీఏ ఫార్మా యూనిట్లు

సాక్షి,సిటీబ్యూరో: ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదిత ఫార్మాస్యూటికల్ తయారీ యూనిట్లు హైదరాబాద్ జిల్లాలో ఉన్నాయని ఎన్ఆర్ఐ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఈ.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో తర్వాతి స్థానంలో న్యూజెర్సీ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. యూఏఈ–ఇండియా బిజినెస్ కౌన్సిల్, తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్‌భవన్ రోడ్‌లోని హోటల్ పార్క్ వేదికగా సమగ్ర ఆర్థిక, వ్యాపార అవకాశాలపై బిజినెస్ సెషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో స్వేచ్ఛావాణిజ్యం, మంచి ఆర్థిక భాగస్వామ్యాలు ఉన్నాయని, ఇక్కడ అందుకే అన్ని పరిశ్రమలు వృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలో ఒకే ప్రాంతంలో అత్యధికంగా 214 యూనిట్లు ఉన్న యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదిత తయారీ ఔషధ కంపెనీలు హైదరాబాద్ జిల్లాలో ఉండటం విశేషమని అన్నారు. 189 యూనిట్లతో న్యూజెర్సీ తరువాతి స్థానంలో ఉందన్నారు. ఈ సెషన్‌లో ఎఫ్‌టీసీసీఐ నూతన అధ్యక్షులు మీలా జయదేవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ సింఘాల్, ఎఫ్‌టిసిసిఐ సీఈఓ ఎంఎస్ ఖ్యాతి నరవాణే తదితరులు పాల్గొన్నారు.



పవర్‌గ్రిడ్ చెస్ టోర్నీ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సదరన్ రీజియన్–1 ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ రీజినల్ చెస్ టోర్నీ మొదలైంది. మూడు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నీలో మొత్తం 18 జట్లు పాల్గొంటున్నాయి. పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ‘జీవితం కూడా చదరంగం క్రీడలాంటిదని, తమ కదలికలు, ఆలోచనలు ఎక్కడికి దారితీస్తాయో తెలియదని, స్ఫూర్తి అని శృతితో కూడి ఉంటుంది’ అని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ (అసెట్ మేనేజ్‌మెంట్) అలోక్ కుమార్ శర్మ, చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) సంజయ్ కుమార్ గుప్తా, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) పీకే హరినారాయణన్, టోర్నీ చీఫ్ ఆర్బిట్రేటర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు పురుషుల టీమ్ విభాగంలో నాలుగు రౌండ్లు పూర్తయ్యాక నార్త్ ఈస్ట్ రీజియన్ ఏడు పాయింట్లతో.. మహిళల టీమ్ విభాగంలో కార్పొరేట్ సెంటర్ (సీసీ) జట్టు ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలి పారు. పద్మాలయ 11కేవీ ఫీడర్ ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్-78, 79, 80, పద్మాలయ స్టూడియోలైన్, మహేష్‌బాబు ఇంటి ఏరియా, ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ ఎ.శ్రీనివాస్ తెలిపారు. బి.వి.భవన్ 11కేవీ ఫీడర్ ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్‌లోని రోడ్-71, 72, 73, 74, 76, జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్, నవ నిర్మాణ్‌నగర్, బి.వి.భవన్ స్కూల్, మహా న్యూస్ లైన్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అపోలో 11కేవీ ఫీడర్ ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, సీవీఆర్ న్యూస్ లైన్, ఫిల్మ్ ఛాంబర్ ఏరియా, ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

ఏసీపీకి అభినందన



ఏసీపీని కలిసిన బోరబండ ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు

రహమత్‌నగర్: ఎస్ఆర్‌నగర్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్‌రావును బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్, ఎస్‌ఐలు మహేష్, స్వప్నారెడ్డి, మనోజ్ కుమార్, సయ్యద్ జమాల్, తుల్జారాం శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఏసీపీ తమకు సూచించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

కార్పొరేటర్ పర్యటన



హిమాయత్‌నగర్: డివిజన్‌లో మోకాల్లోతు నీళ్లల్లో కూరుకుపోయిన ప్రాంతాల్లో కార్పొరేటర్ మహాలక్ష్మి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి, వారికి అండగా ఉంటానన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న ప్రతి ఒక్క సమస్య తక్షణం పరిష్కారం కావాలని సూచించారు. రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, మహేష్, మల్లేష్, అశ్విన్ జైస్వాల్, జకీ తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న వైద్య విద్యార్థులు

బంజారాహిల్స్: సీపీఆర్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్‌పై పోలీసులకు అవగాహన కలిగించేందుకు ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థుల బృందం శుక్రవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా ఇన్‌స్పెక్టర్, అయిదు మంది ఎస్‌ఐలతో పాటు 43 మంది కానిస్టేబుళ్లకు సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. కానిస్టేబుళ్లు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సడన్‌గా గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ప్రయోగాత్మకంగా విద్యార్థులుచేసి చూపించారు. మనిషి ప్రాణాలు ఎలా కాపాడవచ్చో వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పెల్లుబుకుతున్న జలం



కట్టమైసమ్మ గుడిలో భువి నుంచి ఊరుతున్న నీరు

బంజారాహిల్స్: భారీ వర్షాలతో జూబ్లీహిల్స్ రోడ్ నెం 92లోని కట్టమైసమ్మ గుడిలో అమ్మవారి విగ్రహం భూగర్భం నుంచి పెద్ద ఎత్తున జలపారుతున్నది. దీంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఈ ఆలయంలో వర్షాకాలంలో భూగర్భం నుంచి పెద్ద ఎత్తున వస్తుందని భక్తులు, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నల్లాల్లో రంగుమారిన నీరు..

తాగొచ్చు.. బేఫికర్!

రంగుమారి వస్తున్నాయని భయపడొద్దు..



బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌లో నీటిని పరీక్షిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

- రెండు, మూడు రోజులుగా రంగు మారిన నీరు
- ఎలాంటి ఆందోళన అవసరం లేదంటున్న జలమండలి అధికారులు
- బస్తీలు, కాలనీల్లో పంపింగ్ వేళల్లో అధికారుల పరీక్షలు
- నీటిని కాచి వడబోసి తాగాలంటున్న అధికారులు

బంజారాహిల్స్: గడచిన మూడు రోజులుగా వెంకటగిరి, రమమత్‌నగర్, బోరబండ, సోమాజిగూడ, అమీర్‌పేట, పంజగుట్ట, ఖైరతాబాద్, చింతల్‌బస్తీ, శ్రీకృష్ణానగర్, ఎన్బీటీనగర్, నందినగర్, ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల్లో నల్లాల్లో రంగుమారిన నీళ్లు వస్తున్నాయి. దీంతో స్థానికులకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేశారు.

- ఈ నేపథ్యంలో శుక్రవారం జలమండలి డివిజన్-6 జీఎం హరి శంకర్ నీటి సరఫరా జరుగుతున్న బస్తీలు, కాలనీల్లో పర్యటించి ఆ నివాసితుల ముందే పరీక్షా పరికరాలతో నీటిని పరిశీలించి ఎటువంటి ప్రమాదం లేదని అవగాహన కల్పించారు.
- ఇళ్లకు నీరు చేరే క్రమంలో మూడంచెలుగా

భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి నీటి సరఫరాలో రంగు మారిన నీరు రావడం సహజమేనని ఇవి తాగడం వల్ల, వినియోగించడం వల్ల ఎటువంటి ప్రమాదం లేదని జలమండలి అధికారులు బస్తీలు, కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. గడిచిన ఎనిమిది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండగా రిజర్వాయర్లలోకి కొత్త నీరు చేరుతుండటంతో నీళ్లు రంగుమారి వస్తున్నాయి.

నీళ్లు పరీక్షిస్తారని ఆయన వెల్లడించారు రిజర్వాయర్‌లో క్లోరిన్ శాతం 2 పీపీఎం ఉంటే ఇంటికి నీరు చేరేసరికి అది 0.2 నుంచి 1 పీపీఎం ఉంటుందని వెల్లడించారు.

- నీళ్లల్లో క్లోరిన్ ఉందో పరీక్షించి స్థానికులకు చూపించారు. మీరు తాగుతున్నవి సురక్షితమైన నీళ్లేనని వెల్లడించారు.
- ఈ నీళ్లను గృహ అవసరాలకు వినియోగించడంతో పాటు అవసరమైన కాచి వడబోసి తాగాలని పేర్కొన్నారు. ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో వరద వల్ల అధిక నీరు వచ్చి చేరుతున్నదని దీని వల్ల హైదరాబాద్‌కు సరఫరా అయ్యే తాగు నీరు కొంచెం రంగు కలిగి ఉంటుందన్నారు.
- ఈ నీటిని నిరభ్యంతరంగా గృహ అవసరాలకు వాడుకోవచ్చునని ఎలాంటి భయాందోళన అవసరం లేదన్నారు.
- రోజూ తాము లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ నీటి నాణ్యతను పరిశీలిస్తున్నామన్నారు.
- ప్రస్తుతం ఎక్కడా కలుషిత నీటి సరఫరా జరగడం లేదని సరఫరా అవుతున్న నీళ్లన్నీ నాణ్యమైనవేనని ప్రజలకు వివరించారు
- ఎక్కడైనా కలుషిత నీరు సరఫరా అయినట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

2 నుంచి శ్రీనగర్‌కాలనీ టెంపుల్‌లో అతిరుద్రయాగం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో ఎస్ లావణ్య తదితరులు

బంజారాహిల్స్: లోకకళ్యాణార్థం వచ్చే నెల 2 నుంచి 14వ తేదీ వరకు శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ పంచాయతన పూర్వక శతచండీసహిత అతిరుద్రయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి ఎస్. లావణ్య వెల్లడించారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు వెల్లికంటి మురళీధర్ శర్మ, అర్చకులు బ్రహ్మశ్రీ చింతలపల్లి శ్రీనివాసశర్మ, అయ్యప్ప దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మతో కలిసి అతిరుద్ర యాగం కరపత్రాలను కార్యాలయంలో ఆవిష్కరించారు. అధిక శ్రావణమాసంలో ఈ యాగాలు చేస్తే మూడింతల ఫలితాలు లభిస్తాయని వెల్లడించారు. 108 మంది వేద పండితులు టీటీడీ వేద పాఠశాల కోటప్పకొండ ప్రధాన అధ్యాపకులు మూర్తి వెంకటరామశర్మ ఆధ్వర్యంలో ఈ క్రతువు నిర్వహిస్తారని వెల్లడించారు. ఆలయంలో అతి రుద్రయాగం నిర్వహించడం ఇదే మొదటిసారి అని అన్నారు. దాతల సహకారంతో । 1 కోటి ఖర్చుతో ఈ యాగాన్ని అత్యంత ఆడంబరంగా, వైభవంగా నిర్వహించబోతున్నామని అన్నారు. ఈ యాగంలో పాల్గొనడం ద్వారా కోరిన కోర్కెలు నెరవేరుతాయని దేశం సుభిక్షంగా ఉంటుందని సకల ప్రాణకోటిలకు అన్నపానీయాలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం ఆలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. కంచి పరమాచార్యులు చంద్రశేఖరాచార్యుల పాదుకలను కూడా ఇక్కడ ఉంచబోతున్నామన్నారు. వేడుకలను పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజూ మహన్యాసపారాయణ శ్రీరుద్రపారాయణ, శ్రీ చండీ సప్తశతి పారాయణ, శ్రీ పద్మిని చాయోష సమేత సవిత్రు సూర్యనారాయణ నమస్కారాలు శ్రీ మహాగణాధిపతి చతురావృతి తర్పణం, శ్రీ శివపంచాక్షరి జపం, శ్రీ సుబ్రమణ్య జపం, శ్రీ సుదర్శన జపం, శ్రీ రుద్రాభిషేకం, అతిరుద్రాభిషేకాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దేవరకొండబస్తీలో చింతల పర్యటిన



ఆలయం వద్ద పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వెంకటేశ్వరకాలనీ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించేందుకు ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం.5 దేవరకొండ బస్తీ హనుమాన్ టెంపుల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. హనుమాన్ దేవాలయ పరిసరాల్లో పొంగిపొర్లుతున్న వరద నీటి కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జూబ్లీహిల్స్ అధ్యక్షురాలిగా ప్రీతి



నియామకపత్రాన్ని అందుకుంటున్న ప్రీతి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా షేక్‌పేటకు చెందిన ఆత్మకూరి ప్రీతి నియమితుయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని తెలంగాణ మహిళా కాంగ్రెస్ వింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎం. సునీత, సికింద్రాబాద్ డిస్ట్రిక్ట్ మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పి.కవిత శుక్రవారం ఆమెకు అందజేశారు. తనను నమ్మి ఇచ్చిన పదవిని న్యాయం చేకూరిస్తానని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తానని ప్రీతి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ డి. సత్యనారాయణ, నేతలు జ్యోతి, స్వరూప, జయమ్మ, సత్యనారాయణ, రమేష్, ఆత్మకూరి నవీన్, కన్నా, రాజేష్ పాల్గొన్నారు.

'టీ కాలేజ్ డేజ్' ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బొగ్గారపు

బంజారాహిల్స్: ప్రపంచంలోని వివిధ దేశాల్లో విద్యను అభ్యసించేందుకు టీ కాలేజ్ డేజ్ మార్గం చూపిస్తుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 8లో శుక్రవారం ఆయన సంబంధిత కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు ఇక్కడి నుంచి విద్యార్థులు వెళ్ళి ఉన్నత చదువులు చదువుకుంటున్నారని వారి భవిష్యత్ కోసం ఇలాంటి సంస్థలు ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు. ఏ దేశంలోనైనా ఉన్నత విద్యకు అడ్మిషన్ కావాలంటే తమ సంస్థ ద్వారా సాధ్యమవుతుందని చైర్మన్ సంతోష్ గుప్తా అన్నారు. ఇండియాలోనే మొదటి గ్లోబల్ నెట్‌వర్క్‌ను తమ సంస్థ ఆవిష్కరించిందని డైరెక్టర్ సంజయ్ గుప్తా తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 4650కిపైగా కళాశాలలు కలుపుతూ విద్యార్థులకు ఎన్నో అవకాశాలను అందిస్తున్నామన్నారు.

వరద బాధితులపై నిర్లక్ష్యం దారుణం: రోహిణ్‌రెడ్డి



ఆందోళనలో పాల్గొన్న ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు

బంజారాహిల్స్: వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, సోమాజిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికేళ్ల నరేష్, జూబ్లీహిల్స్ అధ్యక్షుడు కాటూరి రమేష్, బంజారాహిల్స్ అధ్యక్షుడు గొల్యాల రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గన్‌పార్కు నుంచి జీహెచ్ఎంసీ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. వర్షాలతో కాలనీల్లోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ రోహిణ్‌రెడ్డి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వరద బాధితులకు రూ. 10 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలోకి వెళ్తేందుకు యత్నించిన నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు.

మహిళను నిర్బంధించి బీభత్సం: ఇద్దరి అరెస్ట్

ఒంటిగా ఉన్న మహిళ ఇంట్లోకి ప్రవేశించి దౌర్జన్యం




పిల్లికళ్ల కురుమూర్తి, పిల్లికళ్ల శేఖర్ (నిందితులు)

ఫిలింనగర్: ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి అక్రమంగా చొరబడడంతో పాటు ఆమెను నిర్బంధించి దాడి చేయడమే కాకుండా ఇంటిని ధ్వంసం చేసి అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలతో ఇద్దరు నిందితులను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్ బస్తీలో నివసించే కవిత అనే మహిళ ఇంట్లోకి అదే బస్తీకి చెందిన పిల్లికళ్ల కురుమూర్తి(38), పిల్లికళ్ల శేఖర్(32) మద్యం మత్తులో ప్రవేశించి దుర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా ఇంట్లోని సామాన్లను ధ్వంసం చేస్తూ వీరంగం సృష్టించారు. కిటీకి అద్దాలతో పాటు టీవీని ధ్వంసం చేశారు. పూల కుండీలు ఎత్తేస్తూ ఇళ్లంతా బీభత్సం సృష్టించడంతో పాటు ఆమెను భయాందోళనకు గురిచేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కవితపై దాడికి దిగారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకున్న బాధితురాలు వారి బారినుంచి తప్పించుకుని ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులపై ఐపీసీ 452, 354(బి), 341, 323, 427 నాన్‌బెయిలబుల్‌సెక్షన్ల కింద కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా వీరిద్దరూ ఇటీవల బోనాల పండగ రోజు కూడా మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. దీంతో పాటు దాడులకు పాల్పడుతూ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. ఆ ఘటన మరువక ముందే మరోమారు వీరిద్దరూ బస్తీలో దౌర్జన్యానికి దిగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వరుస సంఘటనలతో వినాయక్‌నగర్‌లో పెరిగిపోతున్న దౌర్జన్యాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

కుంగిన నివాసం.. తప్పిన ప్రమాదం



కుంగిన నివాసాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: భారీ వర్షాల కారణంగా ఓ ఇల్లు కుంగిపోయింది. ఈ సంఘటన ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్ గాంధీ నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదాన్ని పసిగట్టిన ఇంట్లో వారు భయంతో బయటికి రావడంతో ప్రమాదం తప్పింది. వివరాలివీ... రాజీవ్‌గాంధీ నగర్‌లో నివాసముండే బిషప్ డాక్టర్ శ్యాంబాబుకు తన నివాసంలో కుటుంబ సభ్యుల్తో కలిసి నిద్రిస్తుండగా గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా శబ్దంతో ఇల్లు భూమిలోకి కుంగిపోయింది. దీంతో ఆందోళన చెందిన శ్యాం బాబు తన భార్య పిల్లలతో ఎదురుగా చర్చిలోకి పరుగులు తీశారు. దాదాపు 18 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత ఇల్లు కావడం, ఇంటి వెనుక భాగాన గుంత ఉండటంతో కుంగి పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. బస్తీ నాయకులు శాంతకుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే ఇంత నిర్లక్ష్యమా: కాంగ్రెస్



ఆందోళనలో పాల్గొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు



దర్నాలో పాల్గొన్న రహమత్‌నగర్ డివిజన్ నేతలు...

వెంగళరావునగర్: ప్రజల ప్రాణాల పరిరక్షణలో బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారడం, ప్రజలు భయాందోళనలకు గురికావడాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ముట్టడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని దాదాపు అన్ని డివిజన్లకు చెందిన నేతలు హాజరయ్యారు. ఆందోళనా కార్యక్రమానికి బయలు దేరే సమయంలో నేతలు మాట్లాడుతూ... నగరంలో ఎంతో నష్టం జరిగినా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా స్పందించకపోతే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సురేందర్ యాదవ్, బిట్ల సుశీల్‌కుమార్ (వెంగళరావునగర్), కృష్ణ(ఎర్రగడ్డ), అశోక్ (బోరబండ), లియాఖత్ అలీ(రహమత్‌నగర్) తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో రహమత్‌నగర్ డివిజన్ నాయకులు...

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో జీహెచ్ఎంసీ ధర్నాలో రహమత్‌నగర్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు భవానీశంకర్ నేతృత్వంలో నాయకులు గ్యార నాగరాజు, సుందర్, మాలాకీ, సాయి, సువర్ణ, పూస ఆండాళు, కేశవులు, అరుణ్, సుల్తాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జీటీఎస్ ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

వెంగళరావునగర్: దేవాలయంలో కమిటీ సభ్యులందరూ దైవభక్తితో కూడిన సేవలను అందించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీ ప్రధాన రహదారిలో ఉన్న శ్రీభవానీశంకర అయ్యప్ప ఆంజనేయ స్వామి దేవస్థానం (జీటీఎస్) నూతన కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చైర్మన్ చిన్నరమేష్‌తో పాటు మెంబర్లతో దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయరామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, టీఆర్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌యాదవ్, వేణు, సీనియర్ నాయకులు శ్యాంరావు, ఆంజనేయులు యాదవ్, సురేష్ ముదిరాజ్, పవన్ ముదిరాజ్, పూజారి బాల్‌రాజ్, కృష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం...

జీటీఎస్ ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా చిన్నరమేష్, కమిటీ మెంబర్లుగా సి.హెచ్.శ్రీనివాస్, కిలారు నర్సింహారావు, జి.లక్ష్మి, కె.వెంకటేశ్వర్లు, ఈ.కె.సత్యనారాయణ, పి.శ్రవంతి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా సీనియర్ పూజారి డి.దేవేందర్‌శర్మలను దేవాదాయ శాఖ నియమించింది.

వరద బాధితులకు అండగా ఉంటాం



బాధితులతో మాట్లాడుతున్న చింతల

హిమాయత్‌నగర్: వర్షాల కారణంగా నాలుగు కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా ధ్వంసమైనా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని విఠల్‌వాడీ ప్రాంతంలో కూలిన ఆ ఇళ్లను స్థానిక నేతలతో కలసి పర్యటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ... ఇళ్లు కూలిపోయి సాయం కోసం ఎదురు చూస్తుంటే ఏ ఒక్క అధికారి వారి వైపు చూడకపోవడం సిగ్గుచేటన్నారు. తక్షణం అధికార యంత్రాంగం స్పందించి వారికి కావాల్సిన అన్ని వసతులను ఇవ్వాలని కోరారు. బాధితులకు తాను అండగా నిలుస్తానంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్, నేతలు భార్గవిరెడ్డి, మాధవి, విజయతులసి, కేశబోయిన శ్రీధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: లైఫ్‌స్టైల్ ప్రియుల కోసం ఆకృతి మరోసారి ఎగ్జిబిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజ్‌కృష్ణా హోటల్‌లో శుక్రవారం ఆకృతి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ఆకృతి ఎగ్జిబిషన్ డైరెక్టర్ సశినాథ్ చేతులు మీదుగా ఘనంగా ప్రారంభమైంది. శని, ఆదివారాల్లో కూడా ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

అల్పాహారం పంపిణీ



హిమాయత్‌నగర్: దత్తానగర్, స్ట్రీట్-14 ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక్కడ ఉండే స్థానికులు బయటకు రావాలంటే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో శుక్రవారం ఓబీసీ నాయకులు కేశబోయిన శ్రీధర్ ఆ ప్రాంత ప్రజలకు టిఫిన్‌ను అందజేశారు. మోకాల్లోతు నీళల్లో వెళ్లి ప్రతి ఒక్కరి ఆకలి తీర్చారు.

వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ 14 మందిని శుక్రవారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వీరికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వీరి నుంచి రూ. 12,800 జరిమానాను వసూలు చేశారు.

పీర్లకు దట్టీల సమర్పణ

రహమత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో పీర్లను అన్ని మతాల వారు పవిత్రంగా కొలుస్తారని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గుర్తు చేశారు. బోరబండ భరత్‌నగర్ ఏర్పాటు చేసిన పీర్లను ఆయన గురువారం రాత్రి సందర్శించి దట్టీలను సమర్పించారు. అనంతరం మైనారిటీ నాయకుడు ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కో ఆర్డినేటర్ విజయసింహారెడ్డి, ఇన్‌చార్జ్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్: భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్తు సంభవించకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ సూచించారు. చేపల గల్లీ, వీడియోగల్లీ, చికెన్ గల్లీ, కల్లు కంపౌండ్ గల్లీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ప్రధాన నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు, మట్టిని చూసి ప్రశ్నించారు. ఈఈ రాజ్‌కుమార్, డీఈ రామరాజు, విజయ్ కుమార్, చంద్రశేఖర్, కట్టా లక్ష్మి, పూజారి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



తాడు పట్టి.. వంతెన ఎక్కి..

సిరికొండ: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్ వాగుపై ఏర్పాటు చేసిన చిక్‌మాన్ వంతెన అప్రోచ్ రోడ్డు ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయింది. దీనితో వాగు అవతలి గ్రామాల ప్రజలు తిప్పలు పడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సంతకు వచ్చిన వారంతా.. మహిళలు సైతం ప్రమాదకర పరిస్థితుల్లో తాడు సాయంతో వంతెన ఎక్కి వెళ్లాల్సి వచ్చింది.



రైల్వే బ్రిడ్జ్‌ను రహదారిగా చేసుకుని..

➤ మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన చెందిన బొజ్జ సురేశ్ శుక్రవారం గుండెనొప్పికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు 108కు సమాచారమిచ్చినా.. ఇటీవలి భారీ వర్షాలకు పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అంబులెన్స్ వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో సురేశ్‌ను రైల్వే ట్రాక్ బ్రిడ్జి మీదుగా మోసుకుంటూ గార్లకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



కోట్లతో కట్టినా.. వరద పాలు

➤ మంచిర్యాల పట్టణంలో గోదావరి ఒడ్డున నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రం ఇది. రూ.17.8 కోట్లతో 2018లో నిర్మాణం మొదలుపెట్టగా గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని నిర్మాణ సమయంలోనే వరదలు ముంచెత్తాయి. సేవలు మొదలయ్యాక గత ఏడాది జూలైలో వరద చుట్టుముట్టింది. గర్భిణులు, బాలింతలను రాత్రికి రాత్రే జిల్లా ఆస్పత్రికి తరలించారు. తిరిగి ఈ ఏడాది జనవరిలో సేవలు మొదలయ్యాయి. వరద ముప్పుతో మళ్లీ ఈ నెల 23న 125 మంది గర్భిణులు, బాలింతలను మరో ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం గోదావరి ఉప్పొంగి ఈ కేంద్రంలోకి నీరు చేరింది.

బోరుమోటారు పెట్టబోయి వాగులో గల్లంతు

కరీంనగర్ జిల్లా నవాబుపేటలో ఘటన



గల్లంతైన రాజయ్య

చిగురుమామిడి(హుస్నాబాద్): బోరుబావిలో విద్యుత్ మోటారు పనిచేస్తుందో, లేదోనని చూసేందుకు వెళ్లిన ఓ రైతు వాగులో గల్లంతయ్యాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. నవాబుపేట్‌కు చెందిన ఎడెల్లి రాజయ్యకు గ్రామశివారులోని మోయతుమ్మెద వాగులో బోరుబావి ఉంది. శుక్రవా రం సాయంత్రం బావి మోటారు నీళ్లు పోస్తుందో లేదోనని చూడటానికి వాగులోకి దిగాడు. మోటారు పెట్టే క్రమంలో వాగునీటిలో మునిగి గల్లంతయ్యాడు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు చిగురుమామిడి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. ఇంకా రాజయ్య ఆచూకీ లభించలేదు. వాగు వద్ద పరిస్థితిని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమీక్షిస్తున్నారు.



పోచంపల్లి చెరువు కింద ఉన్న వరి పొలాలను కప్పేసిన గుర్రపుడెక్క



వరద ధాటికి బురదతో నిండిన జైనథ్ మండలం పెండల్వాడలోని పంట చేను

పది లక్షల ఎకరాలు మునక

వానాకాలం పంటలు వరద పాలు.. మరో 4 లక్షల ఎకరాలకు అధిక వర్షాల తాకిడి.. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో వానాకాలం పంటలు వరద ముంపునకు గురయ్యాయి. మొలక దశలో ఉన్న వివిధ పంటలు దెబ్బతిన్నాయి. 10.76లక్షల ఎకరాల్లో నేరుగా నీటి ముంపునకు గురికాగా, మరో 4 లక్షల ఎకరాలు అధిక వర్షాల తాకిడితో మొలక స్థాయిలో ఉన్న పంటలు, వరి నార్లకు నష్టం జరిగింది. ఇలా 16 లక్షలకు పైగా ఎకరాలపై వర్షాల ప్రభావం పడిందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నాట్లు వేసిన నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ,ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో వరి పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ సమీప ప్రాంతాల్లో గత 20 రోజుల క్రితం వేసిన వరి నాట్లు నీటమునిగాయి. సూర్యాపేట జిల్లా కిష్టాపురం, మొగిలాయకోట, శాంతినగర్, లక్కవరం, గోండ్రియాల, కొత్తగూడెం తదితర గ్రామాల్లో కూడా వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. ఖమ్మం జిల్లాలోని జక్కపల్లి, సిద్దెపల్లి, రామచంద్రపురం, పైనంపల్లి, బుద్దారం తదితర గ్రామాల్లో పంటలపై కూడా వరద ప్రభావం పడింది. ఆదిలాబాద్ , ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలతో పాటు భద్రాద్రి జిల్లా చర్ల, వాజేడు, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో పంటలకు తీవ్రంగా నష్టం జరిగింది. గోదావరి నది రెండు వైపులా ఉప్పొంగి కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్ల మేర పంటలను ముంచెత్తుకుంటూ పారింది. అనేక ప్రాంతాల్లో ఒక్క పంట కూడా పనికి వచ్చే పరిస్థితి లేదని క్షేత్రస్థాయి అధికారులు అంటున్నారు.

పత్తిపై అధిక ప్రభావం

ఈ సీజన్లో ఇప్పటివరకు 40.73లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యింది. కాగా వర్షాల ప్రభావం ఎక్కువగా ఈ పంటపైనే పడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్, మంచిర్యా ల, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడింది. తాజాగా వేసిన పత్తి విత్తనాలు వర్షాలకు మొలకెత్త కుండానే భూమిలోనే మురిగిపోయాయి. ఇక మొలక స్థాయిలో ఉన్న పత్తి నీటిలో మునిగి దెబ్బతింది. వరినాట్లు కూడా నీట మునిగాయి. ఇప్పటివరకు 15.63లక్షల ఎకరాల్లో వరినాట్లు పడగా.. వీటిలో 5లక్షలకు పైగా ఎకరాల్లో నీరు చేరిందని అధికా రులు చెబుతున్నారు. వరి నార్లు మొత్తం దెబ్బతిన్నాయని, మళ్లీ నార్లు పోసుకోవాల్సిందేనని రైతు లు అంటున్నారు. ఇక సోయాబీన్ సాగు ఇప్పటివరకు 4.14లక్షల ఎకరాల్లో సాగు చేయగా.. ఆదిలా బాద్ జిల్లాలో ఈ పంటపై ఎక్కువ ప్రభావం పడినట్లు తెలుస్తోంది.

పొలాలను ముంచేసిన గుర్రపుడెక్క

భూదాన్‌పోచంపల్లి: భారీ వర్షాలతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి చెరువు నిండి అలుగుపోస్తోంది. ఈ చెరువులోని గుర్రపు డెక్క కూడా కొట్టుకువచ్చి వరి పొలాలను కమ్మేసింది. దీనితో పోచంపల్లిలో 30ఎకరాలు, పిలాయిపల్లిలో 2ఎకరాల వరికి నష్టం జరిగింది.

రోడ్లు.. వానపాలు

పలు జిల్లాలపై భారీ వర్షాల ప్రభావం.. ఉప్పొంగిన చెరువులు..తెగిన కట్టలు.. ఖమ్మంలో తగ్గిన మున్నేరు ముంపు

సాక్షి నెట్‌వర్క్: భారీ వర్షాలు రాష్ట్రంలోని పలు జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షం భీభత్సం సృష్టించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ నగర్, రామ్‌నగర్ కాలనీలు నీట మునగడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నిర్మల్ జిల్లాలో 30 వేల ఎకరాల్లో పంట నీట మునిగిందని అంచనా వేశారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 24,035 మంది రైతులకు చెందిన 33,429 ఎకరాల్లో వరి, సోయా, మొక్కజొన్న, పసుపు పంటలు దెబ్బతిన్నాయి. 7 మండలాల్లోని 16 చెరువుల కట్టలు తెగిపోయాయి. బోధన్ మండలం సాలూర శివారులోని మంజీర నది పాత వంతెన పైనుంచి ప్రవహించడంతో తెలంగాణ – మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం జిల్లా కేంద్రాన్ని గురువారం అతలాకుతలం చేసిన మున్నేరు వరద శుక్రవారం ఉదయం నుంచి తగ్గుతూ వస్తోంది. గురువారం రాత్రి 10గంటలకు 30 అడుగులుగా ఉన్న నీటి మట్టం శుక్రవారం రాత్రి ఏడు గంటలకు 18.30 అడుగులకు పడిపోయింది. దీంతో పునరావాస కేంద్రాల నుంచి ప్రజలు ఇళ్లకు చేరుకుంటున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మున్నేరును పరిశీలించి సహాయక చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఖమ్మంలో మున్నేటి వరద, ముంపు ప్రాంతాలను సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరిశీలించి బాధితులతో మాట్లాడారు.



పట్టణంలోని హరిఓం నగర్‌లో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మంత్రులు, అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శుక్రవారం రెండోరోజు కూడా సమీక్ష జరిపారు. ముంపు ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. వరదలు తగ్గుముఖం పట్టి బురదమయమైన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో ముంపు ప్రాంతాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు పర్యటిస్తూ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని సీఎంఓ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

కలెక్టర్లూ.. జర జాగ్రత్త

- వరద సహాయక చర్యల్లో ఏమాత్రం అలసత్వం వద్దు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎడతెగని భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఎక్కడికక్కడ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, తక్షణమే శానిటేషన్ పనులను ప్రారంభించాలన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు డీజీపీ అంజనీ కుమార్, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్య దర్శి నవీన్ మిత్తల్, వైద్య,ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, ఆర్థిక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, జలమండలి ఎండీ దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, ఫైర్ సర్వీసుల శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డితో కలిసి ఆమె శుక్రవారం జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు వరద బాధిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, జిల్లా యంత్రాగం మొత్తం చేసిన సమష్టి కృషితో ఆస్తి, ప్రాణ నష్టాన్ని బాగా తగ్గించగలిగారని ఆమె అభినందించారు. మరో 24 గంటల పాటు సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కొనసాగించండి

సహాయ కార్యక్రమాలకు సహకరిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అక్కడే కొనసాగించాలని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు. భద్రాచలం, నిర్మల్‌లో రెండు బృందాలు చొప్పున, కొత్తగూడెం, ములుగు, వరంగల్, ఖమ్మం, భూపాలపల్లి, హైదరాబాద్‌లలో ఒక్కో బృందం చొప్పున పాల్గొంటున్నాయ న్నారు. ఏ సహాయ మైనా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివ రించారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ, కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం సహకారంతో పలు జిల్లాల్లో 19 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. ప్రత్యేక ప్రధానకార్యదర్శి రజత్ కుమార్ మాట్లాడుతూ తెగిన చెరువులు, కుంట లను పునరుద్ధరించే పనులు సాగుతున్నాయన్నారు.

పది రోజుల్లో నాలుగింతల వాన!

- ప్రస్తుత నైరుతి సీజన్‌లో కీలక వర్షపాతం ఇప్పుడే
- రాష్ట్రవ్యాప్తంగా 36.21 సెంటీమీటర్ల సగటు వర్షపాతం
- పదిరోజుల క్రితం 54 శాతం లోటు.. ఇప్పుడు 65 శాతం అధికం
- తొమ్మిది జిల్లాల్లో సగటున 50 సెం.మీ. పైగా వానలు
- ఒక్క నల్లగొండ జిల్లాలో మాత్రమే సాధారణానికి దగ్గరగా వర్షం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా గత పది రోజుల పాటు కురిసిన వానలు వర్షపాతం రికార్డులను తారుమారు చేశాయి. పది రోజుల క్రితం 54% లోటు వర్షపాతం ఉండగా.. ఇప్పుడు ఏకంగా 65 శాతం అధిక వర్షపాతానికి చేరడం గమనార్హం. ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు నైరుతి రుతపవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ఈ నాలుగు నెలల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా సగటున 73.91 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంటుంది. ఇందులో జూలై 28వ తేదీ నాటికి 33.64 సెంటీమీటర్ల సగటు వర్షం కురవాలి. అయితే ఈ ఏడాది ఇదే సమయానికి ఏకంగా 55.75 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అంటే సాధా రణం కంటే 22.11 సెంటీమీటర్లు (65 శాతం) అధికంగా వానలు పడ్డాయి. కేవలం గత పదిరోజుల వర్షపాతాన్నే పరిగణనలోకి తీసుకుంటే.. సాధారణం కంటే ఏకంగా నాలుగింతలు అధికంగా వర్షాలు కురిశాయి.

లోటు నుంచి అధికం వైపు

వాస్తవానికి ఏటా నైరుతి సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభమవుతుంది. ఆ నెల తొలి లేదా రెండో వారంలో రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించి, వానలు మొదలవుతాయి. కానీ ఈసారి జూన్ నాలుగో వారంలో రుతుపవనాలు ప్రవేశించాయి. ఒకట్రెండు రోజులు మోస్తరు వానలు పడ్డాయి. తర్వాత రుత పవనాల కదలికలు మందగించి వర్షాలు జాడ లే కుండాపోయాయి. దీనితో లోటు పెరుగుతూ వచ్చింది. ఈ నెల 18 నాటికి 19.54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంతో పోలిస్తే 54శాతం లోటు. కానీ 18వ తేదీ నుంచి వానలు మొదలయ్యాయి. తర్వాతి పది రోజులకుగాను 8రోజులు వానలు పడ్డాయి. దీనితో వర్షపాతం 54 శాతం లోటు నుంచి ఏకంగా 65 శాతం అధికానికి చేరింది.


అంతటా కుండపోత వానలతో..

గత పది రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కుండపోత వానలు పడ్డాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో అయితే 64.98 సెంటీమీటర్ల అతిభారీ వర్షం రికార్డు సృష్టించింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధికమని వాతావరణ శాఖ ప్రకటించింది కూడా. ఇక తొమ్మిది జిల్లాల్లో అయితే 50 సెంటీమీటర్లపైన సగటు వర్షపాతం నమోదవడం గమనార్హం.

గత పదిరోజుల్లో కురవాల్సిన, కురిసిన వర్షపాతం (సెం.మీ.లలో)

జిల్లా	కురిసిన వాన	కురవాల్సినది
భూపాలపల్లి	67.18	13.64
హనుమకొండ	64.19	8.98
వరంగల్	63.10	11.34
ములుగు	60.14	13.00
కరీంనగర్	51.95	8.42
మహబూబాబాద్	50.97	10.60
నిజామాబాద్	50.77	10.42
నిర్మల్	50.47	11.39
రాజన్న సిరిసిల్ల	50.44	7.89
జగిత్యాల	49.02	10.49
ఆదిలాబాద్	48.94	11.28
జనగామ	43.68	7.86
పెద్దపల్లి	42.32	11.15
కామారెడ్డి	41.85	9.16
భద్రాద్రి కొత్తగూడెం	40.52	12.29
ఆసిఫాబాద్	39.59	12.93
మంచిర్యాల	37.46	13.04
మెదక్	36.76	9.78
ఖమ్మం	32.45	10.06
సిద్దిపేట	31.96	7.81
మల్కాజిగిరి	31.61	5.61
వికారాబాద్	30.12	7.43
యాదాద్రి భువనగిరి	28.00	6.32
సంగారెడ్డి	27.02	8.84
హైదరాబాద్	25.85	7.36
వనపర్తి	24.30	6.33
మహబూబ్‌నగర్	24.25	5.89
నారాయణపేట్	23.42	5.21
రంగారెడ్డి	23.10	6.05
సూర్యాపేట	21.94	8.09
గద్వాల	19.56	5.03
నాగర్‌కర్నూల్	16.30	5.35
నల్లగొండ	8.01	5.78

ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా.. ఏం చర్యలు తీసుకున్నారు?



- వరదలపై వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు?
- సోమవారం దీనిపై సమగ్ర నివేదిక అందజేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 'రాష్ట్రంలో వరద కారణంగా ఇంతవరకు ఎంతమంది చనిపోయారు? డిజాస్టర్ చట్టం ప్రకారం ఎంతమందిని రక్షించారు? గోదావరి తీర ప్రాంత గ్రామాల రక్షణకు ఏం చర్యలు చేపట్టారు? బాధితులకు కనీస సౌకర్యాలు అందిస్తున్నారా? వరదలపై వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు? ఎన్నికలప్పుడు ఏర్పాటు చేస్తారు కానీ.. వరదలు లాంటి అత్యవసర సమయంలో ఏర్పాటు చేయరా?..'అని ప్రశ్నించింది. పూర్తి వివరాలతో ఓ నివేదికను సోమవారం అందజేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొద్ది రోజులుగా వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో వెల్లడించడం లేదని, రక్షణ చర్యలు తీసుకునేలా రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం ఏం చెప్పడం లేదు..

'వర్షాలు, వరదలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం హెచ్చరించింది. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రంలో వరదల కారణంగా 19 మంది మృతి చెందారని పత్రికల్లో వస్తున్న వార్తలు తెలియజేస్తున్నాయి. వరదలు ఇంకా కొనసాగే అవకాశం ఉందని కేంద్రం మరోసారి తెలియజేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వరదల నుంచి ప్రజలను రక్షించడానికి ఏం చర్యలు తీసుకున్నారు? ఎంత మంది మరణించారు? లాంటి వివరాలను వెల్లడించడం లేదు. కడెం ప్రాజెక్టు వద్ద తీవ్ర భయానక పరిస్థితి కొనసాగుతోంది. ప్రాజెక్టు తెగితే వందల గ్రామాలు నీట మునగడంతో పాటు లక్షల మంది నిరాశ్రయులుగా మారే అవకాశం ఉంది..'అంటూ న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, పల్లె ప్రదీప్‌కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో 'వరద బాధితులకు తక్షణమే కనీస సౌకర్యాలు అందేలా ఏర్పాట్లు చేయాలి. కడెం ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని భద్రతా చట్ట ప్రకారం చర్యలు చేపట్టి వెంటనే రక్షించాలి. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా చూడాలి..'అని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

ముందస్తుగా 'మద్యం లాటరీలు'?

వచ్చే నెలలోనే జారీచేసేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు.. నవంబర్ 30తో ముగియనున్న మద్యం లైసెన్సులు



సాక్షి, హైదరాబాద్: ఎప్పుడో నవంబర్‌లో జరగాల్సిన వైన్‌షాపుల లాటరీ ప్రక్రియ వచ్చే నెలలోనే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అక్టోబర్‌లోనే వస్తుందన్న అంచనాల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఈ మేరకు కసరత్తు చేస్తోంది. 2021–23 సంవత్సరాల ఏ4 (వైన్స్) షాపుల లైసెన్సు కాలం ముగియక ముందే 2023–25 సంవత్సరాలకు లైసెన్సులిచ్చే నోటిఫికేషన్ జారీ చేసేందుకు ముమ్మరంగా ముందుకెళ్తోంది. వచ్చే నెలలో ఎప్పుడైనా నోటిఫికేషన్ ఇచ్చి సెప్టెంబర్ ప్రారంభం కల్లా ప్రక్రియను పూర్తి చేసేలా కొత్త పాలసీ రూపకల్పనలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

ముందుగానే ఎందుకు?: వాస్తవానికి, 2021–23 (రెండేళ్ల పాలసీ) సంవత్సరాలకుగాను ఏ4 లైసెన్సుల గడువు వచ్చే నవంబర్ 30తో ముగియనుంది. అంటే డిసెంబర్ 1 నుంచి కొత్త లైసెన్స్‌దారులు రాష్ట్రంలో మద్యం విక్రయాలు జరపాల్సి ఉంటుంది. అలా జరగాలంటే అక్టోబర్ రెండో వారం తర్వాత ఎప్పుడైనా నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. రానున్న రెండేళ్లకు (2023–25) లైసెన్సులను లాటరీ పద్ధతిలో జారీ చేసేందుకు కొత్త పాలసీ రూపొందించాల్సి ఉంటుంది. అయితే, వచ్చే డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదలై ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశముంది. దీంతో ఎన్నికల నియమావళి వచ్చేలోపే నోటిఫికేషన్ ఇచ్చి లాటరీలు ముగించి కొత్త లైసెన్స్‌దారులకు షాపులు కేటాయించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే డిసెంబర్ 1 నుంచి మాత్రమే వారికి షాపులు అప్పగించాలని, ఈలోగా పాత లైసెన్స్‌ల ద్వారా మద్యం విక్రయాలు జరపవచ్చని అంటున్నారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన మద్యం టెండర్లకు ముహూర్తం ఖరారు చేసే పనిలో పడ్డారు.

అడిగితే ఇవ్వరా?: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ముందస్తు ఎక్సైజ్ టెండర్లకు వెళ్లడం చర్చనీయాంశమవుతోంది. గతంలో జూలై 1 నాటికి లైసెన్సులు ముగిసేవి. కానీ, 2014లో మూడుసార్లు గడువు పెంచడంతో ఇప్పుడు డిసెంబర్ 1 నుంచి కొత్త షాపులు ప్రారంభమవుతున్నాయి. ఇప్పుడు ఎక్సైజ్ శాఖ ఈసారి గడువు పెంచకుండా ముందస్తుగా లాటరీల ప్రక్రియ ప్రారంభించాలని భావిస్తుండటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఎన్నికల కోడ్ అడ్డంకి అయితే, ఆ సమయంలో ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని ప్రక్రియ ప్రారంభించి లైసెన్స్‌లను ఖరారు చేసి పెట్టుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కోడ్ అయ్యాక కొత్త లైసెన్స్‌దారులకు షాపులు అప్పగించవచ్చనే వాదనా ఉంది. అయితే, అప్పటివరకు ఎంతకాలం అవసరమైతే అంతకాలం పాటు గడువు పొడిగించి పాత లైసెన్స్‌దారుల దగ్గరే ఫీజు వసూలు చేసి విక్రయాలు జరపవచ్చనే అభిప్రాయమూ ఉంది. మరోవైపు, వైన్‌షాపుల్లో కొన్ని సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. మళ్లీ ఇప్పుడు ముందస్తు ప్రక్రియపై ఎవరైనా కోర్టుకు వెళితే అసలుకే ఎసరు వస్తుందనే చర్చ ఎక్సైజ్ వర్గాల్లోనే జరుగుతుండటం గమనార్హం.

ఆదాయం కోసమేనా?: మందుషాపులకు ముందస్తు లాటరీలు ఆదాయం కోసమేనా అనే చర్చ జరుగుతోంది. రెండేళ్లకు లైసెన్సు ఫీజు జారీ చేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తుల అమ్మకాల మీదనే ప్రభుత్వానికి రూ. 1,400 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ పాలసీ నిబంధనల ప్రకారం లాటరీ ప్రక్రియ పూర్తయి షాపు కేటాయించాలంటే మొదటి విడత లైసెన్సు ఫీజు కట్టాల్సి ఉంటుంది. ఇలా లైసెన్స్ ఫీజు కింద మరో రూ.500–600 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఎన్నికలకు ముందు ఈ రూ.2 వేల కోట్ల కోసమే ఎక్సైజ్ శాఖ హడావుడి చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

అవిశ్వాసం సరికాదు

మణిపూర్ అంశంపై విజయసాయిరెడ్డి.. 'జాతీయ మీడియా' చర్చలో వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ :ఈశాన్య ప్రాంత చిన్న రాష్ట్రమైన, దేశ సరిహద్దులో ఉన్న మణిపూర్ లోని వివాదాస్పద అంశంపై విపక్షాలు కేంద్రానికి మద్దతుగా కలిసి రావాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. సరిహద్దు దేశాల కుట్రల దృష్ట్యా ఈ విషయంలో అందరూ సమష్టిగా ఉండాల్సిన అవసరం ఉందని, కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని తిప్పి కొట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాత్రి ఓ జాతీయ మీడియా చర్చలో ఢిల్లీ ఆర్డినెన్స్, విపక్షాలు కేంద్రంపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఆయన మాట్లాడారు. ఢిల్లీ ఆర్డినెన్స్‌కు సంబంధించి విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ పూర్తిస్థాయి రాష్ట్రం కాదన్న విషయం గుర్తు చేశా రు. కేంద్రం తీసుకొచ్చిన ఢిల్లీ ఆర్డినెన్స్ సమాఖ్య స్ఫూర్తిని ఏమాత్రం దెబ్బతీయట్లేదని స్పష్టం చేశారు. ఢిల్లీ ఆర్డినెన్స్ సుప్రీం కోర్టు తీర్పును ఏమాత్రం ఉల్లంఘించడం లేదన్నారు. అందువల్లే ఈ రెండు అంశాలపై వైఎస్సార్‌సీపీ కేంద్రానికి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు.

ఈడీపై కవిత పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మహిళలను ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి పిలవడంపై అభ్యంతరం తెలుపుతూ తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, కేంద్ర ఆర్థికశాఖ మాజీమంత్రి చిదంబరం భార్య నళిని చిదంబరం, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను శుక్రవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ నిమిత్తం ఎవరినైనా ఈడీ ఢిల్లీకి పిలవవచ్చా అనే అంశాన్ని తేల్చాలని కవిత తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కోరారు. అయితే వారం, పదిరోజుల ముందుగానే నోటీసులు ఇచ్చి పిలుస్తామని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. వీటిల్లో మనీలాండరింగ్ కేసులు ఉన్నాయన్నారు. దీంతో మెరిట్స్ ఆధారంగా ఆయా పిటిషన్లు పరిష్కరిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్లపై ఈడీ 6 వారాల్లో కౌంటర్లు, 2 వారాల్లో రిజాయిండర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

చీటింగ్ 'మార్గ'ం మూత!

ఉషాకిరణ్, ఉషోదయలో మార్గదర్శి వాటాలు అటాచ్

మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ కీలక నిర్ణయం

- చందాదారుల సొమ్ముతో అనుబంధ సంస్థల్లో అక్రమ పెట్టుబడులు
- ఉషాకిరణ్‌లో 88.50 శాతం.. ఉషోదయలో 44.55 శాతం
- ఆ వాటాల అటాచ్‌కు సీఐడీకి హోంశాఖ అనుమతి.. చందాదారులకు తెలియకుండా వారి పేరిట పిటిషన్లు దాఖలు
- న్యాయస్థానాన్నే మోసగించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్.. చట్టపరమైన చర్యలకు సీఐడీ సమాయత్తం



అతిపెద్ద కార్పొరేట్ మోసం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ మోసానికి పాల్పడిందని సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. మార్కెట్‌లో పేరుందని చెప్పుకున్నప్పటికీ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే దర్యాప్తు సంస్థలు కఠినచర్యలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. గతంలో విద్యుత్ కుంభకోణంలో ఎన్‌రాన్ కంపెనీపై కేసు నమోదు చేసి కఠినచర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో సీఐడీ మరో కీలక చర్య తీసుకుంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజా కిరణ్ కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల డబ్బులను మళ్లించి అనుబంధ సంస్థల్లో పెట్టిన పెట్టుబడులపై కొరడా ఝళిపించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను అటాచ్ చేయాలని నిర్ణయించింది. రామోజీరావు వ్యాపారంలో ఇవే ప్రధాన విభాగాలు కావడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలకు సంబంధించి నమోదు చేసిన ఏడు కేసుల్లో రెండింటిలో సీఐడీ న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. సీఐడీ ఐజీ సీహెచ్. శ్రీకాంత్‌తో కలసి శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట రామోజీరావు, శైలజా కిరణ్ అతిపెద్ద కార్పొరేట్ మోసానికి పాల్పడ్డారని చెప్పారు. త్వరలోనే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మ్యూచువల్ ఫండ్స్, ఇతర సంస్థల్లో పెట్టుబడులు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మళ్లించి పెట్టిన పెట్టుబడులను సీఐడీ అటాచ్ చేస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ వివిధ మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఆర్థిక సంస్థల్లో పెట్టిన పెట్టుబడులు రూ.1,035 కోట్లను అటాచ్ చేసేందుకు ప్రభుత్వం సీఐడీని అనుమతినిస్తూ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఉషాకిరణ్ మీడియా లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లో వాటాలను అటాచ్ చేసేందుకు హోంశాఖ అనుమతినిచ్చింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్న 88.50% వాటాతోపాటు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లో 44.55% వాటా అటాచ్ కానుంది. ఆ సంస్థల్లో ప్రధాన వాటాలను సీఐడీ అటాచ్ చేయనుంది. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని సీఐడీ కోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. న్యాయస్థానం అనుమతితో వాటిని అటాచ్ చేయనుంది.

రెండు కేసుల్లో చార్జ్‌షీట్లు దాఖలు

చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించిన మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై సీఐడీ ఏడు కేసులు నమోదు చేసింది. వాటిలో రెండు కేసుల్లో న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. ఏ–1 చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజా కిరణ్, ఏ–3 మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు (ఫోర్‌మెన్)తోపాటు మొత్తం 15 మందిపై క్రిమినల్ కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం, విశ్వాస ఘాతుకానికి పాల్పడటం, రికార్డులను తారుమారు చేయడం తదితర నేరాలతోపాటు ఏపీ డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఏడు కేసుల్లో రెండింటిలో చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. మిగిలిన కేసుల్లో కూడా త్వరలోనే చార్జ్‌షీట్లు దాఖలు చేయడంతోపాటు చట్టపరంగా తదుపరి చర్యలు చేపడతామని సీఐడీ ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. సీఐడీ విచారణకు గైర్హాజరై రామోజీరావు, శైలజా కిరణ్ దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. ఈ అంశంతోపాటు చార్జ్‌షీట్ దాఖలు తరువాత చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తున్నామని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

చందాదారులకు తెలియకుండా.. న్యాయస్థానం కళ్లుగప్పి

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు చెందిన 23 చిట్టీ గ్రూపుల మూసివేతకు సంబంధించి రాష్ట్ర చిట్ రిజిస్ట్రార్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేయడం వెనుక లోగుట్టు బయటపడింది. న్యాయస్థానంలో పిటిషన్లు వేసిన కొందరు చందాదారులకు అసలు తమ పేరుతో అవి దాఖలైన విషయమే తెలియదని వెల్లడైంది. కొన్ని పత్రాలపై చందాదారుల సంతకాలు తీసుకుని ఇతరులే పిటిషన్లు దాఖలు చేసిన విషయం తమ దృష్టికి వచ్చినట్లు అమిత్ బర్దర్ తెలిపారు. తమ పేరిట పిటిషన్లు దాఖలైన విషయమే తెలియదని పలువురు వెల్లడించినట్లు చెప్పారు. అది న్యాయస్థానాన్ని మోసం చేయడం కిందకే వస్తుందని స్పష్టం చేశారు. దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పత్రాలు అందచేసి సంతకాలు చేయాలని కోరితే మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు క్షుణ్నంగా చదవాలన్నారు. పూర్తిగా చదవకుండా సంతకాలు చేయవద్దని సూచించారు.

మూతపడ్డ 'మార్గదర్శి' వెబ్‌సైట్

ఆర్థిక అక్రమాలకు పాల్పడి పీకల్లోతు కూరుకుపోయిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా తమ వెబ్‌సైట్‌ను మూసివేసింది. ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థల్లో వాటాల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వం అనుమతించినట్లు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దన్ వెల్లడించిన కాసేపటికే మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ వెబ్‌సైట్‌ను మూసివేసింది. మార్గదర్శి డాట్‌కామ్ పేరుతో నిర్వహిస్తున్న వెబ్‌సైట్ శుక్రవారం సాయంత్రం నుంచి ఓపెన్ కావడం లేదు. వెబ్‌సైట్‌పై క్లిక్ చేయగా 'నిర్వహణ పరమైన అంశాలతో వెబ్‌సైట్ అందుబాటులో లేదు. త్వరలోనే పునరుద్ధరిస్తాం' అనే సందేశం కనిపిస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అధికారిక సమాచారం అందులోనే ఉంటుంది. హఠాత్తుగా వెబ్‌సైట్ పనిచేయకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడుల వివరాలను గోప్యంగా ఉంచేందుకే వెబ్‌సైట్‌ను మూసివేసినట్లు భావిస్తున్నారు.

ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. అంతకుముందు జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సీజేగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. అనంతరం జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేశారు. జస్టిస్ ఠాకూర్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. అనంతరం అందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు.

నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు

- వివేకా హత్యకేసుపై చార్జిషీట్‌లో సీబీఐ పూర్తిగా అవాస్తవాలను పేర్కొంది
- చార్జిషీట్ నుంచి నా వాంగ్మూలాన్ని తొలగించేలా ఆదేశాలివ్వండి
- తెలంగాణ హైకోర్టులో ఏపీ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజయ్ కల్లం పిటిషన్



సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో భాగంగా కేంద్ర దర్యాప్తు సంస్థ.. హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం తెలంగాణ హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. చార్జిషీట్ నుంచి తన వాంగ్మూలం తొలగించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీబీఐ తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేయడం చట్టవిరుద్ధమని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని, వివేకా కేసు విచారణాధికారి (ఏఎస్పీ)ని ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌లో ఆయన పేర్కొన్న వివరాలు.. 'ఏప్రిల్ 29న నేను వాంగ్మూలం ఇస్తుండగా.. అధికారి మరొకరిని లోపలికి పిలిచారు. ఆయన లాప్‌టాప్‌తో వచ్చి ఏదో రికార్డు చేసుకున్నాడు. ఆయన ఏం రికార్డు చేసింది నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. నాకు తెలిసినంతవరకు నా వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో రికార్డు కూడా చేయలేదు. సీబీఐ నా స్టేట్‌మెంట్‌ను తప్పుడు రికార్డు చేసినట్లు మే 17న ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ద్వారా తెలుసుకున్నా. నా వాంగ్మూలం గురించి నేను ఎవరి వద్దా ప్రస్తావించలేదు. కానీ, ఆ పత్రికలో ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ పత్రికలో పేర్కొన్నదంతా అసత్యపూరితం. పత్రికలో వచ్చిన దానిపై ఎలక్ట్రానిక్ మీడియా చర్చా కార్యక్రమాలు పెట్టడంతో నేను విలేకరుల సమావేశం పెట్టి.. ఆ పత్రికది కట్టు కథ అని చెప్పాల్సి వచ్చింది. సీబీఐ నమోదు చేసింది కూడా నేను చెప్పింది కాదని తెలిసింది. అయితే సీఆర్‌పీసీ 161 కింద రికార్డు చేసిన కాపీ నావద్ద లేనందున నా వాంగ్మూలం తప్పుగా పేర్కొన్న విషయాన్ని తెలుసుకోలేకపోయా. 2019 మార్చి 15న ఉదయం 5.30 గంటల సమయంలో అటెండరు వచ్చి అమ్మ (భారతి) పిలుస్తున్నారంటూ జగన్‌కు చెప్పాడని తాను చెప్పినట్లు, బయటకు వెళ్లిన జగన్ పది నిమిషాల తరువాత తిరిగివచ్చి చిన్నాన్న ఈజ్ నో మోర్ అని అన్నారని, షాక్‌కు గురైన మేము కడపకు వెళ్లాలని ఆయనకు సూచించి బయటకు వచ్చేశామని జూన్ నెలలో వేసిన చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఈ విషయం పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా నాకు తెలిసింది. ఏప్రిల్ 29న నన్ను విచారించిన అధికారికి స్పష్టంగా ఏం చెప్పానంటే.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో తయారీ సమావేశం 2019 మార్చి 15న ఉదయం సుమారు 5 గంటలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లో ప్రారంభమైంది. అరగంట తర్వాత ఒక అటెండర్ సమావేశగది తలుపు తట్టాడు. బయటికి వెళ్లి విషయం తెలుసుకుని వచ్చిన ఓఎస్డీ.. జగన్ చెవిలో ఏదో చెప్పారు. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి, ఆశ్చర్యానికి గురయ్యారు. 'చిన్నాన్న చనిపోయారు'అని చెప్పారు. అంతేతప్ప జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన జీవిత భాగస్వామిని పిలవడం లాంటివి ఏమీ చెప్పలేదు. దురదృష్టవశాత్తు నేను చెప్పింది సీబీఐ సరిగ్గా రికార్డు చేయలేదు. చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది పూర్తిగా అసంబద్ధం. దర్యాప్తును తప్పుదారి పట్టించి.. ఇతరులను కేసులో ఇరికించే ధోరణితోనే సీబీఐ ఇలా తప్పుగా పేర్కొంది. నా స్టేట్‌మెంట్‌పై సంతకం చేసిన అధికారి, నన్ను విచారించిన అధికారి ఒకరు కాదు. దర్యాప్తు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాజ్యాంగ ధర్మాసనాలు పదేపదే చెబుతున్నా.. కొందరు మాత్రం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దర్యాప్తు చేయడం అంటే అస్పష్టమైన సత్యాన్ని బయటికి తీసుకురావడం. కానీ, ఇక్కడ అధికారులు అలా వ్యవహరించలేదు. నేను చెప్పకున్నా చెప్పినట్లు సీబీఐ తప్పుడు వాంగ్మూలాన్ని సమర్పించడం ఎంతమాత్రం సరికాదు. ఇతర వ్యక్తులను చిక్కుల్లో పడేసేందుకే సీబీఐ తప్పుడు సమాచారం చేర్చింది. ఈ అంశాలను పరిశీలించి హైదరాబాద్ సీబీఐ కోర్టులో సమర్పించిన చార్జిషీట్ నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించాలి..'అని ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

సాక్షి రియల్టీ

గిడ్డంగులు 51 లక్షల చ.అ.

- మేడ్చల్ క్లస్టర్‌లో వేర్‌హౌస్‌లకు డిమాండ్
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి




సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో గిడ్డంగుల స్థలాలకు డిమాండ్ పెరుగుతుంది. 2023 ఆర్థిక సంవత్సరంలో నగరంలో 51 లక్షల చ.అ. వేర్‌హౌస్ స్పేస్ లావాదేవీలు జరిగాయి. అయితే 2022 ఆర్థిక సంవత్సరంలోని 54 లక్షల చ.అ. లావాదేవీలతో పోలిస్తే ఇది 7 శాతం తక్కువని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ (3 పీఎల్), ఈ–కామర్స్ సంస్థల లావాదేవీలలో తాత్కాలిక మందగమనమే ఈ క్షీణతకు ప్రధాన కారణమని పేర్కొంది. ఆన్‌లైన్ షాపింగ్‌కు పెరుగుతున్న ఆదరణ, లాస్ట్‌మైల్ డెలివరీ ఆవశ్యకత నేపథ్యంలో గిడ్డంగుల విభాగానికి దీర్ఘకాలిక డిమాండ్ ఉంటుందని తెలిపింది.

- వేర్‌హౌస్ లావాదేవీలలో తయారీ రంగం హవా కొనసాగుతుంది. 2023 ఫైనాన్షియల్ ఇయర్‌లో జరిగిన గిడ్డంగుల లీజుల మాన్యుఫాక్చరింగ్ విభాగం వాటా 39 శాతం కాగా.. 3 పీఎల్ 21 శాతం, ఈ–కామర్స్ 17 శాతం, రిటైల్ రంగం 14 శాతం, ఎఫ్ఎంసీజీ 5 శాతం, ఎఫ్ఎంసీడీ 1 శాతం వాటాలను కలిగి ఉన్నాయి.
- మేడ్చల్ క్లస్టర్‌లో వేర్‌హౌస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2022 ఆర్థిక సంవత్సరంలోని గిడ్డంగుల లావాదేవీలలో ఈ క్లస్టర్ వాటా 60 శాతం ఉండగా.. 2023 నాటికి 61 శాతానికి పెరిగింది. శంషాబాద్ క్లస్టర్‌లో క్షీణత, పటాన్‌చెరు క్లస్టర్లలో స్వల్ప వృద్ధి కనిపించింది. ఏడాది సమయంలో శంషాబాద్ వాటా 30 శాతం నుంచి 27 శాతానికి తగ్గగా.. పటాన్‌చెరు క్లస్టర్ వాటా 10 శాతం నుంచి 11 శాతానికి పెరిగింది.

నగరంలోని ప్రధాన గిడ్డంగుల క్లస్టర్లు ఇవే

మేడ్చల్ క్లస్టర్‌లో మేడ్చల్, దేవరయాంజాల్–గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, యెల్లంపేట్, షామీర్‌పేట్, పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియా, రుద్రారం, పాశమైలారం, ఎదులనాగులపల్లి, సుల్తాన్‌పూర్, ఏరోట్రోపోలిస్, శ్రీశైలం హైవే, బొంగ్లూరు, కొత్తూరు, షాద్‌నగర్. ఆయా ప్రాంతాలలో గ్రేడ్–ఏ గిడ్డంగుల అద్దె చ.అ.కు రూ.19–21గా, గ్రేడ్–బీ అయితే రూ.16–19గా ఉంది.

- హైదరాబాద్ అనేక రంగాలు ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీమ్ కింద అనుమతులు పొందాయి. ప్రధానంగా సెల్‌ఫోన్ల తయారీ, ఆటో అనుబంధ రంగానికి చెందిన సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవటంతో గిడ్డంగుల స్థలాలకు డిమాండ్ ఏర్పడిందని నైట్‌ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ అన్నారు.
- ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 1.39 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లా వాదేవీలు జరిగాయి. ఇందులో దక్షిణాది నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో 59 శాతం వాటాతో 82 లక్షల చ.అ. లీజులు జరిగాయి.



గృహ రుణ వడ్డీ రేట్లు గ్రీన్‌గా..

- హరిత భవనాల లోన్లకు 5 బేసిస్ పాయింట్లు తగ్గింపు
- ఐజీబీసీ ప్రాజెక్ట్‌లలో కొనుగోలుదారులకు వర్తింపు
- గ్రీన్ ప్రాపర్టీ షోలో ఎస్‌బీఐ హైదరాబాద్ జీఎం రాజేష్ కుమార్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: హరిత భవనాలను ప్రోత్సహించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒకడుగు ముందుకేసింది. సాధారణ గృహ రుణ గ్రహీతలతో పోలిస్తే హరిత గృహ కొనుగోలుదారులు 5 బేసిస్ పాయింట్ల తక్కువ వడ్డీ రేట్లకు గృహ రుణాలను అందుకోవచ్చని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ జీఎం, బ్రాంచ్ హెడ్ రాజేష్ కుమార్ తెలిపారు. అంటే ప్రస్తుతం ఎస్‌బీఐ గృహ రుణ వడ్డీ రేటు 8.50 శాతంగా ఉండగా.. హరిత గృహ రుణాలకు వడ్డీ రేటు 0.05 శాతం తక్కువగా ఉంటుందన్నమాట. అంటే వడ్డీ రేటు 8.45 శాతంగా పడుతుంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) గ్రీన్ ప్రాపర్టీ షోను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 527 ప్రాజెక్ట్ డెవలపర్లతో ఎస్‌బీఐ గృహ రుణ ఒప్పందం చేసుకుందని.. ఇందులో 75 ప్రాజెక్ట్‌లు ఐజీబీసీ ధ్రువీకరణ పొందిన ప్రాజెక్ట్‌లేనని తెలిపారు. అపర్ణా, రాజపుష్ప, మైహోం, గిరిధారి, వాసవి, పోలోమి, ప్రణవ వంటి నిర్మాణ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ పోర్ట్‌ఫోలియో రూ.6.5 లక్షల కోట్లుగా ఉండగా... ఇందులో హైదరాబాద్ వాటా రూ.55 వేల కోట్లని చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున రూ.12 వేల కోట్ల గృహ రుణాలు అందించామని.. ప్రస్తుతం నెలకు రూ.1,500 కోట్ల రుణాల చొప్పున రూ.16–18 వేల కోట్ల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.



వానల్లో... మీ పిల్లలు జర భద్రం





మొన్నటిదాకా మండించిన ఎండలు ఇప్పుడు చల్లటి వర్షాలను తీసుకువచ్చాయి. వర్షాకాలం అంటే ఇష్టం లేనిదెవరికి? ముఖ్యంగా పిల్లలకు మరీ ఇష్టం. ఎందుకంటే కాస్త గట్టి వానలు పడితే సెలవలు వస్తాయి. ప్రస్తుతం తెలంగాణ అంతా భారీ వర్షాల కారణంగా అన్ని విద్యాసంస్థలకు సెలవలు ప్రకటించింది ప్రభుత్వం. ఆంధ్రాలో కూడా కొన్ని ప్రాంతాలలో వానాకాలం సెలవలే. సెలవల వరకు బాగానే ఉంది కానీ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవలసిన పెద్దలకు మాత్రం కాస్త కష్టమే. ఆ మాటకొస్తే అంటువ్యాధులు ప్రబలే ఈ కాలంలో పెద్దవాళ్లు కూడా జాగ్రత్తగా ఉండాల్సిందే. ఆ జాగ్రత్తలేమిటో చూద్దాం...

వానరాకడా... మరొకటీ తెలియదని సామెత. ఒక్కోసారి మబ్బులు పట్టిన ఆకాశం ఉరుముతూ వర్షాలకు సిద్ధంగా ఉండమని హెచ్చరిస్తుంది. ఒకోసారి ఏవిధమైన హెచ్చరికలూ చేయకుండానే వర్షం వచ్చి మీదపడుతుంది. అందువల్ల వాతావరణ హెచ్చరికల గురించి తెలుసుకోవడం మంచిది.

తగిన దుస్తులు: వర్షాకాలంలో పిల్లలే కాదు, ఎవరైనా సరే, తేలికగా ఆరిపోయే దుస్తులు ధరించడం మంచిది. తేలికపాటి దుస్తులను పిల్లలకు ధరింపజేయాలి. అసౌకర్యం, చికాకు కలిగించే దుస్తులను ఈ కాలంలో వారికి తొడగకపోవడం చాలా మంచిది.

పాదరక్షల ఎంపిక: వర్షాకాలంలో మీ పిల్లలకు తగిన పాదరక్షలను ఎంచుకోండి. తడి ఉపరితలాలపై జారకుండా నిరోధించడానికి మంచి ట్రాక్షన్‌తో ఉండే వాటర్‌ప్రూఫ్ బూట్లు లేదా చెప్పులను ఎంచుకోండి.

దోమల నుంచి రక్షణ: వర్షాకాలంలో దోమల వల్ల వచ్చే వ్యాధులు ఎక్కువగా ఉంటాయి. దోమల నిరోధకాలను లేదా దోమతెరలను ఉపయోగించడంతోపాటు ఇంటి చుట్టూ దోమలకు సంతానోత్పత్తి కేంద్రాలుగా మారే నీటి వనరులు ఉండకుండా చూసుకోవడం మంచిది.

పరిశుభ్రత పద్ధతులు: పిల్లలకు మంచి పరిశుభ్రత అలవాట్లను నేర్పాలి. క్రమం తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడాన్ని నొక్కి చెప్పండి, భోజనానికి ముందు, టాయిలెట్ తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం అంటువ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో సహాయపడుతుంది.

నీళ్లు నిలవకుండా చూసుకోవాలి

ఇంటి ఆవరణలో నిలిచిన నీరు, నీటి కుంటలు లేదా మురికి గుంటలు ఉన్న ప్రదేశాలలో ఆడుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి పిల్లలకు అవగాహన కల్పించండి. అటువంటి నీటిలో వ్యాధులకు కారణమయ్యే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లు ఉంటాయి కాబట్టి నిల్వ ఉన్న నీటిలో ఆడకుండా చూడండి.

ఆహార భద్రత: వర్షాకాలంలో ఆహార పరిశుభ్రతపై అదనపు శ్రద్ధ అవసరం. స్ట్రీట్ ఫుడ్ లేదా అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలలో నిల్వ ఉండే ఆహారం తీసుకోకుండా చూడాలి. పండ్లు, క్యారట్, బీట్‌రూట్ వంటి పచ్చి కూరగాయలను తినేముందు శుభ్రంగా కడుక్కోవడం తప్పనిసరి చేయడం అవసరం.

తగినంత వెంటిలేషన్: భారీ వర్షాల సమయంలో కిటికీలు మూసి ఉంచడం చాలా కీలకమైనప్పటికీ, మీ ఇంటిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవడం తేమ పెరగకుండా నిరోధించడానికి, ఆరోగ్యకరమైన ఇండోర్ వాతావరణాన్ని నిర్వహించడానికి సహాయపడుతుంది.

అలర్జీలు, ఆస్తమా నిర్వహణ: మీ పిల్లలకు అలర్జీలు లేదా ఆస్తమా ఉన్నట్లయితే, వర్షాకాలం వారి ఇబ్బందులను మరింత తీవ్రతరం చేస్తుంది. ఇలాంటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో ముందుగానే మీ ఫ్యామిలీ డాక్టర్‌ను అడిగి తెలుసుకోవడం, అవసరమైతే తగిన మందులను సిద్ధం చేసుకోవడం మంచిది.

పరిశుభ్రమైన నీరు: కాచి చల్లార్చిన నీటిని తాగడం పిల్లలకే కాదు, పెద్దలకూ మంచిదే.

రింగ్‌వార్మ్: ఈ ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ఎరుపు, రింగ్-ఆకారపు దద్దురును కలిగిస్తుంది. దురద లేదా పొలుసులుగా ఉంటుంది. ఇది శరీరంలోని ఏ భాగానికైనా రావచ్చు, తలమీద, గజ్జల్లో , పాదాలపై సర్వసాధారణంగా ఉంటుంది. దీని బారినుంచి పిల్లలను రక్షించుకోవాలి.

ఈ కాలంలో రోజువారీ తీసుకోవలసిన సూపర్‌ఫుడ్

మారుతున్న సీజన్‌తో, ఆహార శైలులను కూడా మార్చడం అత్యవసరం. వ్యాధులు పెరుగుతున్న సమయంలో కొన్ని ఆహారాలు, సుగంధ ద్రవ్యాలను తీసుకోవాలి. పసుపు కలిపిన పాలు, శొంటి కషాయం, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారం, మొలకలు వంటి ఆరోగ్యకరమైన చిరుతిండి ఇవ్వాలి. పెరుగు వంటి ప్రోబయోటిక్స్ పిల్లల్లో మంచి బ్యాక్టీరియాను పెంచటానికి సహాయపడుతుంది. ఇది చెడు బ్యాక్టీరియా లేదా వ్యాధిని కలిగించే బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడుతుంది. ఆకుపచ్చ కూరగాయలు పోషకాలతో నిండి ఉంటాయి. వెల్లుల్లి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి కాబట్టి ఏదోరకంగా పిల్లలకు ఇవ్వాలి.



తప్పనిసరిగా తీసుకోవలసిన జాగ్రత్తలు

చర్మాన్ని శుభ్రంగా, పొడిగా ఉంచండి: ఈత లేదా స్నానం చేసిన తర్వాత పూర్తిగా శరీరాన్ని ఆరనివ్వటం మంచిది.

కీళ్లనొప్పులా?
ఈ ఆహారం తీసుకోండి




ప్రస్తుతం చాలా మంది చేతులు, తుంటి, వెన్నెముక, మోకాళ్లు, కీళ్లలో నొప్పులతో బాధపడుతున్నారు. ప్రస్తుతం చాలా మందిలో యూరిక్ యాసిడ్ పెరగడం కారణంగా కీళ్ల నొప్పులు, వాపుల సమస్యల బారిన పడుతున్నారు. వ్యాయామాలు చేయడం కారణంగా ఈ నొప్పులు తీవ్ర తరమవుతున్నాయి. ఎలాంటి ఆహారాలు తీసుకుంటే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందో తెలుసుకుందాం.

కీళ్ల నొప్పులతో బాధపడేవారు ప్రతి రోజు ఆహారంలో బాదం, వేరుశెనగ, వాల్‌నట్స్ తీసుకుంటే మంచి ఫలితాలు పొందుతారు. ఇందులో పుష్కలంగా లభించే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఫైబర్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఉ కూడా అధిక పరిమాణంలో లభిస్తుంది. ఎక్కువగా వినియోగించడం వల్ల కీళ్లనొప్పుల నుంచి కూడా సులభంగా ఉపశమనం లభిస్తుంది.



బెర్రీలు

బ్లూబెర్రీస్, బ్లాక్‌బెర్రీస్, స్ట్రాబెర్రీల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల వీటిని ప్రతిరోజు తినడం కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బెర్రీల వల్ల శరీరానికి ఫ్రీ రాడికల్స్ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.



కూరగాయలు

సల్ఫోరాఫేన్ కలిగిన ఆహారాలు తీసుకోవడం వల్ల కూడా సులభంగా యూరిక్ యాసిడ్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కాబట్టి ప్రతి రోజు బ్రోకలీ, కాలీఫ్లవర్‌లను ఆహారంలో తీసుకోవాలి.



ఆలివ్ ఆయిల్

కీళ్ల నొప్పులున్నవారు ఆలివ్ ఆయిల్‌ను వినియోగించి తయారు చేసిన ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరం దృఢంగా మారడంతోపాటు కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్ ప్రతి రోజు తీసుకోవడం వల్ల శరీరానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు లభిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడేవారు రోజూ వీటిని తీసుకుంటే మంచి ఫలితాలు పొందుతారు. మధుమేహం ఉన్నవారు తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.



మామిడి పండ్లే కాదు... ఆకులు కూడా ఆరోగ్యప్రదమే!

మామిడి పండ్లే కాకుండా ఆకులు కూడా శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను కలిగిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పండ్లకయితే సీజన్ కావాలి. అంతవరకు ఎదురు చూడాలి. ఆకులకోసం ఆ అవసరం లేదు కదా...ఇంతకీ మామిడాకులతో ఏ ప్రయోజనాలున్నాయో తెలుసుకుందాం...



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మామిడి ఆకులను నీటిలో మరిగించి తీసుకోవడం ప్రయోజనకరం. డయాబెటీస్, దానికి అనుబంధమైన ఇతర అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తరచు రక్తంలోని చక్కెర పరిమాణాలు పెరిగే వారు ఈ నీటిని తీసుకోవడం మంచిది.

మామిడాకుల కషాయం శరీరంలోని అవయవాలకు ఔషధంగా పని చేయడమే కాకుండా చర్మం, జుట్టు సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో అధిక పరిమాణంలో ఎ, సి వంటి విటమిన్లున్నాయి కాబట్టి వీటిని వినియోగించడం వల్ల శరీరంలో కొల్లాజెన్ పెరుగుతుంది. దీనికారణంగా జుట్టు, చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

కిడ్నీలో స్టోన్స్ కరుగుతాయి.

మామిడి ఆకులను రసంలా చేసి తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యలు తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడేవారికి మామిడి ఆకులతో తయారు చేసిన రసం ప్రభావ వంతంగా తోడ్పడుతుంది.

ఊబకాయం.. ఉబ్బసం...

ఊబకాయం, ఉబ్బసం, డయాబెటిస్ లాంటి సమస్యలతో బాధపడేవారు మామిడి ఆకులతో తయారు చేసిన రసాన్ని ప్రతి రోజు తీసుకోవడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

సినిమా



● ధనుష్

పట్టుకుంటే పది వేలు

బందిపోటుగా, హంతకుడిగా ముద్రపడిన 'కెప్టెన్ మిల్లర్'ను పట్టుకున్న వారికి పదివేల రూపాయల రివార్డును ప్రకటిస్తూ 1930లో ఓ పోలీస్ నోట్ విడుదలైంది. మరి.. అప్పటి ప్రభుత్వానికి కెప్టెన్ మిల్లర్ చిక్కాడా? అసలు అతని కథ ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు డిసెంబరులో థియేటర్స్‌లో దొరుకుతాయి. ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కెప్టెన్ మిల్లర్' టీజర్‌ను విడుదల చేసి, సినిమాను డిసెంబరు 15న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో 'కెప్టెన్ మిల్లర్'లో కీలక పాత్ర చేసిన హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఈ సినిమా కాకుండా ధనుష్ అన్న దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డీ 50'లోనూ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాను'' అని అన్నారు. ''1930–1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్నారు.

నెచ్చెలి విసిరినది వెచ్చని వల...



● సమంత, విజయ్ దేవరకొండ

'ఖుషీ నువ్వు కనబడితే.. ఖుషీ నీ మాట వినబడితే...' అంటూ మొదలైంది 'ఖుషి' సినిమా టైటిల్ సాంగ్. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ఇది. శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. 'ఖుషీ నువ్వు కనబడితే' అని మొదలై, 'హే నెచ్చెలి నెచ్చెలి వచ్చి విసిరినది వెచ్చని వెచ్చని వల.. హే ముచ్చటగా నను గిల్లి గిచ్చినది కల..' అంటూ సాగుతుందీ పాట. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకు లిరిక్స్ అందించగా, ఈ చిత్ర సంగీత దర్శకుడు హిషామ్ అబ్దుల్ వాహబ్ పాడారు.

లక్కీ భాస్కర్



● దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' వంటి వరుస విజయాల తర్వాత తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ధనుష్‌తో 'సార్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రానికి 'లక్కీ భాస్కర్' అనే టైటిల్‌ని ప్రకటించారు. ''నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. ఈ చిత్రం ద్వారా వెంకీ అట్లూరి మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు'' అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

'కాంత'.. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'కాంత' అనే మరో చిత్రం ప్రకటన వెల్లడైంది. ఈ చిత్రంలో దుల్కర్ హీరోగా నటించడంతో పాటు రానాతో కలిసి నిర్మిస్తున్నారు. గతంలో 'నిలా' చిత్రం, 'ద హంట్ ఆఫ్ వీరప్పన్' డాక్యుమెంటరీ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 'కాంత'ను తెరకెక్కించనున్నారు.



● అదితీరావ్ హైదరి

తొలి అడుగు

ఇటు సౌత్.. అటు నార్త్.. కాస్త ఖాళీ దొరికితే డిజిటల్ వరల్డ్... ఇలా వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్నారు హీరోయిన్ అదితీరావ్ హైదరి. అయితే తొలిసారి ఈ బ్యూటీ ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కోలీవుడ్ సమాచారం. తమిళ దర్శక–నటుడు రాజేష్ ఎమ్. సెల్వ ఇటీవల కథానాయిక ప్రాధాన్యంగా సాగే ఓ కథ తయారు చేశారని, ఈ కథ విని, ఇందులోని పాత్ర నచ్చడంతో అదితీరావ్ హైదరి పచ్చ జెండా ఊపారని కోలీవుడ్ టాక్. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెలలో ఆరంభం కానుందట. లేడీ ఓరియంటెడ్ చిత్రాల పరంగా అదితీకి ఇది తొలి అడుగు. మరి.. ఈ తొలి అడుగుతో ఈ తరహా చిత్రాలు ఇంకెన్ని చేస్తారో చూడాలి. ఇక 'సమ్మోహనం, వి, అంతరిక్షం, మహాసముద్రం' వంటి చిత్రాలతో అదితీరావ్ హైదరి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే.

అంతా మంచే జరుగుతుంది

- విష్ణు మంచు



● తేజ్, విష్ణు మంచు, రిషిక

''ఇండస్ట్రీలో ఓ యాక్టర్‌కి, మేకప్ మేన్‌కి ఉన్న బంధం భార్యాభర్తల్లాంటిది. నేను చిన్నప్పటి నుంచి మేకప్‌మేన్ చంద్రగారిని చూస్తున్నాను. ఓ రైటర్‌గా, డైరెక్టర్‌గా, నిర్మాతగా సినిమా చేయటం అంత సులభం కాదు.. ఆయన మంచి మనసుకి అంతా మంచే జరుగుతుంది. 'మాధవే మధుసూదనా' సినిమా పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో విష్ణు మంచు అన్నారు. తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా రూపొందుతోన్న చిత్రం 'మాధవే మధుసూదనా'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామ చంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను విష్ణు మంచు రిలీజ్ చేశారు. బొమ్మదేవర రామచంద్ర రావు మాట్లాడుతూ–''నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన అన్నపూర్ణ స్టూడియో సంస్థకు, నాగార్జునగారికి రుణపడి ఉంటాను. మోహన్‌బాబుగారు సింగపూర్‌లో ఉండటం వల్ల ఆయన స్థానంలో విష్ణుని పంపించినందుకు కృతజ్ఞతలు'' అన్నారు.

హద్దుల్లో ఉంటే అడ్డే ఉండదు

- హీరోయిన్ శ్రీలీల



''చిత్ర పరిశ్రమ అనేది గౌరవం ఉన్న ఇండస్ట్రీ. మన హద్దుల్లో మనం ఉండి సినిమాలు చేసుకుంటే అడ్డేదీ ఉండదు.. ఎలాంటి ఇబ్బందులు రావు. తెలుగమ్మాయి అయిన హీరోయిన్ ప్రణవికి నేను ఇచ్చే సలహా ఇదే'' అని హీరోయిన్ శ్రీలీల అన్నారు. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ద్వారా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీలీల మాట్లాడుతూ– ''స్లమ్ డాగ్ హజ్బెండ్' సినిమా సూపర్ హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాలో వినోదం, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి'' అన్నారు ఏఆర్ శ్రీధర్. ''శ్రీలీల, వైష్ణవీ చైతన్య, ప్రణవి తెలుగు అమ్మాయిలే. నా కొత్త సినిమాకు తెలుగు అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుంటా'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు సానా. ''స్లమ్ డాగ్ హజ్బెండ్' హిట్ అయితే మరో పదిమంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇస్తాం'' అన్నారు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి.

రీల్స్

డబుల్ ఇస్మార్ట్‌లో..



● సంజయ్ దత్

తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారట బాలీవుడ్ నటుడు సంజయ్ దత్. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోని ఓ కీలక పాత్రకు సంజయ్ దత్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఈ చిత్రంలో భాగం కావడానికి సంజయ్ దత్ సుముఖంగా ఉన్నారని టాక్.

కేరాఫ్ దెయ్యం...



● రవిబాబు

ఒకప్పుడు గ్రామాల్లో మాతంగులుగా జీవించిన వారిలో ఒక స్త్రీ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'భయం.. కేరాఫ్ దెయ్యం'. మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా నటుడు–దర్శకుడు రవి బాబు, తాంత్రికుడిగా నటుడు సత్యప్రకాష్ ముఖ్య పాత్రలు చేశారు. సీవీఎస్ఎం వెంకట రవీందర్ నాథ్ దర్శకత్వంలో పెదారికట్ల చేనెబోయిన్న నరసమ్మ, వెంకటేశ్వర్లు నిర్మించారు. ''హారర్, థ్రిల్లర్ అంశాలు జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇటీవల జరిపిన రెండో షెడ్యూల్‌లో రవిబాబుపై సీన్స్ తీశాం. కన్నడ, తెలుగు భాషల్లో నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో తెలియజేస్తాం'' అని దర్శక–నిర్మాతలు అన్నారు.

రోడ్స్ బ్లాకు...



● శివానీ, శ్రీ కమల్

'ఆకు పాకు ఇస్తరాకు.. ఆల్ సైడ్స్ రోడ్స్ బ్లాకు..' అంటూ సాగే పాట 'జిలేబి' చిత్రంలోనిది. 'నువ్వు నాకు నచ్చావ్, 'మల్లీశ్వరి', 'మన్మథుడు' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు కె. విజయ భాస్కర్ కొంత గ్యాప్ తర్వాత తెరకెక్కించిన చిత్రం ఇది. శ్రీ కమల్, శివానీ రాజశేఖర్ జంటగా గుంటూరు రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'ఆకు పాకు..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు.

ఓ ప్రేమకథ



● మోక్ష, వికాస్ వశిష్ట, కుషిత

వికాస్ వశిష్ట, మోక్ష, కుషిత కళ్లపు హీరో హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఈ సినిమా టైటిల్, పోస్టర్‌ను చిత్ర నిర్మాత ఎమ్. సుధాకర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేశారు. ''చదువుకునే టైమ్‌లోనే సినిమా తీయాలనే కల ఉండేది. మంచి టీమ్‌తో 'నీతోనే నేను' తీశాను'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి. ''ఈ సినిమా కోసం టీమ్ ప్రాణం పెట్టి పని చేశారు'' అన్నారు అంజిరామ్. ''ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది'' అన్నారు వికాస్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నవీన్, కెమెరామేన్ మురళీ మోహన్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ బి. కడగండ్ల పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
29-7-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	107	66,160
నిఫ్టీ ▽	14	19,646

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,300	▲	251
డోజోన్స్	34,436	▲	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	▲	2
డాక్స్	16,470	▲	64
షాంఘై	3,275	▲	59
నికాయ్	32,759	▽	132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై		
బంగారం (24 క్యారట్)	59,491 ▽	250
బంగారం (22 క్యారట్)	59,253 ▽	249
వెండి (కిలో)	73,420 ▽	2,006

క్యూ1లో ఐవోసీ టర్న్‌అరౌండ్

నికర లాభం రూ. 13,750 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 13,750 కోట్ల నికర లాభం(స్టాండెలోన్) ఆర్జించింది. ఇది గత దశాబ్ద కాలంలోనే అత్యధికంకాగా.. పెట్రోల్, డీజిల్‌పై లాభదాయకత(మార్జిన్లు) మెరుగుపడటం లాభాలకు కారణమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,993 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది క్యూ4(జనవరి–మార్చి)లో నమోదైన రూ. 10,059 కోట్లతో పోల్చినా తాజా లాభం 37 శాతం జంప్‌చేసింది. వెరసి ఇంతక్రితం 2021–22లో ఆర్జించిన రికార్డ్ వార్షిక లాభం రూ. 24,184 కోట్లలో సగానికిపైగా క్యూ1లో సాధించింది. కాగా.. గతంలో అంటే 2012–13 క్యూ4లో అధిక ఇంధన సబ్సిడీని అందుకోవడం ద్వారా రూ. 14,153 కోట్ల నికర లాభం నమోదైంది. గతేడాది క్యూ1లో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను నిలిపిఉంచడంతో ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజాలు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సైతం నష్టాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుత సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 2 శాతం నీరసించి రూ. 2.21 లక్షల కోట్లకు పరిమితమైంది. ప్రతీ బ్యారల్ చమురుపై స్థూల రిఫైనింగ్ మార్జిన్లు 8.34 డాలర్లకు చేరాయి. ఇంధన అమ్మకాలు 0.6 మిలియన్ టన్నులు పెరిగి 21.8 ఎంటీని తాకాయి. ఈ కాలంలో 18.26 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం క్షీణించి రూ. 95 వద్ద ముగిసింది.

అన్‌లిమిటెడ్ స్టోర్లలో 60% వరకు ఆఫర్లు

హైదరాబాద్: అరవింద్ లైఫ్ స్టైల్ గ్రూప్ అనుబంధ సంస్థ అన్‌లిమిటెడ్ స్టోర్ట్ అన్ని రకాల బ్రాండెడ్ వస్త్రాలపై 60% వరకు ఆఫర్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా అన్ని అన్‌లిమిటెడ్ స్టోర్లలో ఆగస్టు మూడో తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. కస్టమర్లంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది. అన్ని వయస్సుల వారికి సరిపడే సరికొత్త డిజైన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. కొత్త డిజైన్లను కస్టమర్లు ఇష్టపడతారని, నాణ్యమైన ఉత్పత్తులు ఆకర్షిస్తాయని పేర్కొంది.

విదేశాల్లో నేరుగా దేశీ సంస్థల లిస్టింగ్

- కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్; త్వరలో నోటిఫికేషన్
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ కంపెనీలు తమ షేర్లను నేరుగా విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేసుకునేందుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి కోవిడ్–19 సహాయక ప్యాకేజీ కింద 2020 మేలోనే ప్రకటించినప్పటికీ, దీనిపై తాజాగా నిర్ణయం తీసుకుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్వహించిన కార్పొరేట్ డెట్ మార్కెట్ డెవలప్‌మెంట్ ఫండ్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాలు తెలిపారు. 'ఐఎఫ్ఎస్‌సీ ఎక్స్ఛేంజీల్లో లిస్టెడ్, అన్‌లిస్టెడ్ కంపెనీలు నేరుగా లిస్ట్ అయ్యేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది' అని ఆమె చెప్పారు. సంస్థలు అంతర్జాతీయంగా పెట్టుబడులు సమీకరించుకునేందుకు, మెరుగైన వేల్యుయేషన్స్ దక్కించుకునేందుకు దీనితో తోడ్పాటు లభించగలదని మంత్రి పేర్కొన్నారు. మరికొద్ది వారాల్లో దీనికి సంబంధించిన నిబంధనలను నోటిఫై చేయనున్నట్లు ఆర్థిక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. తొలుత గుజరాత్ గిఫ్ట్ సిటీలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ)లో లిస్ట్ అయ్యేందుకు, ఆ తర్వాత ఎనిమిది లేదా తొమ్మిది నిర్దిష్ట దేశాల్లో లిస్టింగ్‌కు అనుమతినివ్వొచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలో బ్రిటన్, కెనడా, స్విట్జర్లాండ్, అమెరికా మొదలైనవి ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి.

స్టార్టప్‌లు.. రిలయన్స్‌కు బూస్ట్..

కొత్త పాలసీతో యూనికార్న్‌లు (1 బిలియన్ డాలర్లకు పైగా వేల్యుయేషన్ గల స్టార్టప్‌లు), విదేశాల్లో లిస్టింగ్‌పై కసరత్తు చేస్తున్న రిలయన్స్ డిజిటల్ విభాగానికి ఊతం లభించగలదని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ప్రస్తుత విధానం ప్రకారం భారతీయ సంస్థలు.. ప్రధానంగా అమెరికన్ డిపాజిటరీ రిసీట్స్ (ఏడీఆర్), గ్లోబల్ డిపాజిటరీ రిసీట్స్ (జీడీఆర్) రూపంలో విదేశాల్లో లిస్ట్ కావాల్సి ఉంటోంది. ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలు ఇదే బాటలో లిస్ట్ అయ్యాయి. విదేశాల్లో లిస్టింగ్ వల్ల భారతీయ కంపెనీలు వివిధ దేశాల్లోని ఎక్స్ఛేంజీల ద్వారా విదేశీ నిధులను సమకూర్చుకునేందుకు వీలుంటుంది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా మెరుగైన పనితీరు

రూ.1,551 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో తన పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం భారీగా పెరిగి రూ.1,551 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.561 కోట్లుగా ఉండడం గమనార్హం. మొత్తం ఆదాయం సైతం రూ.11,124 కోట్ల నుంచి రూ.15,821 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.14,359 కోట్లుగా ఉంది. స్థూల మొండి బకాయిలు జూన్ చివరికి 6.67%కి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.65%కి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు తాజాగా ముగిసిన త్రైమాసికంలో ఇవి రూ.777 కోట్లకు పరిమితమయ్యాయి.

19,650 దిగువకు నిఫ్టీ

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు



ముంబై: ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు తలెత్తడం స్టాక్ సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. అమెరికా బలమైన స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు మరోసారి ఉండొచ్చనే ఆందోళనలు తెరపైకి వచ్చాయి. ఇటీవల దేశీయ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు అనూహ్యంగా పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. యూఎస్ బాండ్లపై రాబడులు పెరగడం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 388 పాయింట్లు క్షీణించి 65,879 వద్ద, నిఫ్టీ 97 పాయింట్లు పతనమై 19,563 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 107 పాయింట్లు నష్టపోయి 66,160 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 14 పాయింట్లు కోల్పోయి 19,646 వద్ద నిలిచింది. ఫైనాన్స్, ఐటీతో పాటు ఆటో షేర్లలోనూ విక్రయాలు తలెత్తాయి. కాగా మెటల్, ఫార్మా, ఇంధన, మీడియా, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్యాంక్ ఆఫ్ జపాన్ యథాతథ ద్రవ్య విధాన వైఖరికే మొగ్గు చూపడంతో పాటు ఉద్దీపన చర్యల కొనసాగింపు ప్రకటనతో ఒక్క జపాన్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అర శాతం పెరిగాయి. కాగా అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక శాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

యథార్ద్ హాస్పిటల్ ఐపీవో సక్సెస్

ఆరోగ్య పరిరక్షణ రంగ సంస్థ యథార్ద్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు శుక్రవారాని(28)కల్లా 36 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. మొత్తం 1,65,17,823 షేర్లను విక్రయానికి ఉంచగా.. 59,72,19,800 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. బీఎస్ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల నుంచి 85 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 37 రెట్లుపైగా బిడ్స్ లభించాయి. రిటైలర్లు సైతం 8.3 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మెరుగైన క్యూ1 ఆర్థిక ఫలితాల ప్రకటనతో ఇండియన్ బ్యాంక్ షేరు 4% లాభపడి రూ. 342 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 5% పెరిగి రూ. 346 వద్ద నాలుగేళ్ల గరిష్ట స్థాయిని అందుకుంది.
- దేశీయ అతి పెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ షేరు 4% లాభపడి రూ. 210 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా రాణించి రూ. 210.40 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- తొలి త్రైమాసికంలో నికరలాభం 30% క్షీణించడంతో జేకే లక్ష్మీ సిమెంట్స్ షేరు ఏడుశాతం నష్టపోయి రూ. 612 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఎనిమిదిశాతం క్షీణించి రూ. 615 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

26 పైసలు కరిగిన రూపాయి


రెండు నెలల్లో అతిపెద్ద పతనం



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ శుక్రవారం గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. భారత్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, ఈక్విటీ మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో దేశీయ కరెన్సీ భారీగా కరిగిపోయింది. అలాగే అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీ విలువల్లో డాలర్ బలపడటం, బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 84 డాలర్ల పైకి చేరుకోవడం కూడా రూపాయిపై ఒత్తిడి పెంచినట్లు ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ ఎక్స్ఛేంజీ మార్కెట్లో డాలర్ మారకంలో ఉదయం 82.30 వద్ద మొదలైంది. రోజంతా బలహీనంగా కదలాడిన రూపీ ఒక దశలో 40 పైసలు క్షీణించి 82.34 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 26 పైసలు కరిగిపోయి 82.18 స్థాయి వద్ద స్థిరపడింది.

రెండున్నరేళ్లలో వేదాంత చిప్ ప్లాంటు

- భారత్‌లో ఏఎండీ 400 మిలియన్ డాలర్ల పెట్టుబడులు
- సెమీకాన్ సదస్సులో కంపెనీల వెల్లడి



గాంధీనగర్: భారత్‌లో సెమీకండక్టర్ల తయారీపై దేశ, విదేశ కంపెనీలు పోటీపడుతున్నాయి. సెమీకాన్ సదస్సు వేదికగా తమ ప్రణాళికలను వెల్లడించాయి. తాము తలపెట్టిన చిప్ ఫ్యాక్టరీ తొలి దశ రెండున్నరేళ్లలో సిద్ధమవుతుందని వేదాంత చీఫ్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. ఇప్పటికే భాగస్వాములను ఎంపిక చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. తొలి దశపై 5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు చెప్పారు. 'రెండున్నరేళ్లలో 2.5 ఏళ్లలో వేదాంత తయారు చేసిన మేడిన్ ఇండియా చిప్‌ను అందించబోతున్నాం' అని అగర్వాల్ చెప్పారు. 20 బిలియన్ డాలర్ల సెమీకండక్టర్ల ప్లాంటు కోసం వేదాంతతో కుదుర్చుకున్న జాయింట్ వెంచర్ నుంచి తైవాన్ కంపెనీ ఫాక్స్‌కాన్ తప్పుకున్న నేపథ్యంలో అగర్వాల్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అటు భారత్‌లో చిప్‌ల తయారీ వ్యవస్థలోకి ప్రవేశించాలంటే 'అత్యంత సాహసికులై' ఉండాలని ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు పేర్కొన్నారు. వేదాంత జాయింట్ వెంచర్ గురించి ప్రస్తావించకుండా, ఇక్కడ ఎదురయ్యే ప్రతి అనుభవం.. కంపెనీలను మరింత దృఢంగా మారుస్తాయని ఆయన చెప్పారు.

ఏఎండీ డిజైన్ సెంటర్..

మరోవైపు, వచ్చే అయిదేళ్లలో భారత్‌లో 400 మిలియన్ డాలర్లకు పైగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు అమెరికన్ చిప్ తయారీ దిగ్గజం అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ (ఏఎండీ) చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ పేపర్‌మాస్టర్ తెలిపారు. బెంగళూరులో తమ కంపెనీకి సంబంధించి అతి పెద్ద డిజైన్ సెంటర్‌ను 5,00,000 చ.అ. విస్తీర్ణంలో ఈ ఏడాది ఆఖరు నాటికి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అయిదేళ్ల వ్యవధిలో 3,000 పైచిలుకు ఇంజనీరింగ్ ఉద్యోగాలను కల్పించనున్నట్లు పేపర్‌మాస్టర్ పేర్కొన్నారు. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో భారత్‌లో తమ కార్యకలాపాలు పది ప్రాంతాలకు విస్తరించినట్లవుతుందని చెప్పారు. భారత్‌లో ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ డిజైన్, ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించడంలో ఏఎండీ ప్రణాళికలు కీలకపాత్ర పోషించగలవని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ట్విటర్‌లో ట్వీట్ చేశారు.

చిప్ ప్లాంటుకు జోరుగా కసరత్తు: మైక్రాన్

గుజరాత్‌లో తమ చిప్ ప్లాంటు ఏర్పాటుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు అమెరికన్ సెమీకండక్టర్ల తయారీ సంస్థ మైక్రాన్ టెక్నాలజీ ప్రెసిడెంట్ సంజయ్ మెహరోత్రా తెలిపారు. దీనితో రాబోయే రోజుల్లో ప్రత్యక్షంగా 5,000, పరోక్షంగా 15,000 మందికి ఉపాధి లభించగలదని ఆయన పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్

సాకేత్–యూకీ బాంబ్రీ ద్వయం ఓటమి



అట్లాంటా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) ద్వయం 6–3, 3–6, 8–10తో నాలుగో సీడ్ నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) జంట చేతిలో పరాజయం పాలైంది. సాకేత్–యూకీలకు 6,830 డాలర్ల (రూ. 5 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అంకిత జోడీ సంచలనం



వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ–250 టెన్నిస్ టోర్నీలో అంకిత రైనా (భారత్)–యు యువాన్ (చైనా) జోడీ సంచలన విజయంతో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. పోలాండ్‌లో శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అంకిత–యువాన్ ద్వయం 3–6, 7–6 (9/7), 10–6తో మూడో సీడ్ విక్టోరియా రుంకోవా–తెరెజా మిహిలికోవా (స్లొవేకియా) జంటపై గెలిచింది.

లక్ష్య సేన్ జోరు

సెమీఫైనల్లోకి భారత స్టార్ ● పోరాడి ఓడిన ప్రణయ్, సాత్విక్–చిరాగ్ జోడీ



లక్ష్య సేన్

టోక్యో: ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–15, 21–19తో ప్రపంచ 33వ ర్యాంకర్ కోకి వతనాబె (జపాన్)పై గెలుపొందాడు. ఈ విజయంతో లక్ష్య సేన్ వరుసగా మూడో టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. కెనడా ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన ఈ ఉత్తరాఖండ్ ప్లేయర్ యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్లో నిష్క్రమించాడు. నేడు జరిగే సెమీఫైనల్లో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో లక్ష్య సేన్ తలపడతాడు. మరోవైపు భారత నంబర్‌వన్ హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–19, 18–21, 8–21తో పోరాడి ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి నిరాశ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 15–21, 23–21, 16–21తో ఒలింపిక్ చాంపియన్స్ లీ యాంగ్–వాంగ్ చిలిన్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది.

సిరీస్ సొంతం చేసుకునేందుకు...

నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో వన్డే

రాత్రి 7 గంటల నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వెస్టిండీస్‌తో తొలి వన్డేలో విజయం భారత్‌కు ఏదైనా మేలు చేసిందా? ఏదైనా కొత్త ప్రయోగానికి పనికొచ్చిందా? అంటే 'లేదు' అనే సమాధానమే వినిపిస్తుంది. వరల్డ్‌కప్‌నకు ముందు మిగిలిన మ్యాచ్‌ల్లో అన్ని రకాలుగా కూర్పును పరీక్షించుకోవాల్సిన మన జట్టు గత పోరులో అనవసరపు ప్రయత్నం చేసింది. ఎంత చిన్న లక్ష్యమైనా... ఆటగాళ్ల స్థానాలు మార్చడం వల్ల గందరగోళమే తప్ప ఉపయోగం లేదని ఆ మ్యాచ్ చూపించింది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో రెండో వన్డేకు టీమిండియా సిద్ధమైంది. సిరీస్ గెలిచే అవకాశంపై సందేహాలు లేకపోయినా టీమ్ మేనేజ్‌మెంట్ ఈ మ్యాచ్‌లో ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందనేది ఆసక్తికరం.



రోహిత్, గిల్

పిచ్, వాతావరణం

తొలి వన్డేలో పిచ్ ఏమాత్రం బ్యాటింగ్‌కు అనుకూలించలేదు. అదే పిచ్‌పైనే ఈ మ్యాచ్ ఆడితే ఇరు జట్లు అదనపు స్పిన్నర్‌ను తీసుకోవచ్చు. మరో పిచ్ మాత్రం బ్యాటింగ్‌కు అనుకూలంగా మంచి స్కోర్లకు అవకాశం కల్పిస్తుంది. మ్యాచ్‌కు వర్షం గండం ఉంది.

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): వరల్డ్‌కప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేసే అవకాశమే లేదు. సూర్యకుమార్ మూడో స్థానంలో ఎలాగూ ఆడడు. అసలు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ కోలుకుంటే వన్డేల్లో అతనికి చోటు కూడా సందేహమే. ఫినిషర్‌గా హార్దిక్ సరైన వ్యక్తి కాగా, నాలుగో స్థానంలో ఆడే చాన్స్ లేదు. వన్డేల్లో హార్దిక్ తొలి ఓవర్ బౌలింగ్ చేయడం అసాధ్యం. కానీ వెస్టిండీస్‌తో తొలి వన్డేలో భారత్ ఈ ప్రయోగాలన్నీ చేసింది. కానీ దానివల్ల ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. నిజంగా జట్టులో అందరికీ బ్యాటింగ్ అవకాశం ఇవ్వాలని భావిస్తే టీమిండియా టాస్ గెలిచాక బ్యాటింగ్ తీసుకోవాల్సింది. ఇప్పుడు భారత్ ముందు అలాంటి అవకాశం ఉంది. తొలి మ్యాచ్ జరిగిన కెన్సింగ్టన్ ఓవల్ వేదికపైనే భారత్, విండీస్ మధ్య నేడు రెండో వన్డేకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్ గెలిచి రోహిత్ సేన సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంటుందా లేక విండీస్ కోలుకొని జవాబిస్తుందా చూడాలి.

సామ్సన్‌ను అవకాశముందా!

సాధారణంగా గెలిచిన జట్టులో మార్పులు ఉండవు. అయితే తొలి వన్డే సమయంలోనే కీపర్‌గా సంజు సామ్సన్‌ను కాకుండా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేయడంపై తీవ్ర చర్చ జరిగింది. రెండేళ్ల వ్యవధిలో అప్పుడప్పుడు మాత్రమే అవకాశాలు దక్కించుకుంటూ సామ్సన్ 11 వన్డేలు మాత్రమే ఆడాడు. అయితే వరల్డ్‌కప్ టీమ్‌లో ఉంచాలనే ఆలోచన ఉంటే మాత్రం అతనికి తగినన్ని మ్యాచ్‌లు ఇవ్వడం కీలకం. ఇషాన్ అర్ధసెంచరీ సాధించి తన వైపు నుంచి ఎలాంటి సమస్య లేకుండా రుజువు చేసుకున్నాడు. మరోవైపు సామ్సన్‌ను మేనేజ్‌మెంట్ ప్రధానంగా మిడిలార్డర్‌లో చూస్తోంది. కాబట్టి ఇషాన్ రాణించినా సామ్సన్‌కూ ఒక అవకాశం ఇవ్వవచ్చు.

ఆదుకునేదెవరు?

భారత్‌పై మంచి రికార్డు ఉన్న హెట్‌మైర్‌పై విండీస్ తొలి మ్యాచ్‌లో ఆశలు పెట్టుకుంది. స్పిన్‌ను సమర్థంగా ఆడగల అతను ఏమాత్రం ప్రభావం చూపకుండా వెనుదిరిగాడు. దాంతో అసలు ప్రత్యర్థిపై దూకుడు ప్రదర్శించగల బ్యాటర్లే ఆ జట్టులో కరువయ్యారు. హోప్ ఫర్వాలేదనిపించినా అది జట్టుకు పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో విండీస్ పోటీలో నిలవాలంటే బ్యాటింగ్‌లో కనీస ప్రదర్శన అయినా ఇవ్వాల్సి ఉంటుంది.

హర్మన్ ఆడేది... ఫైనల్ చేరితేనే!

- నేరుగా క్వార్టర్ ఫైనల్లోకి భారత్
- ఆసియా క్రీడల క్రికెట్ టోర్నీ 'డ్రా'




న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆసియా క్రీడల్లో బరిలోకి దిగాలంటే టీమిండియా ఫైనల్ చేరాలి. ఎందుకంటే చైనా ఆతిథ్యమిచ్చే ఈ ఈవెంట్‌లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ ఎంట్రీ లభించింది. కెప్టెన్ హర్మన్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం ఉన్న నేపథ్యంలో క్వార్టర్స్, సెమీఫైనల్ గెలిచి భారత్ తుదిపోరుకు అర్హత సాధిస్తే తప్ప ఆమె ఆసియా క్రీడల ఆట ఉండదు. చైనాలోని హాంగ్జౌలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8 వరకు ఆసియా క్రీడలు జరుగనున్నాయి. ఇందులో మహిళల క్రికెట్ ఈవెంట్‌లో 14 జట్లు, పురుషుల ఈవెంట్‌లో 18 జట్లు బరిలోకి దిగుతాయి. అయితే ఈ రెండు విభాగాల్లోనూ భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు నేరుగా క్వార్టర్స్ ఫైనల్స్ ఎంట్రీ లభించింది.

'హండ్రెడ్' టోర్నీకి జెమీమా



లండన్: భారత మహిళా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వరుసగా మూడో ఏడాది ఇంగ్లండ్‌లో జరిగే 'హండ్రెడ్' టోర్నమెంట్‌లో ఆడనుంది. గత రెండేళ్లుగా నార్తర్న్ సూపర్‌చార్జర్స్ జట్టుకు ఆడుతున్న ఆమెను ముందుగా ఈ సీజన్ నుంచి తప్పించాలని ఆ ఫ్రాంచైజీ అనుకుంది. అయితే నార్తర్న్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆసీస్ ప్లేయర్ హీథర్ గ్రాహమ్ గాయంతో వైదొలగడంతో చివరి నిమిషంలో 22 ఏళ్ల జెమీమాతో ఆ ఫ్రాంచైజీ మళ్లీ కాంట్రాక్టు కుదుర్చుకుంది. ఈ సీజన్ 'హండ్రెడ్ టి20 టోర్నీ వచ్చేనెల 1 నుంచి 27 వరకు జరుగనుంది. ఇందులో నలుగురు భారత క్రికెటర్లు పాల్గొంటున్నారు. లండన్ స్పిరిట్ జట్టుకు రిచా ఘోష్, ట్రెంట్ రాకెట్స్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్, సదర్న్ బ్రేవ్‌కు స్మృతి మంధాన ఆడనున్నారు.

టి20 ప్రపంచకప్ టోర్నీకి పపువా న్యూ గినీ అర్హత



పోర్ట్ మోర్స్‌బై (పపువా న్యూ గినీ): వచ్చే ఏడాది వెస్టిండీస్–అమెరికాలలో జరిగే టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి ఓసియానియా దేశమైన పపువా న్యూ గినీ (పీఎన్‌జీ) అర్హత సాధించింది. తూర్పు ఆసియా–పసిఫిక్ రీజినల్ క్వాలిఫయింగ్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పీఎన్‌జీ 100 పరుగుల తేడాతో ఫిలిప్పీన్స్‌పై జయభేరి మోగించింది. ఈ మెగా ఈవెంట్‌కు అర్హత పొందిన 15వ జట్టు పీఎన్‌జీ. పీఎన్‌జీ టి20 మెగా ఈవెంట్ ఆడటం ఇది రెండోసారి. యూఏఈలో జరిగిన 2021 టి20 ప్రపంచకప్‌లో ఆ జట్టు గ్రూప్ దశలో నిష్క్రమించింది. వచ్చే ప్రపంచకప్ టోర్నమెంట్‌లో తొలిసారి 20 జట్లు పాల్గొంటున్నాయి.


సౌత్‌జోన్ 'హ్యాట్రిక్' విజయం



రోహన్

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో సౌత్‌జోన్ జట్టు వరుసగా మూడో విజయం సాధించింది. నార్త్ ఈస్ట్‌జోన్‌తో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మయాంక్ అగర్వాల్ నాయకత్వంలోని సౌత్‌జోన్ తొమ్మిది వికెట్లతో గెలిచింది. విద్వత్ కావేరప్ప (3/27), సాయికిశోర్ (3/22) దెబ్బకు ముందుగా బ్యాటింగ్ చేసిన నార్త్ ఈస్ట్‌జోన్ 49.2 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. అనంతరం సౌత్‌జోన్ జట్టు 19.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 137 పరుగులు చేసి విజయం సాధించింది. కేరళ క్రికెటర్ రోహన్ కున్నుమ్మల్ (58 బంతుల్లో 87 నాటౌట్; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. మరో మ్యాచ్‌లో ఈస్ట్‌జోన్ 88 పరుగులతో నార్త్‌జోన్‌పై నెగ్గింది.

భారత హాకీ జట్టుకు రెండో 'డ్రా'



బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న నాలుగు దేశాల పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది. ఇంగ్లండ్ జట్టుతో శుక్రవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 1–1తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (29వ ని.లో), ఇంగ్లండ్ తరఫున సామ్ వార్డ్ (5వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. స్పెయిన్‌తో తొలి మ్యాచ్‌లో ఓడిన భారత్ ... రెండో మ్యాచ్‌ను నెదర్లాండ్స్‌తో 1–1తో 'డ్రా' చేసుకుంది. నెదర్లాండ్, స్పెయిన్ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో ఫైనల్లో ఇంగ్లండ్ ఆడుతుంది.

ఆస్ట్రేలియా 295 ఆలౌట్



స్మిత్

లండన్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న 'యాషెస్' సిరీస్ ఆఖరి ఐదో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 103.1 ఓవర్లలో 295 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 12 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 61/1 తో రెండో రోజు శుక్రవారం ఆట కొనసాగించిన ఆసీస్ 151 పరుగులకే సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో స్మిత్ (71; 6 ఫోర్లు) అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. కమిన్స్ (36; 4 ఫోర్లు), మర్ఫీ (34; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) తొమ్మిదో వికెట్‌కు 49 పరుగులు జోడించారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్ 3 వికెట్లు... బ్రాడ్, వుడ్, రూట్ తలా 2 వికెట్లు తీశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


Reliance
INDULGE IN STYLE
FLAT
50%*
SHOP FOR ₹4999 AND GET A
fcuk®
WATCH FREE
CENTRO
SHOP FROM 350+ INTERNATIONAL
AND NATIONAL BRANDS UNDER ONE ROOF
COME, EXPERIENCE CENTRO
*TERMS & CONDITIONS APPLY
RUNWAY
FASHION
sale
India's Largest Multi-Brand Fashion Festival
HYDERABAD RELIANCE CENTRO | GSM MALL, MIYAPUR MAIN RD, MADEENAGUDA | NAVAYUGA VIZVA, GACHIBOWLI | NEXUS HYDERABAD MALL, KUKATPALLY